పోస్టాఫీసు, బ్యాంకుల వద్ద రద్దీ..!

- 'తల్లికి వందనం' నగదు డ్రా చేసుకునేందుకు బారులు

రాష్ట్ర ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరిస్తోంది. ఆ నగదును తీసుకునేందుకు తల్లులు బ్యాంకులు, పోస్టాఫీసుల వద్ద బారులు తీరారు. ప్రభుత్వం ఆ నగదును మూడు రోజుల క్రితమే వారి ఖాతాల్లో జమచేయగా, ఆ తర్వాత రెండవ శనివారం, ఆదివారం వరుసగా సెలవులు రావడంతో సోమవారం వాటిని తీసుకునేందుకు లబ్ధిదారులు ఉదయం 9 గంటల నుంచే ఆయా బ్యాంకులు, పోస్టాఫీసుల వద్ద బారులు తీరారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



పోస్టాఫీస్ వద్ద రోడ్డుమీదకు బారులు తీరిన ఖాతాదారులు

ఏసీబీ వలలో ఇరిగేషన్ ఉద్యోగి

రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్



ఏసీబీ అధికారులకు పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు

మార్కాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ వలకు జలవనరులశాఖ ఉద్యోగి చిక్కాడు. చెరువుకట్ట అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్ వద్ద నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నెల్లూరు ఏసీబీ డీఎస్పీ శిరీషా కథనం మేరకు.. మార్కాపురానికి చెందిన యేర్వ శ్రీనివాసరెడ్డి కాంట్రాక్టర్. అక్కడి జలనవరుల శాఖ స్పెషల్ డివిజన్ కార్యాలయం పరిధిలో బోడపాడు, ఇడుపూరు, తర్లుపాడులోని చెరువు కట్టల ఆధునికీకరణ పనులను గత సంవత్సరం చేశారు. బిల్లులు చేయడానికి ఈఈ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు రూ.30వేలు లంచం డిమాండ్ చేశారు. తాను అంత మొత్తం ఇవ్వలేనని కాంట్రాక్టర్ చెప్పడంతో ఫైల్స్ పక్కన పెట్టారు. కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు సోమవారం మధ్యాహ్నం ఆయన డబ్బులు తీసుకుని అధికారి వద్దకు వెళ్లారు. ఆయన కనిపించగానే బిల్లు కావాలంటే డబ్బులు ఇవ్వాల్సిందే అని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తేల్చిచెప్పారు. దీంతో శ్రీనివాసరెడ్డి డబ్బులు ఇచ్చి వెళ్లిపోయారు. అప్పటికే మఫ్టీలో వేచి ఉన్న ఏసీబీ అధికారులు ఒక్కసారిగా కార్యాలయంలో దాడులు నిర్వహించారు. రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిన సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం తరలించారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు రమేష్, శేషు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదైంది.. వేగమేది?

రాష్ట్రంలో వైసీపీ పాలనకు చరమగీతం పాడి అఖండ మెజార్టీతో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయింది. ప్రజలు ఇచ్చిన తీర్పుతో జిల్లాలోనూ సానుకూల ఫలితాలే వచ్చాయి. ఈ ఏడాది కాలంలో జిల్లా అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పన, ఎన్నికల సమయంలో ఆయా పార్టీల నేతలు ఇచ్చిన హామీల అమలును పరిశీలిస్తే సానుకూలంగానే అడుగులు పడ్డాయి. అయితే వెనుకబాటుతనంలో ఉన్న జిల్లాను సమగ్రంగా అభివృద్ధి పర్చడంలో, ప్రజల ఆర్థిక, జీవన ప్రమాణాల పెంపు అవసరాలు, ఇచ్చిన హామీలను పరిశీలిస్తే అడుగులతో సరిపెడితే కాదు ప్రభుత్వపరంగా ప్రత్యేక దృష్టిసారించి పరుగులు పెట్టించాల్సిన అవసరం కనిపిస్తోంది.

అడుగులు కాదు... పరుగులు కావాలి

- ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ లేదు
- వర్శిటీ, ట్రిపుల్‌ఐటీలను పట్టించుకోలేదు
- వెలిగొండ, మార్కాపురం జిల్లా,
- జిల్లా అభివృద్ధి, ఉపాధి పెంపు
- మౌలిక రంగాలపై ప్రజల ఆకాంక్ష
- ఏడాది పాలనలో కొన్ని రంగాలపై దృష్టి
- సాగు, తాగునీరు, ఇతర రంగాలపై కదలిక
- ఇంకా ఎక్కువ కోరుతున్న ప్రజలు
- సీబీజీ ప్లాంట్‌కు జిల్లా ఎంపికపై హర్షం





మూతబడిన పాలకేంద్రం (ఫైల్)

ఒంగోలు జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో ఆరు చోట్ల టీడీపీ విజయం సాధించింది. ప్రత్యర్థికి వైసీపీకి పట్టు ఉన్న ప్రాంతాల ప్రజలు సైతం టీడీపీ వైపు మొగ్గారు. ఫలితంగా ఒంగోలు పార్లమెంట్ స్థానాన్ని కూడా సునాయసంగా ఆ పార్టీ గెలుపొందింది. అలా టీడీపీపైనా, నూతన రాష్ట్రప్రభుత్వంపైనా జిల్లా ప్రజలు ఆశలు అధికంగా పెట్టుకున్నారన్న విషయాన్ని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. అయితే ఏడాది కూటమి పాలన పరిశీలిస్తే జిల్లాలో స్థానికంగా ఆయా నియోజకవర్గాలలో అందుబాటులో ఉన్న నిధులతో పలు అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు దృష్టి సారించారు. కొన్ని పనులు చేయగలిగారు. కీలక అంశాలపై నిధుల కొరత కొంత ఆటంకంగా ఉంది. అదే సమయంలో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మిగతా 6లో...

కొత్త టీచర్లతో స్కూళ్లు కళకళ

- ఎక్కువ శాతం ఎస్జీటీలు మార్పు
- 5,458 మందికి స్థానచలనం

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియ ముగియడంతో జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లు కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం ఎక్కువ శాతం టీచర్లకు స్థానచలనం కలిగింది. బదిలీల్లో గరిష్ఠంగా 5,458 మంది మారారు. వీరిలో 295 మంది ఉద్యోగోన్నతులతో బదిలీ కాగా 5,163 మంది ఇతర పాఠశాలలకు వెళ్లారు.

- ఒంగోలు విద్య, ఆంధ్రజ్యోతి

కొత్త బడులకు ఎస్జీటీలు


ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ రంగ ప్రాథమిక పాఠశాలలకు కొత్త టీచర్లతో కళకళలాడుతున్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ ఆదివారంతో ముగియడంతో బదిలీ అయిన సెకండరీ గ్రేడ్ టీచర్లందరూ సోమవారం కొత్త పాఠశాలల్లో చేరారు. జిల్లాలో సెకండరీ గ్రేడ్ (తెలుగు) టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ శనివారం అర్ధరాత్రి ముగియగా సెకండరీ గ్రేడ్ ఉర్దూ టీచర్ల కౌన్సెలింగ్ ఆదివారం మధ్యాహ్నానికి ముగిసింది. ఎస్జీటీలు మొత్తం 3,148 మంది బదిలీ కోసం దరఖాస్తు చేయగా వీరిలో తప్పనిసరి, అభ్యర్థన మేరకు 2,586 మందికి స్థానచలనం కలిగింది. ఎస్జీటీ ఉర్దూ టీచర్లు 76మంది దరఖాస్తు చేయగా 56 మంది బదిలీ అయ్యారు. వీరి బదిలీ ఉత్తర్వులు ఆదివారం అర్ధరాత్రి జనరేట్ అయ్యాయి. టీచర్లు సోమవారం బదిలీ ఉత్తర్వులు డౌన్‌లోడ్ చేసుకున్నారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారందరూ సోమవారం మధ్యాహ్నం 12గంటలలోపు కొత్త పాఠశాలల్లో చేరాలని పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశించారు. దీంతో బదిలీ అయిన టీచర్లందరూ మండల విద్యాధికారులను కలిసి వారి నుంచి రిలీవ్ ఉత్తర్వులు తీసుకొని బదిలీ అయిన కొత్త స్థానాల్లో చేరారు.

ఇదీ లెక్క.. ఉద్యోగోన్నతుల్లో భాగంగా గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా 83మంది స్కూలు అసిస్టెంట్లు, బయాలాజికల్ సైన్స్ 26 మంది, సోషల్ 27, ఫిజికల్ డైరెక్టర్లు 11, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా 166, స్పెషల్ ఎడ్యుకేషన్ 4 పోస్టుల కలిపి 295 పోస్టులను భర్తీ చేశారు. బదిలీల్లో గ్రేడ్ 2 హెచ్‌ఎంలు 101 మంది, మోడల్ ప్రైమరీ స్కూలు హెచ్‌ఎంలుగా 545, స్కూలు అసిస్టెంట్ల తత్సమాన కేటగిరీకి చెందినవారు 1,801, సెకండరీ గ్రేడ్ తెలుగు, ఉర్దూ టీచర్లు 2,647, బాషాపండితులు 11, పీఈటీలు 27, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, ఒకేషనల్ కోర్సులు 31 మొత్తం 5,163 మంది టీచర్లు బదిలీ అయినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఉద్యోగోన్నతి పొందిన వారు బదిలీ అయిన టీచర్లందరూ కొత్త పాఠశాలల్లో చేరిపోయారు.

డీఎస్సీ వారు వచ్చేవరకు పాత పాఠశాలల్లోనే..

ప్రస్తుతం బదిలీ అయిన కొత్త స్థానాల్లో చేరిన ఉపాధ్యాయులు కొందరు మళ్లీ

మిగతా 6లో...



అధికారులు కావలెను!

జిల్లాలో అభివృద్ధి పనులను పర్యవేక్షించే మండల స్థాయి అధికారుల కొరత వేధిస్తోంది. ఏ ప్రభుత్వ పథకం అమలు జరగాలన్నా మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)లే కీలకం. అటువంటి అధికారుల కొరత తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. విభజిత జిల్లాలో 38 మండలాలు ఉండగా 11 చోట్ల ఎంపీడీవోల కొరత ఉండగా, ఒక ఎంపీడీవో శిక్షణ కోసం వెళ్లగా, మరో ఎంపీడీవో ఈనెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారు. ప్రస్తుతం కొరత ఉన్న మండలాల్లో ఈవోపీఆర్‌డీలు లేదా మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేసే అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు(ఏవో) ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు.

- వేధిస్తున్న ఎంపీడీవోల కొరత
- 11 మండలాల్లో ఇన్‌చార్జులే దిక్కు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కొన్ని మండలాల్లో ఎంపీడీవోల కొరత కారణంగా క్షేత్రస్థాయిలో అమలు జరిగే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. మండల స్థాయిలో ప్రభుత్వం అమలు చేసే ఏ పని ముందుకు సాగాలన్న ఎంపీడీవోనే కీలకం. అటువంటి మండలస్థాయి అధికారుల పోస్టులను భర్తీ చేసే విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకొక వైపు గ్రామ పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేసే ఎంపీడీవోలు లేకపోవడంతో తాగునీరు, వీధిదీపాల నిర్వహణ వంటి పనులు మందగమనంలో పడ్డాయి. ఇంకోవైపు ఈ వేసవిలో ముమ్మరంగా సాగే ఉపాధి పనుల నిర్వహణ పర్యవేక్షించేది ఎంపీడీవోలే. అటువంటి అధికారులు లేని కారణంగా ఉపాధి హామీ పథకం పనులు కొన్ని మండలాల్లో అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మండలస్థాయిలో కీలకంగా పనిచేసే అధికారుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం దృష్టిసారించాల్సిన

మిగతా 6లో...

స్వల్పంగా తగ్గిన నోబిడ్‌లు

- 8,777కు 1,804 మాత్రమే వెనక్కి
- క్రమంగా పెరుగుతున్న రోజువారీ వేలంకు వచ్చే బేళ్ల సంఖ్య



ఒంగోలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్‌లో నోబిడ్ (తిరస్కరణ) బేళ్లు సోమవారం స్వల్పంగా తగ్గాయి. గత పక్షం రోజులకుపైగా ఎస్‌ఎల్‌ఎస్ రీజియన్‌లో సగటున రోజుకు 25శాతానికిపైగా, ఆ పరిధిలోని పొదిలి, కనిగిరి, కలిగిరి తదితర కేంద్రాల్లో 30 నుంచి 40 శాతం బేళ్లు నోబిడ్‌లు ఉంటున్నాయి. ఎస్‌బీఎస్ రీజియన్‌లో సగటున రోజువారీ 20శాతం వరకు, ఆ పరిధిలోని ఒంగోలు-1, టంగుటూరు కేంద్రాల్లో 20 నుంచి 25 శాతం వరకు ఉంటున్నాయి. ఇన్నాళ్లూ లోగ్రేడ్ బేళ్లను ఎక్కువగా తిరస్కరిస్తున్న వ్యాపారులు సోమవారం నోబిడ్‌లను స్వల్పంగా తగ్గించారు. రెండు రీజియన్లలో సోమవారం మార్కెట్‌కు మొత్తం 8,777 బేళ్లను తీసుకురాగా 6,201 బేళ్లను కొనుగోలు చేశారు. అలా 2,576 బేళ్లు కొనుగోలు జరగకుండా ఆగిపోగా అందులో బోర్డు అధికారులు సూచించిన ధరకు కొనేందుకు వ్యాపారులు ముందుకు రాక నోబిడ్ అయినవి 1,804 మాత్రమే ఉన్నాయి. మరోవైపు రోజువారీ అమ్మకాలకు వేలం కేంద్రాలకు తెస్తున్న బేళ్ల సంఖ్య కూడా పెరిగింది. ఈనెల తొలివారంలో రోజువారీ తెచ్చే బేళ్ల సంఖ్య ఆరు వేల వరకే ఉండేవి. సోమవారం చూస్తే 8,777 బేళ్లను తెచ్చారు. అలా అమ్మకానికి తెచ్చే బేళ్ల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం, నోబిడ్‌ల సంఖ్య తగ్గదల మార్కెట్లో రైతులకు కాస్త ఉపశమనం కలిగించనుంది.



తిరుమలనాథ..

కనులపండువగా రథోత్సవం

- రాజేశ్వరీ సమేత గొడ్రాలి కొండకు పోటెత్తిన భక్తులు
- సత్రాలలో భారీగా అన్నదానాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

7

ఆయన రూటే సప 'రేటు'

- జలవనరుల శాఖలో అవినీతి జలగ
- చేతులు తడపందే ఫైళ్లు కదలవు
- మధ్యాహ్నం 12 దాటితే ఆఫీసే బార్

6



'తల్లికి వందనం' అర్జీలను వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

7

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

మార్టూరు, జూన్16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలైన ఘటన మండలంలోని రాజుపాలెం కూడలిలో సోమవారం చోటుచేసుకొంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చినగంజాం మండలం సంతరావూరు గ్రామానికి చెందిన చుండూరి కోటేశ్వరరావు, సునీత దంపతులు వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై పెట్లూరివారిపాలెం వెళ్లి పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామం వస్తున్నారు. వారి ద్విచక్రవాహనాన్ని విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో వారు రోడ్డుపై పడడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన కారుతోపాటు డ్రైవరు మురుగన్ పోలీసుల అదుపులో ఉన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

టమోటాల ట్రక్ బోల్తా



రహదారిపై బోల్తాపడ్డ ట్రక్కు

చినగంజాం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): టమోటాల లోడుతో వెళుతున్న వాహనం చినగంజాం సమీపంలోని జాతీయరహదారి టీ-జంక్షన్ సమీపంలోని రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటన సోమవారం చోటు చేసు కుంది. హైవే మొబైల్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి లగేజీ వాహనం టమోటాల లోడుతో బాపట్లకు వెళ్తుంది. ఈ నేపథ్యంలో వాహనం చినగంజాం సమీపంలోని 216వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ని ఢీ కొట్టి బోల్తా పడంది. ఈ ఘటనలో వాహనం డ్రైవర్ ఆర్ శ్రీనివాసరావుకు ఎలాంటి గాయాలు కాలేదు. టమోటాలు అన్ని జాతీయ రహదారిపైన దొర్లాయి. వాహనాన్ని హైవే పోలీసులు ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించి రాకపోకలు ఇబ్బంది లేకుండా చేశారు.

లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారునికి గాయాలు

మార్టూరు,జూన్16(ఆంధ్రజ్యోతి): లారీని ఢీకొని ద్విచక్రవాహనదారుడికి గాయాలైన ఘటన మార్టూరు కూడలి సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకొంది. యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామానికి చెందిన కనపర్తి తేజ అనే యువకుడు వ్యక్తిగత పనుల నిమిత్తం మార్టూరుకు వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో లారీని ఢీకొన్నాడు. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. గాయపడిన ఆయన్ను 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

అద్దంకి, జూన్16(ఆంధ్రజ్యోతి):మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిని సోమవారం అద్దంకి కోర్టులో హాజరుపరచగా, న్యాయాధికారి అఖిల ఒక్కొక్కరికి 2 వేల రూపాయలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

జూదరుల అరెస్టు

బల్లికురవ. జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో పేకాట శిబిరంపై ఎస్ఐ వై.నాగరాజు సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఘటన స్థలంలో ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి ఉన్న రూ.2800 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పట్టుబడిన జూదరులను కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

పీ-4 కార్యక్రమం మండలం నుంచి చేయడం సంతోషకరం

చినగంజాం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం మొట్టమొదటిసారిగా చినగంజాం మండలం నుంచి చేయడం సంతోషకరమని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పీ-4 లబ్ధిదారులకు ఆయన చెవిటి మిషన్లు, ట్రై సైకిళ్లను అందజేశారు. మండలంలో ఎంపిక చేసిన 13 మంది పీ-4 లబ్ధిదారులకు చేయూతను అందించేందుకు రూ.10.95 లక్షలను అందించినట్లు ఏపీఎం గద్దె పెదసుబ్బారావు తెలిపారు. పెదగంజాం గ్రామానికి చెందిర కే.వెంకటరెడ్డికి ట్రై సైకిల్, ముగ్గురికి చెవిటి మిషన్లు, 9 మందికి వివిధ వ్యాపారాల నిమిత్తం రూ.10 లక్షలను అందజేసినట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు, పీ-4 లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆయన రూటే సప'రేటు'

జలవనరుల శాఖలో అవినీతి జలగ
చేతులు తడపందే ఫైళ్లు కదలవు
మధ్యాహ్నం 12 దాటితే ఆఫీసే బార్



జలవనరులశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం

మార్కాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జలవనరుల శాఖకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. దీంతో ఆ కార్యాలయం వైపు తొంగి చూసిన కాంట్రాక్టర్ లేరు. కానీ గత సంవత్సరం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ పరిస్థితి మారింది. జలవనరుల శాఖ కార్యాలయం కళ కూడా మారింది. డివిజన్ మొత్తం చెరువుల ఆధునికీకరణకు ప్రభుత్వం సమృద్ధిగా నిధులు కేటాయించింది. దీంతో మళ్లీ కాంట్రాక్టర్‌లతో ఆ కార్యాలయంలో కళకళలాడుతోంది. ఇదే అదునుగా భావించారు డివిజన్ ఈఈ కార్యాలయంలో పనిచేసే ఓ కీలక ఉద్యోగి. రెగ్యులర్ అధికారి ఎవరూ అందుబాటులో లేకపోవడంతో పోస్టు చిన్నదే అయినా అతను చెప్పిందే వేదంగా మారింది. అతని ప్రమేయం లేనిదే ఎలాంటి ఫైళ్లయినా ఆఫీసులోంచి కదలవు. డీఈ స్థాయి అధికారులు కూడా అతను చెప్పినట్లు వినాల్సిందే. ఉద్యోగుల యూనియన్‌లో కూడా కీలకమైన పదవుల్లో ఉండడంతో అతని జోలికి వెళ్లే సాహసం ఎవరూ చేయడం లేదు. అధికార పార్టీకి చెందిన చిన్నపాటి కాంట్రాక్టర్‌ల వద్ద కూడా ముక్కుపిండి మరీ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అది ఎంతటి పనైనా లెక్కకట్టి అతనికి సమర్పించుకోవాల్సిందే. మధ్యవర్తులు, దళారులతో పనిలేకుండా నేరుగా లంచం తీసుకోవడం ఆయన నైజం. అంతేకాక మధ్యాహ్నం అయిందంటే చాలు అతని కార్యాలయాన్ని బార్‌గా మార్చుకోవడం పరిపాటిగా మారింది. అతని ఆఫీస్ ర్యాకుల్లో ఎప్పుడూ మద్యం సీసాలు దర్శనమిస్తుంటాయి. ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోవడం, ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో అతను ఏం చేసినా సాగిపోతోందని కార్యాలయంలో పలువురు ఉద్యోగులు చెప్తున్నారు. ఒకసారి ఎస్ఈ కార్యాలయానికి బిల్లు కోసం పంపిన ఫైలు వెనక్కి వచ్చింది. దానిని మళ్లీ పంపేందుకు కూడా లంచం డిమాండ్ చేయడంతోనే కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. వ్యవహారంలోనే డబ్బులు తీసుకుంటూ సదరు ఉద్యోగి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

ఎంతటి వారైనా కప్పం కట్టందే ఫైళ్లు కదలవు

మార్కాపురం జలవనరుల శాఖ ఈఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కాకి శ్రీనివాసరావు అవినీతికి కేరాఫ్‌గా మారారు. డివిజన్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పని జరిగినా ఆయన వద్ద నుంచే ఫైళ్లు ఉన్నతాధికారుల టేబుల్‌ల మీదికు వెళ్లాలి. పని దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో ముందుగా పర్సంటేజీల విషయమై డీల్ కుదుర్చుకునేది ఆయనే. అన్నీ అనుకున్నట్లు కాంట్రాక్టర్ చేయి తడిపితే ఫైళ్లు ముందుకు కదిలి బిల్లులు వస్తాయి. ఏ మాత్రం ఆయన్ని పట్టించుకోకపోయినా, లెక్క తగ్గినా ఇక అంతే సంగతులు. నెలలు, సంవత్సరాలు గడిచినా బిల్లులు రాకుండా కొర్రీలు వేయగల సమర్థుడు. దీంతోనే అతనంటే కాంట్రాక్టర్లు హడలెత్తి పోతున్నారు. ప్రస్తుతం ఇరిగేషన్ పనులకు సంబంధించి 15 నుంచి 20 శాతం పర్సంటేజీలు నడుస్తున్నట్లు సమాచారం. కాంట్రాక్టర్‌ల వద్ద లంచాలు తీసుకోవడం ఒక ఎత్తైతే చివరికి అధికారులను కూడా ఆయన వదల్లేదని తెలుస్తోంది. ఈ మధ్యనే మార్కాపురం వచ్చిన ఓ అధికారికి సంబంధించిన ఇంక్రిమెంట్ల బిల్లుల ఫైళ్లు ఉన్నతాకారులకు పంపడానికి కూడా లంచం డిమాండ్ చేసినట్లు ఆఫీసు వర్గాలు తెలిపాయి. వాస్తవానికి చాలా చిన్నపనే అయినా సబ్ డివిజన్ స్థాయి అధికారి అయిన ఆయన రూ.15వేలు లంచం ఇవ్వందే ఫైలు పంపనట్లు తెలిసింది. తిలాపాపం తలా గరిటెడులా పర్సంటేజీల్లో అన్ని స్థాయిల అధికారులకు వాటాలు ఉండడంతోనే అతను చెప్పినట్లే నడుస్తున్నట్లు తెలుస్తోంది.

మధ్యాహ్నం అయితే మద్యం పరవళ్లు

పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు చేయించుకునేందుకు కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేయడం సహజం. ఈ క్రమంలో కీలకమైన ఆ ఉద్యోగి వద్దకు వెళ్తే సర్వంటేజీలతోపాటు మద్యం సీసాలు కూడా ఇవ్వాల్సిందే. మధ్యాహ్నం 12.00 గంటలు దాటితే అతని కార్యాలయం బార్‌గా మారిపోవడం పరిపాటి. ఆఫీస్ టేబుల్‌పైనే ఉద్యోగుల యూనియన్‌లోని సహచరులు, కాంట్రాక్టర్‌లతో కలిసి పనివేళల్లోనే పూటుగా మద్యం తాగడం అతని ఆనవాయితీ. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులు మందలించినా పరిస్థితిలో మార్పురాలేదని కార్యాలయ వర్గాలు చెప్తున్నాయి. ఏసీబీ అధికారులు సోమవారం చేసిన దాడుల్లో కూడా కొన్ని సీసాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది. కానీ ఈ విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు సమాచారం.

శరవేగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం



అద్దంకిలోని ద్వారకానగర్ వద్ద నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

అద్దంకి, జూన్16(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం రెండు సబ్‌స్టేషన్లను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గత నెల 30 న వీటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎస్ఎస్‌పీ కార్యాలయం ఆవరణ లో 6.7 కోట్ల రూపాయలతో సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్, శింగరకొండ రోడ్డు లోని ద్వారకానగర్ వద్ద 4.5 కోట్ల రూపాయలతో సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే అత్యధిక శాతం నిర్మాణ పనులు పూర్తి కాగా, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటికి అనుసంధానంగా విద్యుత్‌లైన్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఎస్ఎస్‌పీ కాలనీలోని సబ్‌స్టేషన్ ద్వారా శ్రీనగర్, రామ్‌నగర్, నర్రావారిపాలెం, గాంధీబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాలకు, ద్వారకానగర్ వద్ద ఏర్పాటు చేసే సబ్‌స్టేషన్ ద్వారా అద్దంకి పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్, పాత దామావారి పాలెం, దర్శి రోడ్లలోని వివిధ ప్రాంతాలతో పాటు అద్దంకి పట్టణానికి మంచి నీటి పంపింగ్ చేసే గుండ్లకమ్మనది లోని ఊటబావుల మోటార్‌లకు, మండలంలోని తిమ్మాయపాలెం, రామాయపాలెం గ్రామాలకు తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించే అవకాశం కలుగుతుంది.

కనీసం మరో దశాబ్దకాలం పాటులో ఓల్టేజ్ సమస్య లేకుండా ఉండే విధంగా ముందస్తు ప్రణాళికతో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. త్వరలో అద్దంకి పట్టణ విద్యుత్ వినియోగదారులకు లో-వోల్టేజీ సమస్య నుండి విముక్తి కలగనుంది.

ఏడాదైంది.. వేగమేది?

(5వపేజీ తరువాయి)

సారించినవి, గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిన రోడ్ల అభివృద్ధి, తాగునీటి పనులు లాంటివి కొన్ని జరిగాయి. విద్య, వైద్య రంగాల్లో కొంత కృషి చేశారు.

అభివృద్ధి, ఉపాధిలో వేగం కరువు

జిల్లావ్యాప్తంగా ప్రభావం చూపే అన్నివర్గాల ప్రజలకు మేలు చేసే అభివృద్ధి, ఉపాధి కల్పన పనులు, మౌలిక సదుపాయాల విషయంలో అడుగులే తప్ప ఆశించిన కృషి జరగలేదు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటు, ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ, ఆంధ్రకేసరి వర్శిటీ, ట్రిపుల్ ఐటీ నిర్మాణాలు, దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి ప్రాంత నిమ్జ్‌లో పరిశ్రమల ఏర్పాటు, కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు, ఒంగోలులో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఇతరత్రా ఉండగా అవసరమైన స్థాయిలో ప్రభుత్వం దృష్టిపెట్టలేదు. వెలిగొండను ప్రాధాన్యత ప్రాజెక్టుగా ప్రభుత్వం తీసుకున్నా తదనుగుణంగా పనులు సాగడం లేదు. కీలకమైన నిర్వాసితుల పునరావాస చర్యలకు ఈ ఏడాది కాలంలో నిధులు ఇవ్వలేకపోవడం ప్రధాన ప్రతికూల అంశం. దాని వల్ల ప్రాజెక్టు మరింత జాప్యం జరిగే పరిస్థితి ఏర్పడింది. ఆర్థికభారం అంతగా ఉండని మార్కాపురం జిల్లాపై కాస్త కదలిక మొదలైంది.

● డెయిరీని ఏం చేస్తారో..

జిల్లా పాడి రైతాంగానికి బాసటగా నిలిచే ఒంగోలు డెయిరీకి గత వైసీపీ ప్రభుత్వం సమాధి కడితే టీడీపీ వస్తే తిరిగి పునరుద్ధరిస్తారన్న ఆశ ఉంది. తదనుగుణంగానే పార్టీ అధినేతగా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లు హామీ ఇచ్చారు. కాని ఏడాది కాలంలో ఆవైపు ఒక్క అడుగు పడలేదు. ఇక ఆంధ్రకేసరి వర్శిటీ, ట్రిపుల్‌ఐటీ నిర్మాణాలు ప్రారంభం కాకపోవడం లోపమే. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి ఏర్పాటుచేసిన దొనకొండ కారిడార్, అంతకు ముందే మంజూరైన కనిగిరి నిమ్జ్‌లో పరిశ్రమలు రాకపోవడంతో ఉపాధి అవకాశాలు పెరగలేదు. పశ్చిమ ప్రాంతంలో ప్రజల వైద్యానికి భరోసా ఇచ్చే మార్కాపురం మెడికల్ కాలేజీ, దోర్నాలలో ట్రైబల్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల పురోగతి లేకపోగా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పశ్చిమ ప్రాంత భారీ తాగునీటి ప్రాజెక్టుల్లో కదలిక లేదు. ఏడాదిలో ఇలాంటివి అన్నీ చేసే అవకాశం ఉండకపోయినా ఆ దిశగా గట్టిప్రయత్నం జరుగుతుందన్న భరోసా ప్రజలకు కలగడం లేదు.

కొన్ని పర్వాలేదు..

అదే సమయంలో రాష్ట్రంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయతలపెట్టిన సీబీజీ ప్లాంటు ఏర్పాటుకు తొలి ప్రాధాన్యం జిల్లాకు ఇవ్వడం కాస్తంత ఊరటనిచ్చే విషయం. అందులో కనిగిరి ప్రాంతంలో ఒక ప్లాంట్‌కు శంకుస్థాపన కూడా చేయడం, దానికి ఏకంగా యువనేత నారా లోకేష్ రావడం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నమ్మకం కలిగిస్తోంది. కొన్ని ఇంకా ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గుండ్లకమ్మ గేట్ల పనులు పూర్తి, సాగర్ కాలువలలో అత్యవసర పనులకు నిధుల కేటాయింపు సానుకూల అంశాలుగా ఉన్నాయి. మొత్తంగా ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో కొన్ని అంశాల్లో అభివృద్ధి వైపు దృష్టిపెట్టినా అవి అడుగులగానే కనిపిస్తుండగా పరుగు కావాలన్న ఆకాంక్ష జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతోంది.

కంపు కొడుతున్న మార్టూరు ప్రధాన కూడలి

● రోడ్డుపైనే నిలుస్తున్న మురుగునీరు



మార్టూరులో పెద్ద అండరుపాస్ వద్ద నిలబడిన మురుగునీరు

మార్టూరు, జూన్15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్య వైఖరితో మార్టూరు కూడలి దుర్గంధభరితంగా మారుతోంది. రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఆ నీటిపై నుంచి వెళ్లాల్సి వస్తోంది. రోడ్డుకు పడమర వైపు ఉన్న సైడు కాల్వల నుంచి మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. దీంతోపాటు తూర్పు వైపున కూడా సైడు కాలువలు లేవు. దీంతో మురుగునీరు రోడ్డుపైనే నిలుస్తోంది. ఇక ఒక మోస్తరు వానకురిసిందంటే రోడ్డుపక్కన సర్వీసు రోడ్డుపైనే కాకుండా, ఏకంగా జాతీయరహదారిపైనే నీళ్లు భారీగా నిలుస్తున్నాయి. నాగరాజుపల్లి కూడలి నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులో చాలా చోట్ల మురుగునీరు నిలబడుతోంది. అదేవిధంగా మార్టూరులో కొణిదెనరోడ్డు, నాగరాజుపల్లి రోడ్లలోని మిని అండరుపాస్‌లలో కూడా మురుగునీరు బయటకువెళ్లే దారి లేదు. దీంతో దుర్వాసన వస్తుండడంతో పాదచారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దానికి తోడు సర్వీసురోడ్డు పక్కన ఉన్న చికెన్ దుకాణాలు వారు, ఇతరత్రా దుకాణాలు వారు తమదుకాణాలు నుంచి వచ్చే కలుషితనీటిని, మురుగునీటిని రోడ్డుపైకి వెళ్లే విధంగా రోడ్డును పగలగొట్టి తూము ఏర్పాటు చేశారు. దీంతో ప్లై ఓవర్‌కు ఇరువైపులా, సర్వీసురోడ్డులలో రోడ్డును పగలగొట్టిన సంఘటనలు ఉన్నాయి. వానలు కురిసి, రోడ్డుపైన నీళ్లు నిలబడినసమయంలో వాహనదారులకు ఎక్కడ గుంత ఉందో తెలియక, రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. మురుగునీరు రోడ్డుపైన నిలబడకుండా, సైడుకాల్వల్లో సక్రమంగా మురుగునీరు పారేవిధంగా జాతీయ రహదారి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజానీకం కోరుతున్నారు.



మార్టూరు సెంటర్లో రోడ్డుపైన నిలిచిన మురుగునీరు

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

అద్దంకిటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటి అధ్యక్షురాలు గడ్డం అనంత లక్ష్మి కోరారు. సోమవారం అమరావతిలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ వేణుగోపాలరెడ్డిని తన కార్యాలయంలో కలిసి పలు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు.

ఉన్నత లక్ష్యాలతో చదవాలి

అవీఇవీ



ఉదయ్‌క్రిష్ణారెడ్డిని సన్మానిస్తున్న కడవకుదురు హెచ్ఎం ఉపాధ్యాయులు

చినగంజాం, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : యూపీఎస్‌సీ సివిల్ సర్వీస్ ఆల్ ఇండియా స్థాయిలో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన మూలగాని ఉదయ్ కృష్ణారెడ్డిని కడవకుదురు జడ్పీ పాఠశాల ఆవరణలో కడవకుదురు, చినగంజాం జడ్పీ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం కడవకుదురు జడ్పీ పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉదయకృష్ణారెడ్డి, పాఠశాల విద్యార్థులు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని విద్యను అభ్యసించాలన్నారు. ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని అధికమించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్ఎం. కే.శ్రీనివాసరెడ్డి, కడవకుదురు, చినగంజాం జడ్పీ పాఠశాలల ఉపాధ్యాయులు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అధికారులు కావలెను!

(5వపేజీ తరువాయి)

అవసరం ఉంది.

ఉద్యోగోన్నతుల ద్వారానే భర్తీ

ప్రస్తుతం మండలస్థాయిలో కీలకంగా ఉండే మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీచేసే అవకాశం ఉన్నా ఆ వైపు దృష్టిసారిస్తున్న పరిస్థితి లేకుండాపోయింది. గతంలో జిల్లాలో పనిచేసిన సీనియర్ ఎంపీడీవోలకు డీఎల్‌డీవోలుగా ఉద్యోగోన్నతి రావడంతో ఇతర జిల్లాలకు వెళ్లారు. ఆ తర్వాత ఖాళీ ఏర్పడిన ఎంపీడీవోల పదవులను భర్తీచేయాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి ఉంది. కూటమి అధికారంలోకి వచ్చాక ఈవోఆర్‌డీలకు డిప్యూటీ ఎంపీడీవో హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంపీడీవోలను ఏవో, డిప్యూటీ ఎంపీడీవోలతో భర్తీచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అనుగుణంగా సీనియార్టీ జాబితాలను కూడా రూపొందించారు. అయితే మరలా ప్రభుత్వం నుంచి అవసరమైన ఆదేశాలు రాకపోవడంతో ఉద్యోగోన్నతుల ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. ఏదిఏమైనా ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పనులు ముందుకు సాగాలంటే ప్రభుత్వం ఎంపీడీవోలను పూర్తి స్థాయిలో నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో ఎంపీడీవోల ఖాళీలు ఇలా

వెలిగండ్ల, పీసీపల్లి, పెద్దారవీడు, మార్కాపురం, కురిచేడు, పుల్లలచెరువు, తాళ్ళూరు, నాగులుప్పలపాడు, పొదిలి, కనిగిరి, గిద్దలూరు మండలాలు ఉన్నాయి.

కొత్త టీచర్లతో స్కూళ్లు కళకళ

(5వపేజీ తరువాయి)

వెనుక్కు వచ్చి పాత పాఠశాలల్లోనే పనిచేయాల్సి ఉంటుంది. మెగా డీఎస్సీలో కొత్త టీచర్లు వచ్చే వరకు వీరు పాత చోటనే పనిచేయక తప్పదు. ఒక పాఠశాలలో ఇద్దరు టీచర్లు పనిచేస్తూ ఇద్దరు బదిలీ అయితే ముందు వారు కొత్త పాఠశాలల్లో చేరాలి. ఆ తర్వాత ఆ ఇద్దరిలో జూనియర్ మళ్లీ వెనక్కు వచ్చి పాత పాఠశాలలో పనిచేయాలి. జీతం మాత్రం కొత్త పాఠశాలలో తీసుకోవాలి. ఈ మేరకు అన్ని పాఠశాలల్లో కనీసం ఒకరైనా రెగ్యులర్ టీచర్ ఉండేలా ఏర్పాటు చేయాలని డీఈవో, ఆర్‌జేడీలను పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు.

నామ్‌రోడ్డులో పెరిగిన ప్రమాదాలు

అద్దంకి పట్టణ పరిధిలోనూ తగ్గని వాహనాల వేగం
నివారణ చర్యలు శూన్యం



రామ్‌నగర్ వద్ద నామ్ రోడ్డును దాటుతున్న గేదెలు



రామ్‌నగర్ వద్ద రోడ్డు దాటుతున్న స్థానికులు

అద్దంకి, జూన్16(ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణంలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. దీంతో కొంత మంది ప్రాణాలు కోల్పోతుండగా మరికొంత మంది గాయాలబారిన పడుతున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదాలు స్థానికులను, వాహనచోదకులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ ప్రతినిధులకు కనీసం చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అద్దంకి పట్టణంలో వాహనాల వేగ నియంత్రణకు తీసుకున్న చర్యలు లేకపోవడంతో ట్రాఫిక్ రద్దీ లేని సమయంలో మరింత వేగంగా వెళ్తున్నాయి. ప్రధానంగా అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్, అంబేడ్కర్‌బొమ్మ కూడలి, పాతబస్టాండ్ కూడలి, ఆర్టీసీ బస్టాండ్, పోతురాజు గండి, భవానీసెంటర్, కలవకూరు క్రాస్ రోడ్డు, శింగరకొండ క్రాస్ రోడ్ల వద్ద రోడ్డు దాటే వాహనచోదకులు, పాదచారులు ఎక్కువగా ఉంటారు. ఈ నేపథ్యంలో వేగ నియంత్రణ తెలియజేసే విధంగా, ఎంతవేగంతో వెళ్లాలో తెలిపే విధంగా రోడ్డు అంచుల్లో ఆయా ప్రాంతాలలో బోర్డులు ఏర్పాటు చేస్తే కొంతమేర ప్రమాదాలు తగ్గుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భవానీసెంటర్‌లో స్పీడుబ్రేకర్లు ఉండడం, మలుపుకావడంతో వాహనాలు నిదానంగా వెళుతున్నాయి. ప్రధానంగా రామ్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, కలవకూరు క్రాస్‌రోడ్డు, శింగరకొండ క్రాస్ రోడ్ల వద్ద స్పీడు బ్రేకర్ లు ఏర్పాటు చేయడంతో పాటు తగు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఇప్పటికే పోలీస్ అధికారులు నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ అధికారుల దృష్టికి తీసుకు పోయినా స్పందన లేనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా స్పందించి స్పీడు బ్రేకర్లు, బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతృప్తి

చీరాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజలకు అందిస్తున్న పథకాలతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. వాడరేవు మత్స్యకార 100 కుటుంబాలు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువాలతో వారిని ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యాలతో అయోమయంలో ఉన్న ప్రజలకు కూటమి ప్రభుత్వంతో ఉత్సాహం అందిందన్నారు. ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమంతో ప్రజాపార్టీగా నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలనాథ..

కనులపండువగా రథోత్సవం

రాజేశ్వరీ సమేత గొడ్రాలి కొండకు పోటెత్తిన భక్తులు

సత్రాలలో భారీగా అన్నదానాలు.. సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు






ప్రత్యేకాలంకరణలో తిరుమలనాథుని మూలవిరాట్

హాజరైన భక్తులు

పెద్దారవీడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాజేశ్వరీ సమేత గొడ్రాలి కొండ తిరుమలనాథ స్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రథోత్సవం నిర్వహించారు. మూల విరాట్‌లను ప్రధానార్చకులు భవానీప్రసాద్ ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితులు తిరుపతిశర్మ, అనిల్‌శర్మ వేదమంత్రాలతో సర్వపూజలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణంతో పాటు పరిసరాలన్నీ గోవిందనామాలతో మారుమోగాయి. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలలో సామాజిక వర్గాలపరంగా ఏర్పాటు చేసిన సత్రాలలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. రథాన్ని పూలమాలలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. స్వామి రథోత్సవానికి ఉభయదాతలైన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల ఆనందోత్సాహాల నడుమ రథోత్సవం ప్రశాంతంగా సాగింది. అనంతరం టీడీపీ, వైసీపీ నేతల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



స్వామి రథోత్సవం

అశ్వవాహనంపై వేంకటేశ్వరుడు

ముగిసిన సప్తమ బ్రహ్మోత్సవాలు



అశ్వవాహనంపై వేంకటేశ్వరుడు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : శివాజీ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరుని ఆలయంలో సప్తమ బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు దరూరీ అరుణ్‌కుమారాచార్యులు వేంకటేశ్వరుని ఉత్సవమూర్తిని అశ్వవాహనంపై ఆసీనులయ్యారు. అనంతరం నగరోత్సవాన్ని చేశారు. మహాపూర్ణాహుతి, శ్రీచక్ర స్నానం, పుష్పయాగం, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పాలెం చెంచయ్య, అధ్యక్షుడు టీపీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎం.కొండలరావు, అదనపు కార్యదర్శి నిట్టూరి రమేష్, కోశాధికారి వేమలు పిచ్చిరావు, సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న చెన్నంపల్లి రైతులు

పెద్దారవీడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. పుల్లలచెరువు మండలం చెన్నంపల్లికి చెందిన రైతులు సోమవారం పెద్దారవీడు మండలం కుంటలో అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నర్సిరెడ్డి మాట్లాడుతూ తాము పండించిన పొగాకును విక్రయించేందుకు జీపీఐ కంపెనీ వద్దకు తీసుకొచ్చామన్నారు. కంపెనీ ప్రతినిధులు దానిని కొనుగోలు చేసేందుకు విముఖత చూపుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పొగాకును కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాస్తారోకోలో సుమారు 60మంది రైతులు పాల్గొన్నారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్ సిబ్బందితో రైతులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కంపెనీ ప్రతినిధులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలపడంతో విరమించారు. కార్యక్రమంలో రైతులు భాస్కర్‌రెడ్డి, తమ్మినేతి వెంకటేశ్వర్లు, పి.చిన్నగురవారెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

కార్యకర్తల అక్రమ అరెస్టులు దారుణం



మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి, ఇతర నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పొదిలిలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనలో పాల్గొన్న వైసీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకుల మెప్పు కోసం అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేశారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక జిల్లా జైలులో రిమాండ్ ఉన్న వైసీపీ కార్యకర్తలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీమంత్రి నాగార్జున, మార్కాపురం, చీరాల, ఒంగోలు ఇన్‌చార్జులు అన్నా రాంబాబు, కరణం వెంకటేష్, చుండూరి రవిబాబులతో కలిసి పరామర్శించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసినంత మాత్రాన భయపడేది లేదన్నారు. ఇటువంటి విధానాలను మంచిది కాదని హెచ్చరించారు.

సమాజాభివృద్ధికి శ్రీశ్రీ సేవలు స్ఫూర్తిదాయకం

చీరాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధి కోసం తన అభ్యుదయ గేయాలతో ఉత్సాహపరిచిన మహనీయులు, సినీకవి, శ్రీశ్రీ సేవలు ఎనలేనివని అభ్యుదయభావాల రాష్ట్ర చైతన్య ప్రచారం ప్రతినిధులు, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాన్ని సోమవారం చీరాల - పేరాల ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కవిత్వాలను కొనియాడారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు గాదె హరిహరరావు, అప్పన్నరెడ్డి, సూర్యనారాయణ, జేజిబాబు, శామ్యూల్‌రాజు, సుభానీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకం కింద ఆర్థిక ప్రయోజనం దక్కలేదంటూ వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారంసాయంత్రం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. తల్లికి వందనం లబ్ధిదారులు, అనర్హుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏయే కారణాల వల్ల ఆర్థిక ప్రయోజనం దక్కలేదో తల్లిదండ్రులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధి పథకంలో వ్యవసాయ, అనుబంధ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఫారంపాండ్స్ నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కమ్యూనిటీ ఇంకుడు గుంతలను కూడా తవ్వించాలని చెప్పారు. రోజువారీ ఉపాధి సగటు కూలీ రూ.251 ఉందని, దీనిని రూ.275కు తగ్గకుండా చూడాలన్నారు. ఉద్యానవనశాఖ ద్వారా మొక్కల పెంపకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వకార్యాలయాలు, పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులు, వసతి గృహాల్లో విరివిగా మొక్కలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గోకులం షెడ్ల నిర్మాణ బిల్లులు వారం రోజుల్లో జమవుతాయని కలెక్టర్ తెలిపారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో పది లక్షల మందితో యోగాసనాలు చేసేలా ఇస్తున్న శిక్షణలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న అందరూ పాల్గొనే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు జోసఫ్‌కుమార్, చిరంజీవి, శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ వెంకటేశ్వర్లు, గొట్టిపాటి వెంకటనాయుడు, వెంకటేశ్వరరావు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలుకు సన్నాహాలు

జేడీ ఆధ్వర్యంలో పర్చూరు ఏఎంసీ గోడౌన్ల పరిశీలన



పర్చూరు ఏఎంసీ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జేడీ శ్రీనివాసరావు

పర్చూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద ఉన్న పొగాకు నిల్వలను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా ఇప్పటికే కార్యాచరణ రూపొందించింది. కొనుగోలు చేసిన పొగాకును నిల్వచేసుకునే విధంగా మార్కెట్ యార్డులలోని గోడౌన్లను కూడా సిద్ధం చేసింది. దీనిలో భాగంగా పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపట్టనున్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మార్కెట్‌యార్డ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పరిశీలించి వసతులు తదితర అంశాలను స్థానిక మార్కెట్‌యార్డ్ ప్రత్యేక కార్యదర్శి డీటీ రాయుడును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాంగణాన్ని సిద్ధం చేయాలని ఈసందర్భంగా జేడీఏ ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీడీ దివాకర్, ఏడీఎం రమేష్, ఓటీఎస్ ప్రసాద్, వ్యవసాయాధికారులు రామమోహన్‌రెడ్డి, భాస్కర్, గుంజి వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యారన్‌కు 4 బేళ్లు మాత్రమే తీసుకురావాలి

వేలం నిర్వహణాధికారి తులసి

ఒంగోలు రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం రెండులో జరుగు వేలానికి ప్రతిరోజు బ్యారన్‌కు 4బేళ్లు మాత్రమే తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి జె. తులసి సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి మాట్లాడుతూ 9వరౌండ్ వేలంకు షెడ్యూల్ వివరాలు తెలిపారు. 17వ తేదీన పోతవరం, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డిపాలెం, కె.మామిడిపాలెం, యరజర్ల, చెరువుకొమ్ముపాలెం, 18వతేదీన ఒంగోలు, గుత్తికొండవారిపాలెం, అనుబ్రోలు వారిపాలెం, కేశినేనివారిపాలెం, ప్రాసంగలపాడు, ఉప్పుగుండూరు, చదలవాడ, కొప్పోలు, సూరారెడ్డిపాలెం, 19వ తేదీన అమ్మనబ్రోలు, చవటపాలెం, రాపర్ల, మాచవరం, 20వ తేదీన నాగులుప్పలపాడు, ఒమ్మెవరం, ఓబన్నపాలెం, మండవవారిపాలెం, ముక్తినూతలపాడు, 21వతేదీన చీర్వానుప్పలపాడు, దొడ్డవరప్పాడు, వెంకటరాజుపాలెం, ఏడుగుండ్లపాడు, ఉలిచి, 23వ తేదీన టి.అగ్రహారం, వలేటివారిపాలెం, మద్దిరాలపాడు, 24వ తేదీన చేకూరపాడు, ఇనమనమెళ్లూరు, ఆలూరు, గాదెపాలెం, 25వ తేదీన దశరాజుపల్లి, గుడిమెళ్లపాడు, బొద్దులూరివారిపాలెం, దేవరంపాడు, కరవది, త్రోవగుంట, పానకాలపాలెం గ్రామాల రైతులు పొగాకు బేళ్లను వేలంకు తీసుకురావాలని ఆమె కోరారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో నూరుశాతం రాయితీ ద్వారా పండ్లతోటలు, పూల మొక్కలు సాగు చేసుకొనేందుకు అర్హులైన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ అన్సారియా ఒక ప్రకటనలో కోరారు. జాబ్ కార్డు కలిగి ఉండి ఐదెకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్న కారు రైతులు అర్హులన్నారు. మామిడి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, జామ, తైవాన్, సపోట, కొబ్బరి, నేరేడు, సీతాఫలం, ఆపిల్ బేర్, చింత, అంజూర, అవకాడో, డ్రాగన్ ఫ్రూట్స్, మునగ, గులాబి, మల్లెల మొక్కలు లభ్యవుతాయని తెలిపారు. పంట రకాన్ని బట్టి మూడేళ్లపాటు వాచ్‌అండ్‌వార్డ్, వాటరింగ్, ఎరువుల నిర్వహణ ఖర్చులు పూర్తిగా ఉచితంగా చెల్లిస్తామని తెలిపారు.

జిల్లాలో 65,090 ఎకరాల పండ్లతోటలు, పూల మొక్కల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 1,617 మంది రైతులు 3,482 ఎకరాలను గుర్తించారని కలెక్టర్ కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం





ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి, ఉత్సవమూర్తులను కల్యాణోత్సవానికి తీసుకొస్తున్న భార్గవ శ్రీనివాసరావు దంపతులు, పూజారులు

అద్దంకి,జూన్16(ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయం వార్షిక శాంతి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష పంచామృతాలతో అభిషేకము నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తులకు శాంతికల్యాణం నిర్వహించారు. గుడివాడ విద్యుత్ డివిజన్ ఈఈ భార్గవశ్రీనివాసరావు దంపతులు స్వామి వారి శాంతి కల్యాణంలో పాల్గొన్నారు. ఈవో శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో శాంతి కళ్యాణం తిలకించారు.

కేంద్రీయ విద్యాలయం వద్ద తల్లుల నిరసన

తల్లికి వందనం అమలు చేయాలని ఆందోళన

ఒంగోలు విద్య, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం నిధులు తల్లుల ఖాతాలకు జమకాకపోవడంతో సోమవారం కొందరు స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కేంద్రీయ విద్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమ పిల్లలకు ఎందుకు నిధులు జమ కాలేదని ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్‌ను ప్రశ్నించారు.

కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి కేంద్రప్రభుత్వ పాఠశాల విద్యావిభాగం ప్రత్యేకంగా యూడైస్ వెబ్‌సైట్ నిర్వహిస్తోంది. గతంలో వీరి వివరాలు కూడా రాష్ట్ర పాఠశాల విద్య యూడైస్ పోర్టల్‌లోనే ఉండేవి. 2022-23 విద్యాసంవత్సరం నుంచి ఈ విధానం మార్చి వీరి వివరాలను కేంద్ర ప్రభుత్వమే నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఆ యూడైస్ పోర్టల్ ఓపెన్ కాకపోవడంతో ఈ పాఠశాల విద్యార్థుల వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి అందలేదు. దీంతో వీరి తల్లుల జాబితాలో తల్లికి వందనం నిధులు జమ కాలేదు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్ తల్లులకు వివరించేందుకు ప్రయత్నించినా వారు వినలేదు. వెంటనే ఆయన ఒంగోలు ఎంఈవో టి.కిషోర్‌బాబుకు ఫోన్ చేశారు. ఆయన ఫోన్‌లోనే ఆందోళన చేస్తున్న తల్లులతో మాట్లాడారు. తల్లికివందనం నిధులు జమకాకపోవడంలో ప్రిన్సిపాల్ తప్పిదం లేదని ఆయన వివరించారు. కేవలం కేంద్ర యూడైస్ పోర్టర్ ఓపెన్‌కాకపోవడం వల్లే డబ్బులు పడలేదని నచ్చజెప్పారు. ఆ మహిళలు వెంటనే అక్కడి నుంచి వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కార్యాలయం కూడా ఈ విషయంలో ప్రిన్సిపాల్‌ను వివరణ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేంద్రీయ విద్యాలయాల్లో ఇదేపరిస్థితి ఉంది. ఈ విషయమై సచివాలయాల సిబ్బందిని సంప్రదించగా కేంద్రీయ విద్యాలయాలకు సంబంధించి తల్లికి వందనం అర్హులైన తల్లుల జాబితా సిద్ధమవుతుందని, త్వరలో వారి జాబితాలకు నిధులు జమవుతాయని వారు చెప్తున్నారు. ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో 1200 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. మార్కాపురంలో కూడా మరో కేంద్రీయ విద్యాలయం ఉంది. ఈ రెండు విద్యాలయాల విద్యార్థులకు జూలైలో తల్లికి వందనం డబ్బులు జమయ్యే అవకాశం ఉంది.

దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీగా సువార్త



ఏడీ సువార్త

ఒంగోలు నగరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా సీహెచ్ సువార్త సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె గుంటూరు జిల్లాలో ఏడీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏడీగా పనిచేసిన అర్చన బదిలీపై అనంతపురం వెళ్లారు. సువార్తకు గతంలో జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పుడు ఏడీగా బాధ్యతలు చేపట్టిన సువార్త గతంలో ఇదే కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన సువార్త సోమవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు.

అవీ..ఇవీ

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

● జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ అధికారి ఆయేషాబేగం

చీమకుర్తి,జూన్16(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎస్. ఆయేషాబేగం ఆదేశించారు. చీమకుర్తి ఎక్సైజ్ స్టేషన్‌ను ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. నిబంధనల మేరకు మద్యం దుకాణాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వానికి తావులేకుండా ఉండాలన్నారు.ఎక్సైజ్ సీఐ సుకన్య,ఎస్ఐ నగేష్,సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చీమకుర్తిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి,జూన్16(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని పలుప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పీఎంఐ పనులు జరుగుతున్నందున పట్టణంలోని రాంనగర్, దిన్నేపురం, విద్యానగర్, ఎస్ఎస్‌పీ కాలనీ, ఎంపీఆర్ నగర్‌లలో గృహ,గృహేతర, పారిశ్రామిక వినియోగదారులకు ఉదయం ఎనిమిది గంటలనుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని దేవరపాలెం, బక్కిరెడ్డిపాలెం, గ్రామాల్లో పది గంటలనుంచి రెండు గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

తెరుచుకున్న సినిమా హాలు


సినిమా థియేటర్ తాళాలను దగ్గరుండి తీయిస్తున్న తహసీల్దార్

మద్దిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి):వెల్లంపల్లిలోని జేఎంఆర్ సినిమా థియేటర్ సోమవారం తెరుచుకుంది. గతంలో ఎలాంటి అనుమతులు లేకపోవడంతో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సినిమా హాలును సీజ్ చేశారు. అయితే నిర్వాహకులు థియేటర్ అనుమతులకు దరఖాస్తు పెట్టుకున్నారు. దీంతో ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి సినిమా హాల్ సీజ్‌ను తొలగించి తాళాలు తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనల ప్రకారం సినిమా హాల్ ప్రారంభించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య, వీఆర్వో పూజిత తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల నివారణపై అవగాహన కల్పించాలి

మద్దిపాడు, జూన్16 (ఆంధ్రజ్యోతి): మలేరియా, డెంగ్యూ, చికున్ గునియా వంటి ప్రాణాంతకమైన జ్వరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాస్ ప్రసాద్


దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న పంచాయతీ అధికారులు

అన్నారు. సోమవారం మద్దిపాడులో దోమల లార్వాలను నివారించేందుకు ఎబెట్ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ మోహన్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు ప్రాణాంతక వ్యాధులపట్ల అవగాహన కల్పించాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందని మాజీమంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగ నాగార్జున విమర్శించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ రాష్ట్ర కమిటీ ప్రచురించిన వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, కొమ్మూరి కనకారావు, కటారి శంకర్, దుంపా చెంచిరెడ్డి, ఇనగంటి పిచ్చిరెడ్డి, నలమలుపు కృష్ణారెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీరామమూర్తి, సురేష్ తదితరులు ఉన్నారు.

బదిలీల కౌన్సెలింగ్ భేష్

ఒంగోలు విద్య, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఒక్క సిఫార్సు బదిలీకి అవకాశం ఇవ్వకుండా టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించిన ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, నాయకులు చెరుకూరి పూర్ణచంద్రరావు, వెంకట్రావు, రాంబాబు, ఆంజనేయులు, రవీంద్ర, రెహమాన్‌లు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తూ ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు చేయడాన్ని వారు స్వాగతించారు.ఎక్కువ మంది టీచర్లకు ఉద్యోగోన్నతులు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 1వతరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికివందనం అందించడం గొప్ప విషయమన్నారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మరిన్ని పోషకాలు అందించేందుకు సన్నబియ్యంతో భోజనం పెట్టడం లోకేష్ దార్శనికతకు నిదర్శమని వారు పేర్కొన్నారు.

డీఎస్సీకి 96శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు సోమవారం 96శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఏడు పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు జరిగాయి. ఉదయం సెషన్‌లో 891 మందిని కేటాయించగా 842 మంది హాజరు కాగా 49 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు కూడా 891 మందికి 850 మంది హాజరు కాగా 41 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో తెలిపారు.

నిర్ణీత సమయంలో అర్జీలను పరిష్కరించాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం


మీకోసంలో అర్జీదారుల సమస్యలను వింటున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలనుంచి వచ్చిన అర్జీలను నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలనుంచి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన దరఖాస్తులకు వెంటనే పరిష్కారాన్ని చూపాలన్నారు. నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు లేని దరఖాస్తులను అందుకు గల కారణాలను స్పష్టంగా దరఖాస్తుదారుడికి తెలియజేయాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. వివిధ శాఖల్లో నమోదైన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, విజయజ్యోతితో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

● ఉపాధి పథకంద్వారా సచివాలయ భవనాన్ని పూర్తి చేశానని, అందుకు సంబంధించిన బిల్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ముండ్లమూరు మండలం శంకరాపురంకు చెందిన సచివాలయ బిల్డింగ్ మెటీరియల్ సప్లయిర్ మేడికొండ శేషగిరిరావు కోరారు. గతంలో కొంత బిల్లు చెల్లించారని, మిగతాది ఇంత వరకు చెల్లించలేదని, ఈ విషయంపై అనేక సార్లు అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఇలా పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు రకాల సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు.

చేజర్ల కాలువను సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మించాలి

● కలెక్టర్‌కు రైతుల వినతి

ఒంగోలు (రూరల్), జూన్16(ఆంధ్రజ్యోతి):ఉలిచి వద్ద గుండ్లనదిపై చేజర్ల ఎత్తిపోతల పథకం నుంచి చేజర్ల భూములకు నీరు వచ్చే కాలువను సిమెంట్ కాంక్రీట్ నిర్మించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఆ గ్రామ రైతులు సోమవారం కలెక్టరేట్‌లో మీకోసం కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా చేజర్ల గ్రామరైతులు గద్దె వెంకట కృష్ణ , చేజర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం కింద 700 ఎకరాల మాగాణి సాగులో ఉన్నదని, సుమారు 5కిలో మీటర్లు పొడవునా కాలువ ఉన్నదని అన్నారు. కాలువకు నీరు వదిలిన సమయంలో తెగిపోయి మెట్టపొలాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అందులో పేర్కొన్నారు. అధికారులు స్పందించి కాలువను సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మించాలని వారు కలెక్టర్‌ను కోరారు.

మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

సంతనూతలపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో గత ప్రభుత్వ యాంలో మండలపరిషత్ నిధుల దుర్వినియోగంపై సోమవారం కలెక్టర్‌కు సంతనూతలపాడుకు చెందిన మందాడి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలపరిషత్ కార్యాలయపు ఖర్చు పేరుతో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులను లక్షల్లో దుర్వినియోగం చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంతనూతలపాడులో వాకింగ్ ట్రాకింగ్ పేరుతో, పార్కు ఎక్యూప్‌మెంట్ పేరుతో రూ.9,23,500 నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొన్ని ప్రభుత్వకార్యాలయాలకు మరమ్మతుల పేరుతో రూ.11,49,600లను దుర్వినియోగం చేసినట్లు ఆయన తెలిపారు. మార్కెట్ యార్డు నుంచి చిన్నచెరువు వరకు , హైస్కూల్ దగ్గర కల్వర్టర్ మరమ్మతుల పేరుతో రూ.4,02,900 నిధులను, పశువుల ఆసుపత్రి నుంచి ఎమ్మెస్సార్ జూనియర్ కళాశాల వరకు రోడ్డు వెడల్పు పేరుతో చేసిన పనికి మళ్లీ చేసినట్లు అదేవిధంగా ఎనికపాడు డొంక రోడ్డు కూడా చేసిన పని మళ్లీ చేసినట్లు చూపి, రూ.9,34,600 స్వాహాచేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫిర్యాదులపై సమగ్ర విచారణ


ఫిర్యాదుదారు సమస్యను వింటున్నఎస్పీ దామెదర్

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి 65 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం,జూన్16(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సమగ్ర విచారణ చేసి చట్టపరిధిలో సత్వరమే పరిష్కారిస్తామని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 65 మంది తమ సమస్యలపై ఎస్పీకి వినతులను అందజేశారు. ఆయా సమస్యలను స్వయంగా విన్న ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళ పోలీసుల స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, ట్రాఫిక్ డీఎస్పీ పాండురంగారావు, ఎస్సై జనార్దన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

మద్దిపాడులో పారిశుధ్యం అధ్వానం


ప్రభుత్వ కళాశాల గోడ సమీపంలో పేరుకుపోయిన చెత్త

మద్దిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వారానికి ఒకసారి కూడా చెత్తను తరలించిన పాపాన పోలేదు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు చెత్తను తరలించకపోవడంతో చెత్త పేరుకుపోయి దోమల బెడద ఎక్కువ కావటం, రోజుల తరబడి కాలువలలో మురికి పేరుకుపోవటం జరుగుతున్నది. మద్దిపాడు అరుంధతి నగర్‌లో మురుగు ముందుకు కదలక దుర్గంధం వెదజల్లుతోంది. కడియాల యానాదయ్య ప్రభుత్వ కళాశాల గోడ సమీపంతో చెత్త పేరుకుని పోయింది. బీసీ కాలనీ, దళితవాడలో మురుగు కాలువలలో మురుగు నిలిచించి. అలాగే గడియపూడి కాలనీకి చెత్తబండి రావడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

21 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు నగరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మహిళలకు టైలరింగ్‌పై ఈనెల 21వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్ సెట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 31 రోజుల పాటు ఈ శిక్షణ జరుగుతుందని ఆయన తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆధార్‌కార్డు, రేషన్ కలిగిఉన్నవారు శిక్షణకు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 8309915577 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

మద్దిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి):విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏడుగుండ్లపాడు సర్పంచ్ దాసరి శిల్పా సౌందర్య అన్నారు. సోమవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. మాజీ సర్పంచ్ మండవ వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల హరిచంద్ర ప్రసాద్, దాసరి రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, జి.భార్గవ వర్మ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పొన్నలూరు వ్యవసాయాధికారిగా రాము

పొన్నలూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : మండల నూతన వ్యవసాయాధికారిగా వడ్డె రాము నియమితులయ్యారు. పొన్నలూరులో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కందుకూరు నుంచి రాము బదిలీపై రాగా, ఇప్పటిదాకా వ్యవసాయాధికారిగా పనిచేసిన పూర్ణచంద్రరావు సింగరాయకొండకు బదిలీ అయ్యారు.

డయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డయేరియా వ్యాధి నివారణకు వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రచురించిన డయేరియా పోస్టర్‌ను సోమవారం స్థానిక గ్రీవెన్స్ హాలులో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశువులకు ఒక రోజులో మూడు లేదా అంతకన్నా ఎక్కువ సార్లు విరోచనాలు అయితే దానిని అతిసార వ్యాధిగా గుర్తించాలన్నారు. అతిసార సోకిన శిశువులు తల్లిపాలు తాగలేకపోవడం, తక్కువగా తాగడం, తిన్న ప్రతి ఆహారం వాంతి చేసుకుంటూ తరుచుగా నీళ్ల విరోచనాలు కావడం వల్ల శరీరం డీహైడ్రేషన్‌గురికావడం వల్ల అపస్మారక స్థితిలోకి పోవడం, వేగంగా శ్వాస తీసుకోలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు. దీనిని నివారించేందుకు ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికి రోటా వైరస్, తట్టు టీకాలు సరైన సమయంలో వేయించాలని సూచించారు. అతిసార నివారణకు అవసరమైన అన్ని రకాల మందులు, సెలైన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ,డీఆర్వో ఓబులేషు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లుతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.


డయేరియా నుంచి పిల్లలను రక్షించండంటూ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఇతర అధికారులు

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

» డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్


మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కనిగిరి డివిజన్ పరిధిలోని వివిధ సర్కిల్ స్టేషన్‌లలో ఉన్న పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డివి జన్‌స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పీ ఎస్ పరిధిలో సుదీర్ఘ కేసులు, మిస్సింగ్ కేసులపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణ, నగర, గ్రామాల్లో ఉన్న రౌడీ షీటర్లపై దృష్టి సారించటంతో పాటు వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. దొంగతనాల కేసు ల్లో ఉన్న నిందితుల దినచర్యల పై ఎప్పటికప్పుడు నిఘా ఉంచా లని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చే యటంతో పాటు వీధిలైట్లు లేని ప్రాంతాల్లో తప్పని సరిగా నిఘా ఉంచాల న్నారు. కనిగిరి డివిజన్ నేర రహిత కేంద్రంగా ఉండేలా పోలీసులు అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవచూపాలని సూచించారు. సమావేశంలో సీఐ ఖాజా వలి, జి.సోమశేఖర్, పామూరు, కొండపి, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సీఐలు పాల్గొన్నారు.

ఆనందం అంతలోనే ఆవిరి

● పిల్లలకు పుస్తకాలు కొనిచ్చి వస్తుండగా ప్రమాదం
● బైక్‌పై నుంచి పడిన తల్లి మీదుగా వెళ్లిన టిప్పరు
● చికిత్స పొందుతూ మృతి
● బావురు మంటున్నపిల్లలు

ఒంగోలు క్రైం,జూన్16(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభమై పిల్లలకు పుస్తకాలు కొనిచ్చి ఇంటికి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో తల్లి మృతి చెందింది.దీంతో పిల్లలు బావురు మంటున్నారు. పుస్తకాలు కొనిచ్చిన ఆనందం ఇంటికి పోయేవరకు కూడా లేదు. మృత్యు రూపంలో వచ్చిన టిప్పర్ ఆ కుటుంబంలో విషాదం నింపిది. వివరాలలోకి వెళితే స్థానిక ఇస్లాంపేటలో నివాసం ఉంటున్న షేక్ దిల్‌షాద్ (28)రోడ్డు ప్రమాదంలో మరణించింది. ఈదుర్ఘటన సోమవారం స్థానిక కర్నూల్ రోడ్డులోని ఫ్లైవోవర్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు దిల్‌షాద్ అమె భర్త అబుబాకర్ తన ఇద్దరి పిల్లలను తీసుకొని వెళ్లి పుస్తకాలు కొనుగోలు చేశారు. అక్కడ నుంచి ఇంటికి తిరిగి మోటర్‌బైక్‌పై నలుగురు ప్రయాణిస్తున్నారు. కర్నూల్ ఫ్లై వోవర్ బ్రిడ్జి వద్ద మోటర్‌బైక్‌పై నుంచి వెనుక కూర్చున్న దిల్‌షాద్ జారి రోడ్డు మీద పడింది. దీంతో వెనుక నుంచి వచ్చి చీమకుర్తి వైపు వెళ్లే టిప్పరు అమె కాళ్లపై నుంచి వెళ్లింది. వెంటనే దిల్‌షాద్‌ను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుదూ అమె మృతి చెందింది. ఈమేరకు ఒంగోలుతాలుకా ఎస్సై హరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాధువు వేషంలో దోపిడీలు

● పోలీసుల అదుపులో దుండగుడు
● నెలరోజులుగా ఒంగోలు లాడ్జిలో మకాం

ఒంగోలు క్రైం,జూన్16(ఆంధ్రజ్యోతి): సాధువు వేషంలో తిరుగుతూ మహిళలను మోసం చేసి దోపిడీలకు పాల్పడే దుండగుడిని ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. చీమకుర్తిలో ఆదివారం సాధువు వేషంలో ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లోకి వెళ్లి అమెకు మాయమాటలు చెప్పి దాడి చేసి పరారయ్యాడు. అయితే అమె ఇంట్లోకి వెళ్లే సమయంలో సాధువులా వెళ్లి అక్కడ దోపిడీకి పాల్పడిన తరువాత ప్యాంట్, టీషర్టుతో బయటకు వచ్చినట్లు పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా గుర్తించారు. దీంతో అతను ఒంగోలు వైపు వచ్చినట్లు కూడా ఆధారాలు సేకరించి, ఆదివారం ఒంగోలులోని ఓ లాడ్జిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయనగరంకు చెందిన యువకుడు నెలరోజులుగా ఒంగోలులో లాడ్జిలో మకాం వేసి పరిసరప్రాంతాలలో సాధువులా వెళ్లి మహిళలకు మాయమాటలు చెప్పి దోపిడీలకు పాల్పడుతుంటాడని విచారణలో వెల్లడైనట్లు తెలిసింది.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 20 మందికి జరిమానా

ఒంగోలు క్రైం, జూన్16 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపేవారికి ఒక్కొకరికి 10 వేలు రూపాయలు న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తెలిపారు. ఒంగోలులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 20 మందిపై కేసులు నమోదు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ. 10 వేలు జరిమానా విధించారని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


మాధవరావును 108లో తరలిస్తున్న సిబ్బంది

కొండపి (టంగుటూరు), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలైన ఘటన టంగుటూరు మండలం వల్లూరు గ్రామ సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల వద్ద సోమవారం జరిగింది. జరుగుమల్లి మండలంలోని సాదువారిపాలెం గ్రామానికి చెందిన కాకర్లమూడి మాధవరావు స్వగ్రామం నుంచి తన మోటార్ సైకిల్‌పై ఒంగోలు వెళ్తుండగా సోమవారం సాయంత్ర ఈ ఘటన చోటుచేసుకుంది. వెనుక నుంచి వస్తున్న కారు మాధవరావు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో మాధవరావు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది బాధితుడిని ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. టంగుటూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకొన్న మద్యం సీసాలతో ఎస్ఐ రజియా సుల్తానా

నాగులుప్పలపాడు, జూన్16 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ రజియా సుల్తానా సోమవారం తన సిబ్బందితో దాడి చేసి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నారు.

పశువైద్యాధికారిగా శివరామకృష్ణ

పొన్నలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు పశువైద్యశాల అధికారిగా జె.శివరామకిష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని చౌటపాలెం పశువైద్యశాలలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు. పశుసంవర్ధకశాఖ అందించే గోకులం షెడ్లు, పశ్రుగాన పెంపకం, బీమా, సబ్సిడీపై దాణా వంటి పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



వ్యవసాయధికారి కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

రైతులు ఈకైవేసీ చేయించుకోవాలి

తర్లుపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు ఈకైవేసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి జోత్స్న జ్యోతిక సూచించారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో వ్యవసాయ సహాయకులు ఈకేవైసీ చేస్తున్నారని, అన్నదాన సుఖీభవకు అర్హులైన ప్రతి ఒక్కరూ చేయించుకోవాలన్నారు. ఈకైవేసీ పూర్తి చేస్తేనే అన్నదాత సుఖీభవ వర్తిస్తుందన్నారు. సీతానాగులవరం, మీర్జాపేట సచివాలయాల్లో చేస్తున్న ఈకైవేసీని ఆమె పరిశీలించారు.

తర్లుపాడులో రైతుల పడిగాపులు

తర్లుపాడు వ్యవసాయధికారి కార్యాలయంలో ఉదయం 10:30గంటల వరకు తలుపులు తీయకపోవడంతో ఈకైవేసీ చేయించుకోవాలని వచ్చిన రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. అన్నదాత సుఖీభవకు ఈకైవేసీ చేయించుకోవాలని అధికారులు తెలపడంతో ఉదయం 9గంటలకే రైతులు సచివాలయం వద్ద బారులు తీరారు. ఉదయం 10:40గంటలకు వ్యవసాయాధికారులు తాళాలు తెరిచి ఈకైవేసీ చేశారు. అధికారులు సమయపాలన పాటించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



తిరుమలగిరి కాలనీలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

టీబీపై అవగాహన

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి కాలనీలో టీబీ వ్యాధిపై వెంకటాద్రిపాలెం వైద్యులు నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. తరచు దగ్గు, గొంతు నొప్పి, రక్తం రావడం లాంటివి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రజలకు గళ్ళ, యూరియన్ పరీక్షలు నిర్వహించారు. పలు సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీ సాగర్, ఏఎన్ఎం కుమారి, ఆశవర్కర్ తిరుపతమ్మ, డ్రైవర్ మందా దాసు సిబ్బంది ఉన్నారు.

పోక్సో చట్టం గురించి తెలియాలి



హెచ్ఎంలతో మాట్లాడుతున్న ఎస్ఐ శివబసవరాజు

త్రిపురాంతకం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పోక్సో చట్టంపై అవగాహన కలిగించాలని ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఎస్ఐ శివబసవరాజు తెలిపారు. సోమవారం ఎంఈవో టి.రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి బాలికలకు తెలియజేయాలన్నారు. పాఠశాలల గదుల్లోకి, ల్యాబ్‌లలోకి బాలికలను ఉపాధ్యాయులు కూడా ఒంటరిగా ఆహ్వానించకూడదని చెప్పారు. పోక్సో చట్టం గురించి కూడా ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు.

అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ తెలియాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు అన్నారు. సాయి ఫంక్షన్ హాలులో వికసిత భారత్ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి చెప్పాలన్నారు. పార్టీ సభ్యత్వాలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా శాఖ మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ నారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాల్గొన్నారు.

యోగాపై వ్యాసరచన పోటీలు

గిద్దలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో యోగాంధ్ర అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీ పరీక్షలు విద్యార్థులలో దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికి తీస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రతినిధి సావిత్రి, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్ పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

ప్రారంభానికి నోచుకోని భవనాలు



రైతు సేవా కేంద్రం



విలేజ్ హెల్త్ క్లినిక్

- నిరుపయోగంగా మారిన వైనం
- లక్షల రూపాయలు వృథా

బేస్తవారపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో అర్భాటకంగా కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ఎందుకూ పనికిరాకుండా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా అయ్యాయి. బేస్తవారపేట పట్టణంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా పంచాయతీరాజ్ రూరల్ డెవలప్ మెంట్ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రానికి రూ.21.50 లక్షలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం కోసం రూ.17.50 లక్షలు నిధులతో భవనాలు నిర్మించారు. కాంట్రాక్టర్‌లకు బిల్లులు వచ్చాయి. కానీ ఆ ప్రభుత్వ భవనాలు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో భవనాల చుట్టూ చిల్ల కంప పెరిగి నిరుపయోగంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రనజలు కోరుతున్నారు.

గూడేలలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

సీఎండీ పుల్లారెడ్డిని కోరిన ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి, నల్లమల అటవీ ప్రాంతంలో జీవించే చెంచుల గూడేలలో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసి వెలుగులు నింపాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. ఈ మేరకు ఆయన విద్యుత్ శాఖ సీఎండీ పీ పుల్లారెడ్డిని సోమవారం విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. వైపాలెం నియోజకవర్గంలో లోవోల్టేజీ సమస్య ఎక్కువగా ఉందని అందుకు అవసరమైన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని, ఎక్కువ శాతం నల్లమల అటవీ ప్రాంతాలలో చెంచులుండే గూడేలలో విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు అటవీ శాఖ అధికారుల అనుమతులు ఉండవని ఎరిక్షన్‌బాబు వివరించారు. అందుకు ప్రత్యామ్నాయంగా సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి గూడెం వాసుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. వ్యవసాయానికి కూడా సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలన్నింటిపైనా సీఎండీ సానుకూలంగా స్పందించారని ఎరిక్షన్‌బాబు తెలిపారు.



సీఎండీని కలిసిన ఎరిక్షన్‌బాబు

నేటి నుంచి పొలంపిలుస్తోంది

పెద్దారవీడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏవో లక్ష్మీనారాయణ అన్నారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ పథకం కోసం జరుగుతున్న ఈకేవైసీని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారని, రైతులు అందుబాటులో ఉండి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏవో ఆదిలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మండలంలోని రెండు గ్రామాల చొప్పున ఈనెల 17వ తేదీ నుంచి ప్రతి మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బడే సంగమేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈనెల 17 నుంచి అక్టోబరు 3వరకు వారంలో రెండు రోజులు ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరై ఆయా గ్రామాల్లోని కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. రబీ సీజన్‌కు సంబంధించి నవంబరు 4వతేదీ నుంచి 2026 ఫిబ్రవరి 18 వరకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. చీడపీడలకు సంబంధించిన నివారణ మార్గాలు, సాంకేతిక పరిజ్ఞానం తెలియజేయడం, ప్రభుత్వ పథకాలు రాయితీలు తదితర విషయాలపై రైతులకు అలవగాహన కల్పిస్తారని, రైతులు వారి గ్రామాల్లో జరిగే కార్యక్రమంలో హాజరు కావాలని ఏఈవో కోరారు.



రైతుల ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఏవో లక్ష్మీనారాయణ

మున్సిపల్ కమిషనర్‌గా రమణబాబు



గిద్దలూరు టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబును ఇటీవల ప్రభుత్వం నియమించడంతో రమణబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మున్సిపల్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న ఐ.శ్రీనివాసులు పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

అగ్రికల్చర్ టెక్నికల్ ఆఫీసర్‌గా మెర్సీ



గిద్దలూరు టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ ఆఫీసర్‌గా జక్కం మెర్సీ నియమితులయ్యారు. ఆమె సోమవారం ఏడీఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మెర్సీ బేస్తవారపేట వ్యవసాయ అధికారిగా పని చేస్తూ గిద్దలూరుకు టెక్నికల్ ఆఫీసర్‌గా బదిలీపై వచ్చారు.

రీసర్వే డీటీగా స్వాతి బాధ్యతల స్వీకరణ

రాచర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా వై.స్వాతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గిద్దలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా పని చేస్తూ ఆమె ఇక్కడకు బదిలీ అయ్యారు. రాచర్లలో పని చేస్తున్న డీటీ భారతీబాయి బేస్తవారపేటకు బదిలీ అయ్యారు.

సర్వేయర్‌గా శిలార్‌ఖాన్

ఎర్రగొండపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వేయర్‌గా పీ శిలార్‌ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొమరోలు మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తూ ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడి సర్వేయర్ సైదారావు త్రిపురాంతకంకు బదిలీ అయ్యారు.

ఉప ఖజానా అధికారి బదిలీ

గిద్దలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉప ఖజానా అధికారిగా పని చేసి ఒంగోలుకు బదిలీపై వెళ్తున్న వరకుమార్‌ను రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అలాగే ఒంగోలు నుంచి ఉపఖజాన అధికారిగా బదిలీపై వచ్చిన నాగేశ్వరరావును, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణలకు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జి.రవీంద్రనాథరెడ్డి, సంఘం ప్రతినిధులు ఆదినారాయణ, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మూర్తయ్య పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి

పెద్దారవీడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా నాయకులు డి.సోమయ్య కోరారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ పెద్దారవీడులో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు అందలేదన్నారు. అనేక సంవత్సరాలుగా నుంచి కుటుంబాలు పెరిగి అద్దె ఇళ్లలో నివాసముంటున్నారన్నారు. అర్హులైన జాబితా తయారు చేసి ఇవ్వాలన్నారు. దోర్నాలకు వెళ్లే రోడ్డులో పుచ్చకాయలబోడు ఉందని, ఆ స్థలంలో నివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మూడమంచు సుబ్బయ్య, బత్తుల కాశయ్య, వెంకటేశ్వర్లు, కాశయ్య పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సారా నిషేధంపై అవగాహన ర్యాలీ

పెద్దదోర్నాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ శాఖాధికారులు మండలంలోని ఎగువ చెర్లోపల్లి, పనుకుమడుగు, తిమ్మాపురం గ్రామాల్లో సారా నిషేదంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నవోదయం-2లో భాగంగా అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. అనంతరం సారా తాగడంవల్ల కలిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ఇద్దరు నిందితులకు రూ.2లక్షలకు బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

చదరంగం విజేతలకు బహుమతులు

గిద్దలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమంలో భాగంగా చదరంగం పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విదార్థులు పెద్ద ఎత్తున పాల్గొనగా లలిత్, సుజిత్, స్వరూప్ విద్యార్థులు తొలి మూడు స్థానాలను సాధించగా వారికి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి, యువ ప్రగతి పథం సంస్థ ప్రతినిధులు కుశ్వంత్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో దోమల నివారణ మందు పిచికారీ



హాస్టల్ గదిలో దోమల నివారణ మందును స్ప్రే చేస్తున్న మలేరియా సిబ్బంది

పెద్దదోర్నాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హాస్టళ్లలో మలేరియా అధికారులు సోమవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉన్నత వైద్య ఆరోగ్య శాఖాధికారుల సూచనలతో కొర్రప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పెద్దమంతనాల, మోట్ల మల్లికార్జునపురం, దోర్నాల ఎస్సీ, బీసీ, ఎస్టీ హాస్టళ్లలో, చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గురుకుల పాఠశాల, చిలకచెర్ల గూడెం హాస్టళ్లలో ఏసీఎం 5శాతం దోమల నివారణ మందు చల్లారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ ఇజ్రాయేల్, హెల్త్ అసిస్టెంటు వెంకటేశ్వరరెడ్డి, విల్సన్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కౌలు వేలం ద్వారా రూ.74వేల ఆదాయం

రాచర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీచెరువు గ్రామ సమీపంలోని నెమలిగుండ్ల రంగనాయకస్వామి కౌలు భూములకు సంబంధించి నిర్వహించిన వేలంపాటల ద్వారా రూ.74,400 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగయ్య తెలిపారు. మొత్తం 66.51 ఎకరాలకు సంబంధించి వేలంపాట నిర్వహించవలసి ఉండగా 23.79 ఎకరాలకు మాత్రమే వేలంపాట జరిగిందని, మిగిలిన 42.72 ఎకరాలకు పాటదారులు లేక వాయిదా వేసినట్లు చెప్పారు. 23.79 ఎకరాలకు గతంలో రూ.48,400 ఆదాయం వచ్చిందని, ఇప్పుడు జరిగిన వేలంపాట ద్వారా రూ.74,400 వచ్చాయన్నారు. వేలంపాటలో దేవదాయ, ధర్మాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనం ఇవ్వాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనం మంజూరు చేయాలని సీపీఐ నాయకులు అందె నాసరయ్య అన్నారు. తల్లికి వందనం మంజూరు చేయాలని, పారిశుధ్య కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక పూలసుబ్బయ్య భవన్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాసరయ్య మాట్లాడుతూ కాంట్రాక్టర్ కింద పనిచేస్తున్న వర్కర్లకు తల్లికి వందనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాశీం, కార్మికులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా లక్ష్మీనారాయణ బాధ్యతలు



పెద్దారవీడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాధికారిగా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా దొనకొండ ఏవోగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ పెద్దారవీడుకు వచ్చారు. ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న ఏవో బుజ్జిబాయ్ మార్కాపురానికి బదిలీ అయ్యారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతులకు పంటలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్గిస్తూ వారి ఉన్నతికి కృషి చేస్తానన్నారు. రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఎల్లప్పుడూ వారికి అందుబాటులో ఉంటానన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- మురుగు కాలువలు నిండి రోడ్లపై నిలిచిన నీరు
- పాదచారులు, ద్విచక్ర వాహనదారుల అవస్థలు

కంభం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కంభం, కందులాపురం మేజర్ పంచాయతీల అధికారుల నిర్లక్ష్యం రెండు పంచాయతీల ప్రజలకు శాపంగా మారింది. కంభం పంచాయతీలోని అర్బన్‌కాలనీ నుంచి వచ్చే ప్రధాన మురికి కాలువ కందులాపురం పంచాయతీ పరిధిలోని కాలువ గుండా ప్రవహిస్తుంది. అయితే ఈ మురుగు కాలువలను పంచాయతీ సిబ్బంది శుభ్రం చేయకపోవడం, ఈ కాలువ పక్కనే నూతనంగా గృహాలు నిర్మించుకునే వారు మురికినీరు తాము నిర్మించుకునే నూతన గృహాల నుంచి ప్రవహించకుండా అడ్డుకట్టలు వేశారు. దీంతో మురికినీరు వెళ్లే దారి లేక రోడ్డుకు ఇటువైపున ఉన్న కందులాపురం పంచాయతీ పరిధిలోని నెహ్రూనగర్ 1, 2 వీధుల్లో ప్రవహిస్తూ తీవ్ర దుర్గంధం వస్తున్నది. గత 4 రోజులుగా రోడ్డుపై వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తున్నా రెండు పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కందులాపురం పంచాయతీ పరిధిలోని నెహ్రూనగర్ 2వ లైన్‌లో తాగునీటిని వదిలే వాల్వ్ గుంత మురికినీటితో నిండిపోవడంతో వాల్వ్ వదిలేవారు అలాగే వాల్వ్‌ను ఓపెన్ చేస్తుండడంతో మురికినీరు పైపుల ద్వారా గృహాల్లోకి వస్తున్నాయి. నీరు నిలిచి వాహనదారుల రాకపోకల వలన రోడ్లు కోతకు గురికావడమే కాక భారీ గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు మురుగు నీటిలోనే వెళ్తూ గుంతల్లో కిందపడి గాయాల పాలవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా మురుగు కాలువలను శుభ్రం చేసి రోడ్లపై మురుగునీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నెహ్రూనగర్ 1వ లైన్‌లో పూర్తిగా కోతకు గురైన రోడ్డు



రోడ్డుపై నిలిచిన మురుగు నీటిలో ద్విచక్ర వాహనదారుడి అవస్థలు

పీసీపల్లి ఏవోగా రంగాకృష్ణ


బాధ్యతలు చేపట్టిన రంగాకృష్ణ

పీసీపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండల వ్యవసాయ అధికారిగా ఎన్.రంగాకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వెలిగండ్ల మండలం నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇప్పటివరకు పనిచేసిన కె.ప్రకాశరావు కొనకనమిట్ల మండలానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు తీసుకున్న రంగాకృష్ణ మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ నగదు వారి బ్యాంకు ఖాతాల్లో ఈనెల 21న జమ అవుతుందని చెప్పారు. రైతులు ఈకేవైసీ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. పాత డేటా ప్రకారం ఆటోమేటిక్‌గా ఈకేవైసీ జరిగిందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న వారు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పామూరు వ్యవసాయాధికారిగా అబ్రహం లింకన్

పామూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పామూరు మండల వ్యవసాయాధికారిగా అబ్రహం లింకన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. లింగసముద్రం మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన కె.రాధ దర్శికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఏవో లింకన్ మాట్లాడుతూ మండలంలో అర్హులైన రైతులందరికి అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సహాయాన్ని అందజేయనుందని చెప్పారు.

ముండ్లమూరు ఏవోగా తిరుమలరావు


బాధ్యతలు స్వీకరించిన తిరుమలరావు

ముండ్లమూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా అనుముల తిరుమలరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల డీఏవో కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్క డికి వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన ఎండీ ఫరూక్ బాపట్ల జిల్లా చెరుకు పల్లి మండల వ్యవసాయ అధికారిగా బదిలీపై వెళ్ళారు. నూతనంగా బాధ్య తలు స్వీకరించిన తిరుమలరావు మాట్లాడుతూ మండలంలో రైతులకు అం దుబాటులో ఉండి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం వీవోఏలు వ్యవసాయ అధికారి తిరుమలరావును కలసి శుభాకాంక్షలు తెలిపారు.

'రీసర్వేలో లోపాలతో పథకాలను కోల్పోతున్నాం'

పామూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో రెవెన్యూ అధికారుల తప్పిదాలతో ప్రభుత్వ పథకాలను కోల్పోవలసివస్తుందని మండంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామానికి చెందిన శిరిగిరి హైమావతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ ఆర్.వాసుదేవరావుకు వినతి పత్రం అందజేశారు. తన పేరుపై ఎక్కువ భూమి చూపిస్తుండటంతో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అనర్హురాలిని అయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. పేదరాలిని అయిన తన పేరుమీద గల ఇతరుల పొలాన్ని తొలగించి న్యాయం చేయాలని వినతి పత్రంలో కోరారు. పరిశీలించి న్యాయం చేస్తానని తహసీల్దార్ తెలిపారు.

బదిలీల కౌన్సెలింగ్ భేష్

ఒంగోలు విద్య, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఒక్క సిఫార్సు బదిలీకి అవకాశం ఇవ్వకుండా టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించిన ప్రభుత్వానికి, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌కు తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, నాయకులు చెరుకూరి పూర్ణచంద్రరావు, వెంకట్రావు, రాంబాబు, అంజనేయులు, రవీంద్ర, రెహమాన్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తూ ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు చేయడాన్ని వారు స్వాగతించారు. ఎక్కువ మంది టీచర్లకు ఉద్యోగోన్నతులు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదు వుతున్న ప్రతి విద్యార్థికి తల్లికివందనం అందించడం గొప్ప విషయమన్నారు. పాఠ శాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మరిన్ని పోషకాలు అందించేందుకు సన్నబి య్యంతో భోజనం పెట్టడం లోకేష్ దార్శనిక తకు నిదర్శమని వారు పేర్కొన్నారు.

ఫిర్యాదులపై సమగ్ర విచారణ

ఒంగోలు క్రైం,జూన్16(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సమగ్రవి చారణ చేసి చట్టపరిధిలో సత్వరమే పరిష్కా రిస్తామని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొ న్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాల యంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 65 మంది తమ సమస్యలపై ఎస్పీకి వినతులను అందజేశారు. ఆయా సమస్యలను స్వయంగా విన్న ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరి ధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశిం చారు. కార్యక్రమంలో మహిళ పోలీసుల స్టేష న్ డీఎస్పీ రమణకుమార్, ట్రాఫిక్ డీఎస్పీ పాండురంగారావు, ఎస్సై జనార్దన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

వసతి గృహంలో.. కొరవడిన పర్యవేక్షణ

- ఏడాదిగా వార్డన్ పోస్టు ఖాళీ
- పట్టించుకోని అధికారులు


ఎస్సీ-2 బాలుర హాస్టల్ భవనం

దొనకొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ-2 బాలుర వసతి గృహంలో గత ఏడాది బాధ్యతలు చేపట్టిన సంక్షేమాధికారి మెడికల్ లీవ్‌పెట్టి వెళ్లారు. దీంతో ఏడాదిగా ఇన్‌చార్జ్‌తో కొనసాగుతోంది. ఎస్సీ-1 బాలుర వసతిగృహం సంక్షేమాధికారి ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెగ్యులర్ అధికారి లేకపోవటంతో విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడుతుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థుల విద్యాభివృద్ధి నిమిత్తం ఏర్పాటుచేసిన వసతి గృహానికి రెగ్యులర్ అధికారిని నియమించటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సంక్షేమాధికారులకు జరిగిన బదిలీల్లోనూ ఇక్కడి అధికారిని నియమించలేదు. పాఠశాలలు పునఃప్రారంభమై విద్యార్థులు వసతి గృహాల్లో చేరుతున్న సమయంలో ఒకే సంక్షేమాధికారి రెండుచోట్ల విద్యార్థులను పర్యవేక్షించటం ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. అలాగే, బీసీ బాలుర వసతి గృహం సంక్షేమాధికారి ఇటీవల బదిలీ అయ్యారు. బీసీ బాలికల వసతి గృహం సంక్షేమాధికారిణికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎస్సీ-2 బాలుర హాస్టల్‌కు, బీసీ బాలుర హాస్టల్‌కు రెగ్యులర్ అధికారులను నియమించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయిన తర్వాతే

స్కూల్ బస్సులు నడుపుకోవాలి



స్కూల్ బస్సు పత్రాలను పరిశీలిస్తున్న మోటార్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

దర్శి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయిన తర్వాతే నడుపుకోవాలని దర్శి మోటార్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సూచించారు. దర్శిలో సోమవారం స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలు ప్రారంభమైనందున ఆయా సంస్థల యజమాన్యాలు తమ బస్సులను తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎవరైనా సూచనలు పాటించకుండా బస్సులు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దర్శి కార్యాలయం పరిధిలో సుమారు 70 బస్సులు ఉన్నాయన్నారు. అందరూ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని స్పష్టం చేశారు. రికార్డులు ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం పరిమితికి మించకుండా విద్యార్థులను ఎక్కించుకోవాలని తెలిపారు. నిర్లక్ష్యవైఖరి అవలంభించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సూపర్ సిక్స్ పథకాల అమలుతో బెంబేలెత్తుతున్న వైసీపీ

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల అమలుతో వైసీపీ నేతలు ఏంచేయాలో దిక్కుతోచక బెంబేలెత్తుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా క్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదలచేశారు. తల్లికి వందనం పథకం దా రా తల్లుల ఖాతాల్లో నగదు జమకావటంతో విమర్శలు చేసిన నాయకులు ఇప్పుడు ఏలా సమర్థించుకోవాలో అర్థంకాక ఖంగుతింటున్నారని విమర్శించారు. ఎక్కడైనా పథకం సరిగా అమలుకాలేదని వైసీపీ నాయకులు విమర్శిస్తే తల్లుల నుండే ప్రతిఘటన ఎదురవుతుం డటంతో బిక్కమొఖం వేస్తున్నారని విమర్శించారు. సీ ఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, వి ద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో సూపర్ సి క్స్ పథకాలు వరుసగా అమలవుతుండటంతో అన్నివ ర్గాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హమీలను అమలు చేయలేక పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం హమీలను పూర్తిగా అమలు చేస్తుందని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. కుటుంబంలో ఎంతమంది ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకం అమలు చేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కూడా అమలవుతుం దన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు పథకం అమల్లోకి వస్తుందన్నారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు ప్రారంభించటం శుభపరిణామమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పొగాకు కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్‌కు రూ.300 కోట్లు కేటాయించటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ నిధులు సమకూర్చటంతో పొగాకు రైతులకు న్యాయం జరుగు తుందన్నారు. దర్శి నియోజకవర్గంలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుం టామన్నారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

- డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్



మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కనిగిరి డివిజన్ పరిధిలోని వివిధ సర్కిల్ స్టేషన్‌లలో ఉన్న పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరిం చాలని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డివి జన్‌స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పీ ఎస్ పరిధిలో సుదీర్ఘ కేసులు, మిస్సింగ్ కేసులపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణ, నగర, గ్రామాల్లో ఉన్న రౌడీ షీటర్లపై దృష్టి సారించటంతో పాటు వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. దొంగతనాల కేసు ల్లో ఉన్న నిందితుల దినచర్యల పై ఎప్పటికప్పుడు నిఘా ఉంచా లని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయటంతో పా టు వీధిలైట్లు లేని ప్రాంతాల్లో తప్పని సరిగా నిఘా ఉంచాల న్నారు. కనిగిరి డివిజన్ నేరర హిత కేంద్రంగా ఉండేలా పోలీ సులు అధికారులు, సిబ్బంది ప్ర త్యేక చొరవచూపాలని సూచిం చారు. సమావేశంలో సీఐ ఖాజా వలి, జి.సోమశేఖర్, పామూరు, కొండపి, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సీఐలు పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలుచేయాలి


మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కనిగిరి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆహార భద్రత చట్టాన్ని సక్రమంగా అమలులోకితెచ్చి 14రకాల నిత్యావసర వస్తువులను పేద ప్రజలకు అందించాలన్నారు. కేరళ రాష్ట్రంలో చౌక ధరల దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు ప్రతినెలా అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రజాపంపిణీ బియ్యం దారిమళ్లుతున్నాయని ఆరోపించారు. దీంతో ప్రభుత్వం ఉచితంగా అందించే బియ్యం పేదలకు దక్కటం లేదన్నారు. ఈసమయంలో రాష్ట్ర ప్రభుత్వం నగదు బదిలీ పథకాన్ని తీసుకు వస్తామని ప్రకటించటం పేదలకు నష్టం కల్గిస్తుం దన్నారు. మారుమూల గ్రామాల్లో 3 కిలోమీ టర్ల వరకు వెళ్ళి రేషన్ సరుకులు తెచ్చుకునే గ్రామాలున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక వాహనాల ద్వారా సరుకులు సరఫరా చేయాలన్నారు. రద్దు చేసిన వాహనా లను తిరిగి నడిపేవిధంగా పునరాలోచన చేయా లన్నారు. సన్నబియ్యాన్ని చౌక ధరల దుకా ణాల ద్వారా ప్రజలకు అందించాలని డిమాం డ్ చేశారు.

సమావేశంలో నాయకులు రాజశేఖర్, బ డుగు వెంకటేశ్వర్లు, బి.జనార్దన్, జి.రాములు, పి.కోటేశ్వరరావు, సాయి, మాలకొండయ్య, మోహన్, వెంకటేశ్వర్లు, కత్తి ఏబు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జునరావు

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

తాళ్లూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికల పట్ల కొందరు వ్యక్తులు వికృతంగా వ్యవహరిస్తే డోంట్ టచ్ అంటూ ధైర్యంగా హెచ్చరించి, తమను తాము కాపాడుకోవాలని ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక వీకే ఉన్నతపాఠశాలలోని బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనే అంశంపై సోమవారం అవగాహన కల్గించారు. ఎస్.ఐ మాట్లాడుతూ గ్రామాల్లో పాఠశాలల వద్ద సహచర పురుష విద్యార్థులు, ఉపాధ్యా యులు, బంధువులను బాలికలను తగలరాని చోట తగిలితే వెంటనే డోంట్ టచ్ అంటూ గట్టిగా హెచ్చరించాలని తెలిపారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తితే తల్లిదం డ్రులకు తెలిపి వారి ద్వారా 1098 నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. సమీప పోలీస్ స్టేషన్‌లో వారి వివరాలను అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న సర్వర్ సమస్య

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పామూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, సేవలు పొందేందుకు గ్రామ సచివాలయా లకు వెళుతున్న లబ్ధిదారులకు సర్వర్ సమస్య వేధిస్తున్నది. తల్లికి వందనం అర్హత, అనర్హత, జాబి తాల్లో పేర్లు ఉన్నవాళ్లకు నగదు పడకపోవడంతో పిల్లలతో సహ తల్లులు సచివాలయ కేంద్రాలకు తరలివస్తున్నారు. అందుకు సరైన సమాధానం చెప్పే నాథుడు లేకపోవడంతో ఏంచేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. అలాగే, విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు, రైస్ కార్డులు దరఖాస్తులు చేసుకొనేందుకు సైట్ ఓపెన్ కావడంలేదు,

కాగా, విద్యార్థులు నూతనంగా పాఠశాల ల్లో చేరేందుకు కావలసిన కుల ధ్రువీకరణ పత్రం కోసం వచ్చేవారితో సచి వాలయా లు కిటకిటలాడుతున్నాయి. సర్వర్ సమస్య వేధిస్తుండటంతో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.


లబ్ధిదారులతో కిటకిటలాడుతున్న గ్రామ సచివాలయాలు

రేపటినుంచి అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు


అచ్చమాంబ మూలవిరాట్

పామూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజి ల్లుతున్న శ్రీఅచ్చమాంబ బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 22 వరకు జరగను న్నాయి. మండలంలోని బొట్లగూడూరు పం చాయతి రఘునాథపురం, కమ్మవారిపాలెం గ్రామల సరిహద్దుల్లో వెలసియున్న అచ్చ మాంబ కోర్కెలు తీర్చే దేవతగా ప్రసిద్ధిగాం చింది. అచ్చమాంబను పూజిస్తే సంతానం కలుగుతుందని, అష్టేశ్వరాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మ కం. బుధవారం పసుపుకుంకుమ, సారెకావేళ్ల, గురువారం గణపతి పూజ, పుణ్యాహచనం, గ్రామ ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం అమ్మ వారికి అభిషేకం, గ్రామ ఉత్సవం, శనివారం వెంగమనాయుడు సమేత అచ్చమాంబ పేరంటాలు, అమ్మవారికి కల్యాణం, ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు

ముండ్లమూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓగ్రామానికి చెందిన మహిళను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి న సంతనూతలపాడు మండలం ఎనికపాడు గ్రామానికి చెందిన యద్దనపూ డి సుధాకర్‌పై సోమవారం చీటింగ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.కమలాకర్ తెలిపారు. సదరు యువతితో సుధాకర్ సహజీవనం కూడా చేశారు. ఈక్రమంలో పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు న్యాయం చేయాలని ముండ్లమూరు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతిని వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ


హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో కరుణకుమారి

పామూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య, నోటు పుస్తకాలను సరఫరా చేసినట్లు ఎంఈవో -2 కె.కరుణకుమారి తెలిపారు. పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న పాఠ్య, నోటు పుస్తకాలను గత వారం రోజుల నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యాకిట్లలో భాగంగా బ్యాగులు తప్ప అన్ని వచ్చాయన్నారు. ప్రస్తుతం పాఠ్య, నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్నట్లు చెప్పారు. మిగిలినవి వచ్చే నెలలో ఇస్తామని తెలిపారు.

కాలువలపై ఉన్న తొలగింపులను నిలిపివేయాలి

పామూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని పాత స్టేట్‌బ్యాంకు రోడ్డులోగల పంచాయతీ కాలువలమీద ఉన్న ఇళ్లను, షాపుల తొలగింపు చర్యలను ఆపాలని కోరుతూ ఆ రోడ్డు బాధితులు పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. పం చాయతీ తీర్మానం లేకుండా ముందస్తుగా నోటీసులు జారీ చేయకుండా ఈ చర్యలకు పాల్పడటం తగదన్నారు. తరతరాలుగా నివశిస్తున్న వారిని భ యాందోళనలకు గురిచేయడం సమంజసం కాదన్నారు. పంచాయతీ పాలక వర్గం, అధికారులు ఇళ్లను తొలగించకుండా ట్రాఫిక్ సమస్యను తగు పరి ష్కారం చూపించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

టీడీపీ కార్యకర్తను పరామర్శించిన నాయకులు

పీసీపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై వైద్యశాలలో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న కార్యకర్తను టీడీపీ మండల నా యకులు సోమవారం పరామర్శించారు. టీడీపీ పీసీపల్లి గ్రామ మాజీ అ ధ్యక్షుడు మూలె వెంకటేశ్వరరెడ్డి(సత్తిరెడ్డి) ఇటీవల ఒంగోలులో చికిత్స పొం దాడు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామ య్య తదితరులు సోమవారం సత్తిరెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శిం చారు. ఒత్తిడికి గురికాకుండా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పరా మర్శించిన వారిలో ఓబుల్‌రెడ్డి, మాల్యాద్రి, వీరయ్య, వెంగళరావు, తది తరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

తాళ్లూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామపంచాయతీ కార్యదర్శులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఈమేరకు డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. తూర్పుగంగవరం పంచాయతీ కార్యదర్శి టి.అజ య్‌కీర్తిని మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కొనకనమిట్ల మండలం పెదఇర్లపాడు గ్రామపంచాయతీ కా ర్యదర్శి డి.నాగమల్లేశ్వరి నియమితు లయ్యారు. మల్కాపురం కార్యదర్శి పీవీఎస్ పవన్‌ను చీమకుర్తి మండలం ఏలూరివారిపాలెం పంచాయతీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో దొనకొండ మండలం మంగినపూడి పంచాయతీ కార్యదర్శి ఈవీ శేషమ్మ వస్తున్నారు. బొద్దికూరపాడు పంచా యతీ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగం మండలంలోని విఠలాపురం గ్రామ పంచాయతీకి బదిలీ అయ్యారు. శివరాంపురం పంచాయతీ కార్యదర్శి వై.రా జారమేష్‌ను మద్దిపాడు మండలం దొడ్డవరంకు బదిలీ చేశారు.

కాగా, గత పదేళ్లుగా తహసీల్దార్ కార్యాలయంలో వివిధ హోదాల్లో పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ జె.ఇమ్మానియేల్‌రాజు సోమవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కనిగిరి ఆర్‌డీవో కార్యా లయ డీటీగా బదిలీ అయ్యారు.

సాధువు వేషంలో దోపిడీలు

ఒంగోలు క్రైం,జూన్16(ఆంధ్రజ్యోతి): సాధువు వేషంలో తిరుగుతూ మహిళలను మోసం చేసి దోపిడీలకు పాల్పడే దుండగుడిని ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. చీమకుర్తిలో ఆది వారం సాధువు వేషంలో ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లోకి వెళ్ళి అమెకు మాయమాటలు చెప్పి దాడి చేసి పరారయ్యాడు. అయితే అమె ఇంట్లోకి వెళ్లే సమయంలో సాధువులా వెళ్ళి అక్కడ దోపిడీకి పాల్పడిన తరువాత ప్యాంట్, టీషర్టుతో బయటకు వచ్చినట్లు పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా గుర్తించారు. దీంతో అతను ఒంగోలువైపు వచ్చినట్లు కూడా ఆధారాలు సేక రించి, ఆదివారం ఒంగోలులోని ఓ లాడ్జిలో పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. విజయనగరంకు చెందిన యువకుడు నెలరోజులుగా ఒంగోలులో లాడ్జిలో మకాం వేసి పరిసరప్రాంతాలలో సాధువులా వెళ్లి మహిళలకు మాయమాటలు చెప్పి దోపిడీలకు పాల్పడుతుంటాడని విచారణలో వెల్లడై నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఒంగోలు క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభమై పిల్ల లకు పుస్తకాలు కొనిచ్చి ఇంటికి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో తల్లి మృతి చెదింది. దీంతో పిల్లలు బావురుమంటున్నారు. పుస్తకాలు కొనిచ్చిన ఆనందం ఇంటికి పోయేవరకు కూడా లేదు. మృత్యురూపంలో వచ్చిన టిప్పర్ ఆ కుటుంబంలో విషాదం నింపిది. వివరాలలోకి వెళితే.. స్థానిక ఇస్లాంపేటలో నివాసం ఉంటున్న షేక్ దిల్‌షాద్ (28)రోడ్డు ప్రమాదంలో మరణించింది. ఈదుర్ఘటన సోమవారం స్థానిక కర్నూల్ రోడ్డులోని ఫ్లైవోవర్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు దిల్‌షాద్ అమె భర్త అబుబాకర్ తన ఇద్దరి పిల్లలను తీసుకొనివెళ్లి పుస్తకాలు కొనుగోలు చేశారు. అక్కడ నుంచి ఇంటికి మోటర్‌బైక్‌పై నలుగురు వస్తున్నారు. కర్నూల్ ఫ్లైవోవర్ బ్రిడ్జి వద్ద మోటర్‌బైక్‌పై నుంచి వెనుక కూర్చున్న దిల్‌షాద్ జారి రోడ్డు మీద పడింది. ఆసమయంలో వెనుక నుంచి వస్తున్న చీమకుర్తి వైపు వెళ్లే టిప్పరు అమె కాళ్లపై నుంచి వెళ్లింది. వెంటనే దిల్‌షాద్‌ను ఆసుపత్రికి తర లించగా చికిత్స పొందుదూ మృతి చెందింది. ఒంగోలు తాలుకా ఎస్సై హరి బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉష్ణోగ్రత (అంచనా)

17-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	37	28
తెనాలి	36	28
నరసరావుపేట	36	27
బాపట్ల	36	28
రెంటచింతల	36	27
చీరాల	36	28

కౌలు రైతు సుఖీభవ అనండి

సొంత పొలం ఉన్న వారి వివరాలు మాత్రమే

అన్నదాత సుఖీభవ పథకానికి ప్రస్తుతం సొంత పొలం యజ మానుల వివరాలనే నమోదు చేయాలనే ఆదేశాలు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కౌలు రైతులకు పథకం వర్తింప చేయడంపై తమకు ఎలాంటి మార్గ దర్శకాలు రాలేదనేది యంత్రాంగం మాటగా ఉంది. పెట్టుబడి సాయంలో చేదోడువాదోడుగా ఉండే అన్నదాత సుఖీభవ పథకం తమకు అందించే విషయంలో ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయానికి రాకపోవడం పట్ల కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిలో అయోమయం

- అర్హులుగా సొంత పొలం యజమానులు
- కౌలు దారుల సంగతి ఎటూ తేల్చని ప్రభుత్వం
- సీసీఆర్ కార్డుల జారీ ఇంకా ప్రారంభ దశలోనే
- మనుగడలో ఉన్న కార్డులు నిరుపయోగంగానే..
- పెట్టుబడి ఖర్చులకు ఏం చేయాలో

పాలుపోని కౌలు రైతులు





అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం రైతులకు అందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అర్హులైన లబ్ధిదారుల జాబితా విషయంలో వ్యవసాయ శాఖ తుది నిర్ణయానికి వచ్చింది. మరో మూ డు నాలుగు రోజుల్లో అన్నదాతల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేసేలా వడివడిగా ప్రభుత్వం అడుగు లేస్తోంది. కానీ, కౌలు రైతులకు ఈ సాయం అందడంపై నీలి మేఘాలు కమ్ము కున్నాయి. ఇప్పటి వరకు వారికి పెట్టుబడి సాయం అందిం చడంపై ఎలాంటి మార్గదర్శ కాలను ప్రభుత్వం విడుదల చేయ లేదు. దీంతో అన్నదాత సుఖీభవ పథకం తమకు ఎండమావిగానే మిగలనుందా అనే ఆందోళనను కౌలు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు సీసీఆర్ కార్డుల (పంట సాగు హక్కు పత్రాలు) జారీ ప్రక్రియ ఈ పాటికే ఓ కొలిక్కి రావాల్సి ఉండగా.. ఇంకా ప్రారంభ దశలోనే ఉండడం వారిని మరింత కలవరపరుస్తోంది. కౌలు రైతుకు ఏ ప్రయోజనం దక్కాలన్నా సీసీఆర్ కార్డే ప్రామాణికం చేయడంతో పాటు.. ఓ ప్రణాళిక లేని నిర్ణయాలతో గత ప్రభుత్వం వారి ప్రయోజనాలకు పెద్ద ఎత్తున గండి కొట్టిన సంగతి తెలిసిందే. సీసీఆర్‌సీ స్థానంలో కొత్త కౌలు చట్టం తెస్తామని ప్రస్తుత ప్రభుత్వం గతంలో ప్రకటించింది. కానీ, ఇంతవరకు అది కార్యరూపం దాల్చకపోగా ఖరీఫ్ పనులు మొదలైనా సీసీఆర్ కార్డుల జారీ కనీసం 20 శాతం కూడా పూర్తి కాకపోవడం వ్యవసాయశాఖ వైఫల్యంగా కనబడుతోంది. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ప్రభుత్వం తమ గోడు కూడా ఆలకించాలని, ఇప్పటికే వ్యాలిడిటీ ఉన్న కార్డుల విషయంలో పథకం అమలుపై ఆలోచించాలని కౌలు రైతులు ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు.

కౌలు రైతులే అధికం

బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు 4.50 లక్షల మంది వరకు కౌలురైతులు ఉంటారనేది ఓ అంచనా. వీరిలో సొంత పొలం కనీసం అరెకరం

(మిగతా 6వ పేజీలో)



3వ వార్డులో బండి చెరువును ఆక్రమించుకుని కట్టుకున్న గృహాలు

చెరువుల ఆక్రమణలపై దృష్టి

- తొలగింపునకు రేపల్లె మునిసిపాలిటీ చర్యలు
- విలువైన భూముల్లో పక్కాగృహాల నిర్మాణం
- సర్వే చేసి గుర్తించిన అధికారులు
- అభివృద్ధి పనులకు రూ.4.50 కోట్ల నిధులు

రేపల్లె, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీరు అందించేందుకు దశాబ్దాల కిందట రేపల్లె పట్టణంలో చెరువులను ఏర్పాటు చేశారు. క్రమేపి పట్టణం విస్తరిస్తూ.. చెరువుల్లోకి వచ్చింది. దీంతో చెరువుల భూముల విలువ అమాంతం పెరిగిపోయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది నాయకులు చెరువు భూములను ఆక్రమించి, పక్కాగృహాలను కూడా నిర్మించుకున్నారు. దీనిని అరికట్టాల్సిన మున్సిపల్ అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ప్రేక్షక పాత్ర వహించారు. దీంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ తాగునీటి సమస్య తలెత్తకుండా చెరువుల అభివృద్ధి కోసం రూ.4.50 కోట్ల నిధులను విడుదల చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు పట్టణం



బండిచెరువును ఆక్రమించుకుని కట్టుకున్న గృహాలను తొలగించాలంటూ మున్సిపల్ అధికారులు మార్క్ వేసిన దృశ్యం

లోని ప్రధాన బండిచెరువు, వేపాళమ్మచెరువు, నక్కవానిచెరువు, పేటేరురోడ్డులోని రజక చెరువుల అభివృద్ధిపై దృష్టి సారించారు. వారం నుంచి చెరువుల సర్వే ప్రారంభించి ఆక్రమణలకు గురైన ప్రదేశాలను గుర్తించారు. బండి చెరువు, నక్కవాని చెరువు ఆక్రమణలకు గురయినట్లు గుర్తించారు. చెరువులో నిర్మించుకున్న పక్కా గృహాలకు మార్కింగ్ కూడా చేశారు. బండి చెరువులో సుమారు 43 మంది పక్కా గృహాలను నిర్మించుకున్నారని గుర్తించారు. నక్కవాని చెరువు చుట్టూ ఆక్రమణలు తొలగించి.. ఆహ్లాదకరమైన వాతావరణంలో అభివృద్ధి పనులు చేపట్టే పనిలో మున్సిపల్ అధికారులు నిమగ్నమయ్యారు. దీంతో పట్టణంలోని ప్రధాన చెరువులన్నింటికి పూర్వవైభవం రానుంది.

త్వరలో ఆక్రమణల తొలగింపు..

పట్టణంలో ఉన్న చెరువులను అభివృద్ధి చేసేందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ నిధులు మంజూరు చేయించారని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. పట్టణంలోని ప్రధాన చెరువుల ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేస్తామన్నారు. సర్వేచేయించి ఆక్రమణలను గుర్తించామని, ఆక్రమణల దారులకు నోటీసులు జారీ చేశామని, అక్రమంగా కట్టుకున్న గృహాలను ఖాళీ చేయాలని సూచించినట్లు వెల్లడించారు.

అదనం.. 5,000 టన్నులే!

- నేటితో రబీ ధాన్యం సేకరణ ముగింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం నుంచి మూసివేస్తున్నట్లు కలెక్టర్ వెంకటమురళి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సీజన్‌కు మొత్తం 34,953 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. రబీకి తొలుత 30 వేల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ లక్ష్యం చాలదని అంచనాకొచ్చిన సివిల్ సప్లయిస్ మరో 25 వేల టన్నుల సేకరణకు అనుమతులివ్వాలని గడచిన నెల మొదటి వారంలో ప్రతిపాదనలను ప్రభుత్వానికి



పంపింది. ప్రభుత్వం తొలుత 5 వేల టన్నులకు ఎనేబుల్ ఇచ్చిందని దశలవారీగా మిగిలిన 20 వేల టన్నులకు కూడా అనుమతి వస్తుం దని అధికారులు చెబుతూ వచ్చారు. తొలుత ఇచ్చిన 30 వేల టన్నుల తో పాటు అదనం 5 వేల టన్నులు కూడా పూర్తయి ఇప్పటికే పది రోజులు గడిచింది. బాపట్ల, రేపల్లె పరిధిలో ఇంకా దాదాపు 40 వేల టన్నుల ధాన్యం ఉన్నట్లు నిర్ధారణకు వచ్చిన యంత్రాంగం అదనపు అనుమతులు కోసం ఎదురుచూస్తూ వచ్చింది. కానీ, శాఖ కమిషనరేట్ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం, నిబంధనల మేరకు.. కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంచే గడువు కూడా ముగియడంతో రబీ ధాన్యం సేకరణ ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు.

ఆర్భాటపు ప్రకటనలు దేనికి..

సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా అదనంగా 25 వేల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులంటూ ఆర్భాటపు ప్రకటనలివ్వడం, తర్వాత దానిని 5 వేల టన్నులతోనే సరిపెట్టడంపై అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. కమిషనరేట్ ఇచ్చిన మాట ప్రకారం అదనంగా అనుమతి ఇస్తుందనే దాదాపు పది రోజుల పాటు ఎలాంటి కొనుగోళ్లు జరపకపోయినా.. కేంద్రాలను తెరిచే ఉంచామని, కానీ ఆ అవకాశం లేకపోవడం వల్లే రబీ సేకరణ ముగిసినట్లు ప్రకటించాల్సి వచ్చిందని యంత్రాంగం చెప్పడం కొసమెరుపు.

సచివాలయ ఉద్యోగుల.. బదిలీలకు శ్రీకారం!



- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ ఉంటే.. బదిలీ తప్పనిసరి
- స్వగ్రామం, సొంత మండలాల్లో నియామకానికి చెక్
- ఈ నెల 30 నాటికి ప్రక్రియ పూర్తి

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో భాగంగా.. ఇప్పుడు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పోయిన అయిదేళ్లలో బదిలీలు లేకపోవ డంతో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బదిలీలకు అవకాశం కల్పించింది. గతేడాది నవంబరులో పరిమిత స్థాయిలో బదిలీలు జరగ్గా.. ఇప్పుడు జీవో నంబరు 5 ప్రకారం మొత్తం ఉద్యోగుల బదిలీకి అవకాశం కల్పించింది.

● ఐదేళ్లు దాటితే స్థాన చలనం తప్పదు

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు కిందటేడాది ప్రభుత్వం అవకాశం కల్పించినా మెజారిటీ ఉద్యోగులు బదిలీలకు సిద్ధపడలేదు. దీంతో నామమాత్రంగానే బదిలీలు జరిగాయి. దీంతో ఇప్పుడు ప్రభుత్వం సచివాలయాల్లో పాతుకుపోయిన వారిని బదిలీ చేసేందుకు పూనుకుంది. ఒకే సచివాలయంలో ఐదేళ్లపాటు విధుల్లో ఉన్న ఉద్యోగులను వేరే సచివాలయానికి బదిలీ చేస్తూ జీవో జారీ చేసింది. ఐదేళ్లు పూర్తికాని ఉద్యోగుల వ్యక్తిగత అభ్యర్థనపై బదిలీ అయ్యేందుకు అవకాశం కల్పించింది. అయితే ఉద్యోగులు ఎవరూ వారి సొంత గ్రామాలు, మండలాలకు బదిలీ అయ్యే వీలు లేదు. దీని పైనే.. ఉద్యోగ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. తక్కువ జీతాలతో పనిచేసే వారికి సొంత ప్రాంతంలో పనిచేసుకునే అవకాశం కల్పిస్తే ఆర్థిక భారం తప్పు తుందని చెబుతున్నారు. బదిలీల జీవో వచ్చిన వెంటనే వారు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 1,322 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 562, పల్నాడు జిల్లాలో 532, బాపట్ల జిల్లాలోని ఉమ్మడి గుంటూరు జిల్లా వరకూ 228 సచివాలయాలు ఉన్నాయి మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 824 గ్రామ సచివాలయాలు ఉండగా వాటిలో 7,069 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి కోసం ఒక మాడ్యూల్ రూపొందించారు. వీరి బదిలీలకు సంబంధించిన ఖాళీల ఎంపిక ఎంపీడీవోలకు అప్పగిం చారు. కాగా ఉమ్మడి జిల్లాలో 439 వార్డు సచివాలయాల్లో 3,912 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారి కోసం వేరొక మాడ్యూల్ రూ పొందించారు. వీరి బదిలీలకు సం బంధించిన ప్రక్రియని మున్సిపల్ కమిషనర్లకు అప్పగించారు. వారే తమ పరిధిలో ఉన్న ఖాళీల వివరాలను నమోదు చేసి, కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తారు.

● ఉమ్మడి జిల్లాల ఆధారంగా బదిలీలు

ఉద్యోగుల ఎంపిక సమయంలో జరిగిన విధంగానే ఉమ్మడి జిల్లాల ఆధారంగా బదిలీల ప్రక్రియ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉమ్మడి జిల్లా కలెక్టర్లే అప్పాయింటింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. బదిలీ ఆదేశాలు వారే ఇస్తారు. హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్లో రెండు మాడ్యూళ్లలో అభ్యర్థులు తమ బదిలీలకు సంబంధించి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

● ప్రత్యేక కేటగిరీలకు ప్రాధాన్యం

కంటి చూపులేని, బుద్ధి మాంద్యం పిల్లలు న్న ఉద్యో గులకు వైద్య సదుపాయాలు అందు బాటులో ఉన్న చోటే పోస్టింగులు ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి సర్వీసు ఉన్నవారికి, వైకల్యం 40 శాతానికి మించి ఉన్నవారికి, ఆరోగ్య కారణాల రీత్యా (మిగతా 6వ పేజీలో)



ద్విచక్రవాహనాలను ప్రారంభించి అవగాహన కల్పిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

ట్రాఫిక్ విధులకు 16 ద్విచక్ర వాహనాలు

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ విధుల నిర్వహణకు జిల్లా పోలీసు కార్యాలయానికి 16 నూతన ద్విచక్ర వాహనాలు వచ్చాయి. వాహనాలను సోమవారం ఎస్పీ తుషార్ డూడి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రారంభించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతూ అవగాహన కల్పించారు. పోలీసు కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ మీదగా పాత బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ద్విచక్ర వాహనాలను డీజీపీ పి.హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాకు కేటాయించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ బైక్‌లకు పోలీసు సైరన్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, ప్రథమ చికిత్స కిట్‌లతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని జత చేయడం జరిగిందన్నారు.

బంగారు కుటుంబాలకు చేయూత

- పదమూడు మందికి రూ.10.95లక్షలు
- అధికారులూ సహకారమందించాలి : కలెక్టర్

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బంగారు కుటుంబాల ఆర్థిక, సామాజికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. పీ-4 పథకం కింద బంగారు కుటుంబాలకు సోమవారం కలెక్టరేట్‌లో చేయూత నందించారు. బంగారు కుటుంబాల జీవనస్థితిగతులను పరిగణంలోకి తీసుకున్న డీఆర్‌డీఏ 13 కుటుంబాలను దత్తత తీసుకుంది. వారికి స్థిరమైన జీవనోధి కల్పించడం కోసం రూ. 10.95లక్షలను కలెక్టర్ మంజూరు చేశారు. చెక్కు రూపంలో నగదును బంగారు కుటుంబాలకు కలెక్టర్ చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బంగారు కుటుంబాలకు జిల్లా అధికారులు తమవంతు సహయసహకారాలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 పథకం బాపట్ల జిల్లాలో అమలులోకి వచ్చిందన్నారు. బంగారు కుటుంబాలకు చేయూనిచ్చేందుకు, జిల్లా అధికారులు, బ్యాంక్ అధికారులు 300మంది మార్గదర్శిలుగా సంబంధిత వెబ్ పోర్టల్‌లో తమపేర్లు నమోదు చేసుకున్నారని వివరించారు. 50లక్షల రూపాయలకు మించి వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలను మార్గదర్శిలుగా గుర్తించిందన్నారు. అలాంటి మార్గదర్శిలు 6వేలమంది నమోదవ్వాలన్నారు. పి4 విధానంపై విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు.

పీ4తో లబ్ధి పొందిన వారితో కలెక్టర్ జె.వెంకటమురళి



పీ-4 లబ్ధిదారులు

ఎస్ ప్రవీణకు గొర్రెల పెంపకం కోసం రూ. 2లక్షలు, టీ లక్ష్మీ గృహనిర్మాణం కొరకు రూ. 2లక్షలు, కే అరుణ కిరణా దుకాణం కొరకు రూ. 1లక్ష, షేక్.కరిష్మా గృహనిర్మాణం కొరకు రూ. 1 లక్ష, కే పోలేరమ్మ చేపల వ్యాపారం కొరకు రూ. 1లక్ష, సింగోతులక్ష్మీ వ్యవసాయం కొరకు రూ. 1లక్ష, తోట కనకమ్మ ఇంటి అప్పుకొరకు రూ. 1లక్ష, ఎం.మేరి కూరగాయల వ్యాపారం కొరకు రూ. 50 వేలు, కంచర్ల మహాలక్ష్మీ ఇంటినిర్మాణం కొరకు రూ. 50 వేల రూపాయలచెక్కులను కలెక్టర్ అందజేశారు. అలాగే 50వేల రూపాయలువిలువ చేసే వినికిడి యంత్రాలను పద్మ, వెంకటశేషమ్మ, కోటేశ్వరమ్మలకు అందజేశారు. పెదగంజాం గ్రామానికి చెందిన వెంకటరెడ్డికి బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూఅధికారి జీ గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పీ గ్లోరియా, వెలుగు అధికారులు కే రవికుమార్,జీ సుబ్బారావు, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

గూడేలలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

సీఎండీ పుల్లారెడ్డిని కోరిన ఎరిక్షన్‌బాబు



సీఎండీని కలిసిన ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి, నల్లమల అటవీ ప్రాంతంలో జీవించే చెంచుల గూడేలలో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసి వెలుగులు నింపాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. ఈ మేరకు ఆయన విద్యుత్ శాఖ సీఎండీ పీ పుల్లారెడ్డిని సోమవారం విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. వైపాలెం నియోజకవర్గంలో లోవోల్టేజీ సమస్య ఎక్కువగా ఉందని అందుకు అవసరమైన సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని, ఎక్కువ శాతం నల్లమల అటవీ ప్రాంతాలలో చెంచులుండే గూడేలలో విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు అటవీశాఖ అధికారుల అనుమతులు ఉండవని ఎరిక్షన్‌బాబు వివరించారు. అందుకు ప్రత్యామ్నాయంగా సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి గూడెం వాసుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. వ్యవసాయానికి కూడా సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలన్నింటిపైనా సీఎండీ సానుకూలంగా స్పందించారని ఎరిక్షన్‌బాబు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా రమణబాబు



గిద్దలూరు టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబును ఇటీవల ప్రభుత్వం నియమించడంతో రమణబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మున్సిపల్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న ఐ.శ్రీనివాసులు పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు

ముండ్లమూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓగ్రామానికి చెందిన మహిళను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి న సంతనూతలపాడు మండలం ఎనికపాడు గ్రామానికి చెందిన యద్దనపూడి సుధాకర్‌పై సోమవారం ఛీటింగ్ కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.కమలాకర్ తెలిపారు. సదరు యువతితో సుధాకర్ సహజీవనం కూడా చేశారు. ఈక్రమంలో పెళ్లికి నిరాకరించటంతో బాధితురాలు తనకు న్యా యం చేయాలని ముండ్లమూరు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతిని వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

రేపటినుంచి అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు



అచ్చమాంబ మూలవిరాట్

పామూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీఅచ్చమాంబ బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 22 వరకు జరగనున్నాయి. మండలంలోని బొట్లగూడూరు పం చాయతి రఘునాథపురం, కమ్మవారిపాలెం గ్రామల సరిహద్దుల్లో వెలసియున్న అచ్చ మాంబ కోర్కెలు తీర్చే దేవతగా ప్రసిద్ధిగాం చింది. అచ్చమాంబను పూజిస్తే సంతానం కలుగుతుందని, అష్టైశ్వరాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మ కం. బుధవారం పసుపుకుంకుమ, సారేకావేళ్ల, గురువారం గణపతి పూజ, పుణ్యాహాచనం, గ్రామ ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం అమ్మ వారికి అభిషేకం, గ్రామ ఉత్సవం, శనివారం వెంగమనాయుడు సమేత అచ్చమాంబ పేరంటాలు, అమ్మవారికి కల్యాణం, ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆయన రూటే సప‘రేటు’

జలవనరుల శాఖలో అవినీతి జలగ

చేతులు తడపందే ఫైళ్లు కదలవు

మధ్యాహ్నం 12 దాటితే ఆఫీసే బార్



జలవనరులశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం

మార్కాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జలవనరుల శాఖకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. దీంతో ఆ కార్యాలయం వైపు తొంగి చూసిన కాంట్రాక్టర్ లేరు. కానీ గత సంవత్సరం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ పరిస్థితి మారింది. జలవనరుల శాఖ కార్యాలయం కళ కూడా మారింది. డివిజన్ మొత్తం చెరువుల ఆధునికీకరణకు ప్రభుత్వం సమృద్ధిగా నిధులు కేటాయించింది. దీంతో మళ్లీ కాంట్రాక్టర్‌లతో ఆ కార్యాలయంలో కళకళలాడుతోంది. ఇదే అదునుగా భావించారు డివిజన్ ఈఈ కార్యాలయంలో పనిచేసే ఓ కీలక ఉద్యోగి. రెగ్యులర్ అధికారి ఎవరూ అందుబాటులో లేకపోవడంతో పోస్టు చిన్నదే అయినా అతను చెప్పిందే వేదంగా మారింది. అతని ప్రమేయం లేనిదే ఎలాంటి ఫైళ్లయినా ఆఫీసులోంచి కదలవు. డీఈ స్థాయి అధికారులు కూడా అతను చెప్పినట్లు వినాల్సిందే. ఉద్యోగుల యూనియన్‌లో కూడా కీలకమైన పదవుల్లో ఉండడంతో అతని జోలికి వెళ్లే సాహసం ఎవరూ చేయడం లేదు. అధికార పార్టీకి చెందిన చిన్నపాటి కాంట్రాక్టర్‌ల వద్ద కూడా ముక్కుపిండి మరీ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అది ఎంతటి పనైనా లెక్కకట్టి అతనికి సమర్పించుకోవాల్సిందే. మధ్యవర్తులు, దళారులతో పనిలేకుండా నేరుగా లంచం తీసుకోవడం ఆయన నైజం. అంతేకాక మధ్యాహ్నం అయిందంటే చాలు అతని కార్యాలయాన్ని బార్‌గా మార్చుకోవడం పరిపాటిగా మారింది. అతని ఆఫీస్ ర్యాకుల్లో ఎప్పుడూ మద్యం సీసాలు దర్శనమిస్తుంటాయి. ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోవడం, ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో అతను ఏం చేసినా సాగిపోతోందని కార్యాలయంలో పలువురు ఉద్యోగులు చెప్తున్నారు. ఒకసారి ఎస్ఈ కార్యాలయానికి బిల్లు కోసం పంపిన ఫైలు వెనక్కి వచ్చింది. దానిని మళ్లీ పంపేందుకు కూడా లంచం డిమాండ్ చేయడంతోనే కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. వ్యవహారంలోనే డబ్బులు తీసుకుంటూ సదరు ఉద్యోగి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

మధ్యాహ్నం అయితే మద్యం పరవళ్లు

పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు చేయించుకునేందుకు కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేయడం సహజం. ఈ క్రమంలో కీలకమైన ఆ ఉద్యోగి వద్దకు వెళ్తే సర్సంటేజీలతోపాటు మద్యం సీసాలు కూడా ఇవ్వాల్సిందే. మధ్యాహ్నం 12.00 గంటలు దాటితే అతని కార్యాలయం బార్‌గా మారిపోవడం పరిపాటి. ఆఫీస్ టేబుల్‌పైనే ఉద్యోగుల యూనియన్‌లోని సహచరులు, కాంట్రాక్టర్‌లతో కలిసి పనివేళల్లోనే పూటుగా మద్యం తాగడం అతని ఆనవాయితీ. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులు మందలించినా పరిస్థితిలో మార్పురాలేదని కార్యాలయ వర్గాలు చెప్తున్నాయి. ఏసీబీ అధికారులు సోమవారం చేసిన దాడుల్లో కూడా కొన్ని సీసాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది. కానీ ఈ విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు సమాచారం.

ఎంతటి వారైనా కప్పం కట్టందే ఫైళ్లు కదలవు

మార్కాపురం జలవనరుల శాఖ ఈఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కాకి శ్రీనివాసరావు అవినీతికి కేరాఫ్‌గా మారారు. డివిజన్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పని జరిగినా ఆయన వద్ద నుంచే ఫైళ్లు ఉన్నతాధికారుల టేబుల్‌ల మీదకు వెళ్లాలి. పని దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో ముందుగా పర్సంటేజీల విషయమై డీల్ కుదుర్చుకునేది అయనే. అన్నీ అనుకున్నట్లు కాంట్రాక్టర్ చేయి తడిపితే ఫైళ్లు ముందుకు కదిలి బిల్లులు వస్తాయి. ఏ మాత్రం ఆయన్ని పట్టించుకోకపోయినా, లెక్క తగ్గినా ఇక అంతే సంగతులు. నెలలు, సంవత్సరాలు గడిచినా బిల్లులు రాకుండా కొర్రీలు వేయగల సమర్థుడు. దీంతోనే అతనంటే కాంట్రాక్టర్లు హడలెత్తి పోతున్నారు. ప్రస్తుతం ఇరిగేషన్ పనులకు సంబంధించి 15 నుంచి 20 శాతం పర్సంటేజీలు నడుస్తున్నట్లు సమాచారం. కాంట్రాక్టర్‌ల వద్ద లంచాలు తీసుకోవడం ఒక ఎత్తైతే చివరికి అధికారులను కూడా ఆయన వదల్లేదని తెలుస్తోంది. ఈ మధ్యనే మార్కాపురం వచ్చిన ఓ అధికారికి సంబంధించిన ఇంక్రిమెంట్ల బిల్లుల ఫైళ్లు ఉన్నతాకారులకు పంపడానికి కూడా లంచం డిమాండ్ చేసినట్లు ఆఫీసు వర్గాలు తెలిపాయి. వాస్తవానికి చాలా చిన్నపనే అయినా సబ్ డివిజన్ స్థాయి అధికారి అయిన ఆయన రూ.15వేలు లంచం ఇవ్వందే ఫైలు పంపనట్లు తెలిసింది. తిలాపాపం తలా గరిటెడులా పర్సంటేజీల్లో అన్ని స్థాయిల అధికారులకు వాటాలు ఉండడంతోనే అతను చెప్పినట్లే నడుస్తున్నట్లు తెలుస్తోంది.

శరవేగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం



అద్దంకిలోని ద్వారకానగర్ వద్ద నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

అద్దంకి, జూన్16(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం రెండు సబ్‌స్టేషన్లను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గత నెల 30 న వీటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎస్ఎస్‌పీ కార్యాలయం ఆవరణ లో 6.7 కోట్ల రూపాయలతో సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్, శింగరకొండ రోడ్డు లోని ద్వారకానగర్ వద్ద 4.5 కోట్ల రూపాయలతో సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే అత్యధిక శాతం నిర్మాణ పనులు పూర్తి కాగా, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటికి అనుసంధానంగా విద్యుత్‌లైన్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఎస్ఎస్‌పీ కాలనీలోని సబ్‌స్టేషన్ ద్వారా శ్రీనగర్, రామ్‌నగర్, నర్రావారిపాలెం, గాంధీబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాలకు, ద్వారకానగర్ వద్ద ఏర్పాటు చేసే సబ్‌స్టేషన్ ద్వారా అద్దంకి పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్, పాత దామావారిపాలెం, దర్శి రోడ్లలోని వివిధ ప్రాంతాలతో పాటు అద్దంకి పట్టణానికి మంచి నీటి పంపింగ్ చేసే గుండ్లకమ్మనదిలోని ఊటబావుల మోటార్‌లకు, మండలంలోని తిమ్మాయపాలెం, రామాయపాలెం గ్రామాలకు తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించే అవకాశం కలుగుతుంది.

కనీసం మరో దశాబ్దకాలం పాటులో ఓల్టేజ్ సమస్య లేకుండా ఉండే విధంగా ముందస్తు ప్రణాళికతో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. త్వరలో అద్దంకి పట్టణ విద్యుత్ వినియోగదారులకు లో-వోల్టేజీ సమస్య నుండి విముక్తి కలగనుంది.

వసతి గృహంలో.. కొరవడిన పర్యవేక్షణ

- ఏడాదిగా వార్డన్ పోస్టు ఖాళీ
- పట్టించుకోని అధికారులు



ఎస్సీ-2 బాలుర హాస్టల్ భవనం

దొనకొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ-2 బాలుర వసతి గృహంలో గత ఏడాది బాధ్యతలు చేపట్టిన సంక్షేమాధికారి మెడికల్ లీవ్‌పెట్టి వెళ్లారు. దీంతో ఏడాదిగా ఇన్‌చార్జ్‌తో కొనసాగుతోంది. ఎస్సీ-1 బాలుర వసతిగృహం సంక్షేమాధికారి ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెగ్యులర్ అధికారి లేకపోవటంతో విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడుతుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థుల విద్యాభివృద్ధి నిమిత్తం ఏర్పాటుచేసిన వసతి గృహానికి రెగ్యులర్ అధికారిని నియమించటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సంక్షేమాధికారులకు జరిగిన బదిలీల్లోనూ ఇక్కడి అధికారిని నియమించలేదు. పాఠశాలలు పునఃప్రారంభమై విద్యార్థులు వసతి గృహాల్లో చేరుతున్న సమయంలో ఒకే సంక్షేమాధికారి రెండుచోట్ల విద్యార్థులను పర్యవేక్షించటం ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. అలాగే, బీసీ బాలుర వసతి గృహం సంక్షేమాధికారి ఇటీవల బదిలీ అయ్యారు. బీసీ బాలికల వసతి గృహం సంక్షేమాధికారిణికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎస్సీ-2 బాలుర హాస్టల్‌కు, బీసీ బాలుర హాస్టల్‌కు రెగ్యులర్ అధికారులను నియమించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వేధిస్తున్న సర్వర్ సమస్య

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



లబ్ధిదారులతో కిటకిటలాడుతున్న గ్రామ సచివాలయాలు

పామూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, సేవలు పొందేందుకు గ్రామ సచివాలయాలకు వెళుతున్న లబ్ధిదారులకు సర్వర్ సమస్య వేధిస్తున్నది. తల్లికి వందనం అర్హత, అనర్హత, జాబితాల్లో పేర్లు ఉన్నవాళ్లకు నగదు పడకపోవడంతో పిల్లలతో సహా తల్లులు సచివాలయ కేంద్రాలకు తరలివస్తున్నారు. అందుకు సరైన సమాధానం చెప్పే నాథుడు లేకపోవడంతో ఎంచేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. అలాగే, విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు, రైస్ కార్డులు దరఖాస్తులు చేసుకొనేందుకు సైట్ ఓపెన్ కావడంలేదు,

కాగా, విద్యార్థులు నూతనంగా పాఠశాల ల్లో చేరేందుకు కావలసిన కుల ధ్రువీకరణ పత్రం కోసం వచ్చేవారితో సచి వాలయా లు కిటకిటలాడుతున్నాయి. సర్వర్ సమస్య వేధిస్తుండటంతో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

కౌలు రైతు సుఖీభవ అనండి

(5వ పేజీ తరువాయి)

కూడా లేని వారి సంఖ్య మూడు లక్షలకు పైమాటే. మొత్తం సాగులో దాదాపు 60 శాతం వాటా కౌలు రైతులదే. ఇందులో రకరకాల కారణాలతో సీసీఆర్ కార్డులు అందుతున్నది సగం మందికే. ఈ సగం మంది కౌలు రైతులు కూడా బ్యాంకు రుణాల దగ్గర నుంచి విత్తనాల రాయితీ వరకు నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నారు.

జిల్లాల వారీగా సీసీఆర్‌సీ లక్ష్యాలివి

ఈ ఏడాది సీసీఆర్ కార్డుల జారీ విషయంలో బాపట్ల జిల్లాలో లక్ష మంది కౌలు రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటి వరకు జారీ చేసింది 3,800 మాత్రమే. పల్నాడు జిల్లాలో 68 వేలు సీసీఆర్‌సీ కార్డులు అందించాల్సి ఉండగా ఇప్పటికీ జారీ చేసిన కార్డులు రెండు వేలు లోపే ఉన్నాయి. అదే విధంగా గుంటూరు జిల్లాలో 55 వేలు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖకు లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికీ జారీ చేసిన కార్డులు మూడు వేలు లోపే ఉండడం గమనార్హం. ఖరీఫ్ మొదలయ్యే నాటికే ఈ సీసీఆర్ కార్డుల ప్రక్రియ పెద్ద ఎత్తున ప్రారంభం కావాల్సి ఉండగా ఆ దిశగా వ్యవస్థలు సన్నద్ధం కాకపోవడం కూడా కౌలు రైతులకు శాపంగా మారింది.

సీసీఆర్ కార్డులే ప్రామాణికమైతే..

అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప చేయడానికి సీసీఆర్ కార్డులే ప్రామాణికమైతే అదే విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కౌలు రైతులు డిమాండ్ చేస్తున్నారు. అసలు మార్గదర్శకాలలో కౌలు రైతుల ఊసే లేకపోవడం మరింత గందరగోళ పరుస్తుందని వాపోతున్నారు. గతేడాది జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డుల్లో జూలై మొదలుకుని నవంబరు చివరి వరకు వ్యాలిడిటీ ఉన్న కార్డుల సంఖ్య దాదాపు 50 వేలు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. 11 నెలల కాల పరిమితితో ఇచ్చే సీసీఆర్ కార్డులను గతేడాది జూలై నుంచి నవంబరు వరకు కౌలు రైతులకు ఇస్తూనే ఉండడంతో గడువు ఉన్న కార్డులు ఇంకా గణనీయంగానే ఉన్నట్లు క్షేత్రస్థాయి గణాంకాలు చెబుతున్నాయి. వీటితోపాటు ఈ ఏడాది జారీ చేసిన కొత్త కార్డులు కూడా మూడు జిల్లాల పరిధిలో ఇప్పటికే పదివేల వరకు ఉన్నాయి.

పొంతనలేని సమాధానాలు

సీసీఆర్ కార్డుల వ్యాలిడిటీ విషయంలో యంత్రాంగం వైపు నుంచే పొంతనలేని సమాధానాలు వస్తున్నాయి. గతేడాది జారీ చేసిన కార్డులకు గడువు ఉన్నప్పటికీ దానితో సంబంధం లేదని ఇప్పుడు కొత్తగా జారీ చేసేవే ప్రామాణికమని చెబుతున్నారు. మరోవైపు ఈ కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన సాగడానికి కారణం ఇంకా కాలపరిమితి ఉండడాన్ని యంత్రాంగం చూపిస్తోంది. ప్రస్తుతం మనుగడలో ఉన్న సీసీఆర్ కార్డులను ఎనేబుల్ చేయడానికి తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, సొంత పొలం యజమానుల వివరాలే పంపమన్నారని అధికారులు చెబుతున్నారు.

వెంటాడుతున్న సాంకేతిక కష్టాలు

అన్నదాత సుఖీభవ పథకం అర్హతకు సంబంధించి పలు సాంకేతిక చిక్కులు భూ యజమానులను వెంటాడుతున్నాయి. వైసీపీ చేపట్టిన అస్తవ్యస్త రీ-సర్వే వల్ల వేల సంఖ్యలో భూ రికార్డులు తహసీల్దార్ల లాగిన్‌లకు చేరాయి. వీటి విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదని సమాచారం. ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ చేయించుకోవాలనే నిబంధనను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గత ప్రభుత్వంలో ఈ విధానంతో పాటు మొబైల్‌కు ఓటీపీ పంపి కూడా ప్రక్రియ పూర్తి చేయడంతో అన్నదాతలకు సులువుగా ఉండేది. ఇప్పుడు ఒక్క బయోమెట్రిక్ విధానాన్నే అమలు చేస్తుండగా పలు చోట్ల సర్వర్ సమస్యలతో రైతులు గంటల తరబడి పనులు మానుకుని నిరీక్షించాల్సి వస్తోంది.

ఉన్నత లక్ష్యాలతో చదవాలి

అవీఇవీ



ఉదయ్‌క్రిష్ణారెడ్డిని సన్మానిస్తున్న కడవకుదురు హెచ్ఎం ఉపాధ్యాయులు

చినగంజాం, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఆల్ ఇండియా స్థాయిలో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన మూలగాని ఉదయ్ కృష్ణారెడ్డిని కడవకుదురు జడ్పీ పాఠశాల ఆవరణలో కడవకుదురు, చినగంజాం జడ్పీ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం కడవకుదురు జడ్పీ పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉదయకృష్ణారెడ్డి, పాఠశాల విద్యార్థులు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని విద్యను అభ్యసించాలన్నారు. ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని అధికమించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం. కే.శ్రీనివాసరెడ్డి, కడవకుదురు, చినగంజాం జడ్పీ పాఠశాలల ఉపాధ్యాయులు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆనందం అంతలోనే ఆవిరి

- పిల్లలకు పుస్తకాలు కొనిచ్చి వస్తుండగా ప్రమాదం
- బైక్‌పై నుంచి పడిన తల్లి మీదుగా వెళ్లిన టిప్పరు
- చికిత్స పొందుతూ మృతి
- బావురు మంటున్నపిల్లలు

ఒంగోలు క్రైం,జూన్16(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభమై పిల్లలకు పుస్తకాలు కొనిచ్చి ఇంటికి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో తల్లి మృతి చెదింది.దీంతో పిల్లలు బావురు మంటున్నారు. పుస్తకాలు కొనిచ్చిన ఆనందం ఇంటికి పోయేవరకు కూడా లేదు. మృత్యు రూపంలో వచ్చిన టిప్పర్ ఆ కుటుంబంలో విషాదం నింపిది. వివరాలలోకి వెళితే స్థానిక ఇస్లాంపేటలో నివాసం ఉంటున్న షేక్ దిల్‌షాద్ (28)రోడ్డు ప్రమాదంలో మరణించింది. ఈదుర్ఘటన సోమవారం స్థానిక కర్నూల్ రోడ్డులోని ఫ్లైవోవర్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు దిల్‌షాద్ అమె భర్త అబుబాకర్ తన ఇద్దరి పిల్లలను తీసుకొని వెళ్లి పుస్తకాలు కొనుగోలు చేశారు. అక్కడ నుంచి ఇంటికి తిరిగి మోటర్‌బైక్‌పై నలుగురు ప్రయాణిస్తున్నారు. కర్నూల్ ఫ్లై వోవర్ బ్రిడ్జి వద్ద మోటర్‌బైక్‌పై నుంచి వెనుక కూర్చున్న దిల్‌షాద్ జారి రోడ్డు మీద పడింది. దీంతో వెనుక నుంచి వచ్చి చీమకుర్తి వైపు వెళ్లే టిప్పరు అమె కాళ్లపై నుంచి వెళ్లింది. వెంటనే దిల్‌షాద్‌ను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చిక్సిత పొందుదూ అమె మృతి చెందింది. ఈమేరకు ఒంగోలుతాలుకా ఎస్సై హరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాధువు వేషంలో దోపిడీలు

- పోలీసుల అదుపులో దుండగుడు
- నెలరోజులుగా ఒంగోలు లాడ్జిలో మకాం

ఒంగోలు క్రైం,జూన్16(ఆంధ్రజ్యోతి): సాధువు వేషంలో తిరుగుతూ మహిళలను మోసం చేసి దోపిడీలకు పాల్పడే దుండగుడిని ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. చీమకుర్తిలో ఆదివారం సాధువు వేషంలో ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లోకి వెళ్లి అమెకు మాయమాటలు చెప్పి దాడి చేసి పరారయ్యాడు. అయితే అమె ఇంట్లోకి వెళ్లే సమయంలో సాధువులా వెళ్ళి అక్కడ దోపిడీకి పాల్పడిన తరువాత ప్యాంట్, టీషర్టుతో బయటకు వచ్చినట్లు పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా గుర్తించారు. దీంతో అతను ఒంగోలువైపు వచ్చినట్లు కూడా ఆధారాలు సేకరించి, ఆదివారం ఒంగోలులోని ఓ లాడ్జిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయనగరంకు చెందిన యువకుడు నెలరోజులుగా ఒంగోలులో లాడ్జిలో మకాం వేసి పరిసరప్రాంతాలలో సాధువులా వెళ్లి మహిళలకు మాయమాటలు చెప్పి దోపిడీలకు పాల్పడుతుంటాడని విచారణలో వెల్లడైనట్లు తెలిసింది.

మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

- విచారించాలని కలెక్టర్‌కు వినతి

సంతనూతలపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో గత ప్రభుత్వ యాంలో మండలపరిషత్ నిధుల దుర్వినియోగంపై సోమవారం కలెక్టర్‌కు సంతనూతలపాడుకు చెందిన మందాడి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలపరిషత్ కార్యాలయపు ఖర్చు పేరుతో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులను లక్షల్లో దుర్వినియోగం చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంతనూతలపాడులో వాకింగ్ ట్రాకింగ్ పేరుతో, పార్కు ఎక్యూప్‌మెంట్ పేరుతో రూ.9,23,500 నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొన్ని ప్రభుత్వకార్యాలయాలకు మరమ్మతుల పేరుతో రూ.11,49,600లను దుర్వినియోగం చేసినట్లు ఆయన తెలిపారు. మార్కెట్ యార్డు నుంచి చిన్నచెరువు వరకు , హైస్కూల్ దగ్గర కల్వర్టర్ మరమ్మతుల పేరుతో రూ.4,02,900 నిధులను, పశువుల ఆసుపత్రి నుంచి ఎమ్మెస్సార్ జూనియర్ కళాశాల వరకు రోడ్డు వెడల్పు పేరుతో చేసిన పనికి మళ్లీ చేసినట్లు అదేవిధంగా ఎనికపాడు డొంక రోడ్డు కూడా చేసిన పని మళ్లీ చేసినట్లు చూపి, రూ.9,34,600 స్వాహాచేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం!

(5వ పేజీ తరువాయి)

క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సంబంధిత సమస్యలు ఉన్నవారికి బదిలీల్లో అధికా ప్రాధాన్యం ఇస్తున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నచోటికి బదిలీ అయ్యే అవకాశం కల్పించాలన్నారు. కాగా బదిలీపై వెళ్లే ముందు ఉద్యోగులు వారి బకాయిలను చెల్లించాలి. ఐటీడీఏ ప్రాంతాలకు బదిలీ అయినవారు తప్పనిసరిగా విధుల్లో లేకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

● షెడ్యూల్ ఇలా..

సచివాలయ ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. జూన్ 16న ప్రక్రియ ప్రారంభమై 30వ తేదీ నాటికి పూర్తి కావాలని నిర్దేశించింది.

తేదీ	ప్రక్రియ
జూన్ 15-16	ఉద్యోగి వివరాల నమోదు
జూన్ 16- 18	ఖాళీల నమోదు
జూన్ 22- 24	బదిలీలకు దరఖాస్తులు
జూన్ 25- 29	దరఖాస్తుల పరిశీలన- ఉత్తర్వుల జారీ
జూన్ 30(చివరిరోజు)	అభ్యంతరాల పరిష్కారం
జూన్ 30	అన్ని బదిలీలను పూర్తి చేయాలి
జూలై 10	ఉద్యోగుల వివరాలను హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్లో అప్లోడ్ చేయాలి

అవీ..ఇవీ..

ఏవోగా రాము బాధ్యతల స్వీకరణ

పొన్నలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల నూతన వ్యవసాయాధికారిగా వడ్డె రాము నియమితులయ్యారు. పొన్నలూరులో సోమవారం రాము బాధ్యతలు చేపట్టారు. కందుకూరు నుంచి రాము బదిలీపై రాగా, ఇప్పటిదాకా వ్యవసాయాధికారిగా పనిచేసిన పూర్ణచంద్రరావు సింగరాయకొండకు బదిలీ అయ్యారు.

పశువైద్యాధికారి శివరామకృష్ణ బాధ్యతలు

పొన్నలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు పశువైద్యశాల అధికారిగా జె. శివరామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని చౌటపాలెం పశువైద్యశాలలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానన్నారు. పశుసంవర్ధకశాఖ అందించే గోకులంషెడ్లు, పశ్రుగాసపెంపకం, బీమా, సబ్సిడీపై దాణా వంటి పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

మార్టూరు, జూన్16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు గాయాలైన ఘటన మండలంలోని రాజుపాలెం కూడలిలో సోమవారం చోటుచేసుకొంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చినగంజాం మండలం సంతరావూరు గ్రామానికి చెందిన చుండూరి కోటేశ్వరరావు,సునీత దంపతులు వ్యక్తిగత పనులు నిమిత్తం ద్విచక్రవాహనంపై పెట్లూరివారిపాలెం వెళ్లి పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామం వస్తున్నారు. వారి ద్విచక్రవాహనాన్ని విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో వారు రోడ్డుపై పడడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదానికి కారణమయిన కారుతోపాటు డ్రైవరు మురుగన్ పోలీసుల అదుపులో ఉన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి


జీడిపప్పు కార్మికులు, చిన్నారులకు పుస్తకాలు అందజేస్తున్న నిర్వాహకులు

వేటపాలెం(చీరాల), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జీవనవిధానంలో ప్రతి ఒక్కరూ పిల్లల విద్యాబుద్ధులపై ప్రత్యేక దృష్టిసారిస్తే ఉన్నతంగా రాణిస్తారని వేటపాలెం పట్టభద్రుల సంఘం ప్రతినిధులు అన్నారు. సోమవారం వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని జీడిపప్పు కార్మికుల కుటుంబాల్లోని చిన్నారులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ కార్మికుల జీవితాల్లో వెలుగు నిండాలంటే చక్కనైన చదువే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బట్ట మోహన్‌రావు, నాగాంజనేయులు, శరత్‌బాబు, శేఖర్‌బాబు, బుల్లియ్య, తిలక్, అయ్యప్ప, శ్రీను, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కళాశాలలో రక్తదానం


జ్యోతిస్వరూప్‌ను సత్కరిస్తున్న సూపరింటెండెంట్ శ్రీకాంత్, వైద్యులు


చీరాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సోమవారం సెయింట్ ఆన్స్ కళాశాలలో సోమవారం విద్యార్థులు రక్తదానం చేశారు. ఏటా చీరాల వైద్యశాలకు ఇక్కడి విద్యార్థులు రక్తదానం చేస్తున్నట్లు వైద్యశాల సూపరిండెంట్ డా.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ యేడాది కూడా కళాశాల నుంచి జాతీయ సేవా విభాగం(ఎన్ఎస్ఎస్) కో - ఆర్డినేటర్ డా.జ్యోతి స్వరూప్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. దీంతో ఆయన్ను వైద్యశాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సహకారంతో విద్యార్థులు సైతం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు చెప్పారు.

బడిబయట ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్


విద్యార్థులను కలిసి మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బల్లికురవ. జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బడిమానిన పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. బల్లికురవ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హనుమంతురావు పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి సోమవారం సాయంత్రం మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గతంలో పాఠశాలకు వచ్చి బడికి రాని విద్యార్థులను ఉపాధ్యాయులు కలిసి వారికి చదువు కోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధన్యత ఇస్తోందన్నారు. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ద్వారా నగదు అందజేస్తుందన్నారు. అలానే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాంతో పాటు నాణ్యమైన బియ్యంతో మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్య అందించే బాధ్యత తమది అని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అచ్యుత్‌మోహన్, డేవిడ్‌పాల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టమోటాల ట్రక్కు బోల్తా


రహదారిపై బోల్తాపడ్డ ట్రక్కు

చినగంజాం, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : టమోటాల లోడుతో వెళుతున్న వాహనం చినగంజాం సమీపంలోని జాతీయరహదారి టీ-జంక్షన్ సమీపంలోని రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. హైవే మొబైల్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చిత్తూరు జిల్లా పలమనేరు నుండి బొలెరో పికప్ వాహనం టమోటాల లోడుతో బాపట్లకు వెళ్తుంది. ఈ నేపథ్యంలో వాహనం చినగంజాం సమీపంలోని 216వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ని ఢీ కొట్టి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో వాహనం డ్రైవర్ ఆర్ శ్రీనివాసరావుకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. టమోటాలు అన్ని జాతీయ రహదారిపై పడ్డాయి. వాహనాన్ని హైవే పోలీసులు ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించి రాకపోకలు ఇబ్బంది లేకుండా చేశారు.

కంపుకొడుతున్న మార్టూరు కూడలి

- రోడ్డుపైనే నిలుస్తున్న మురుగునీరు
- ఇరువైపుల సైడ్‌డ్రైన్లు లేకపోవడంతో అవస్థలు
- వర్షాకాలంలో మరింత జఠిలం


మార్టూరు సెంటర్లో రోడ్డుపైన నిలిచిన మురుగునీరు


మార్టూరులో పెద్ద అండరుపాస్ వద్ద నిలబడిన మురుగునీరు

మార్టూరు, జూన్16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్య వైఖరితో మార్టూరు కూడలి దుర్గంధభరితంగా మారుతోంది. రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఆ నీటిపై నుంచి వెళ్లాల్సి వస్తోంది. రోడ్డుకు పడమర వైపు ఉన్న సైడు కాల్వల నుంచి మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. దీంతోపాటు తూర్పు వైపున కూడా సైడు కాలువలు లేవు. దీంతో మురుగునీరు రోడ్డుపైనే నిలుస్తోంది. ఇక ఒక మోస్తరు వానకురిసిందంటే రోడ్డుపక్కన సర్వీసు రోడ్డుపైనే కాకుండా, ఏకంగా జాతీయరహదారిపైనే నీళ్ల భారీగా నిలుస్తున్నాయి. నాగరాజుపల్లి కూడలి నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులో చాలా చోట్ల మురుగునీరు నిలబడుతోంది. అదేవిదంగా మార్టూరులో కొణిదెనరోడ్డు, నాగరాజుపల్లి రోడ్లలోని మిని అండరు పాస్‌లలో కూడా మురుగునీరు బయటకువెళ్లే దారిలేదు. దీంతో దుర్వాసన వస్తుండడంతో పాదచారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దానికితోడు సర్వీసు రోడ్డు పక్కన ఉన్న చికెన్ దుకాణాలు వారు, ఇతరత్రా దుకాణాలు వారు తమదుకాణాలు నుంచి వచ్చే కలుషితనీటిని, మురుగునీటిని రోడ్డుపైకి వెళ్లే విధంగా రోడ్డును పగలగొట్టి తూము ఏర్పాటు చేశారు. దీంతో ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా, సర్వీసురోడ్డులలో రోడ్డును పగలగొట్టిన సంఘటనలు ఉన్నాయి. వానలు కురిసి, రోడ్డుపైన నీళ్ల నిలబడినసమయంలో వాహనదారులకు ఎక్కడ గుంత ఉందో తెలియక, రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. మురుగునీరు రోడ్డుపైన నిలబడకుండా, సైడుకాల్వల్లో సక్రమంగా మురుగునీరు పారేవిధంగా జాతీయ రహదారి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజానికం కోరుతున్నారు.

నామ్ రోడ్డులో పెరిగిన ప్రమాదాలు


పట్టణంలోని రామ్‌నగర్ వద్ద నామ్ రోడ్డును దాటుతున్న గేదెలు

అద్దంకి, జూన్16 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. దీంతో కొంతమంది ప్రాణాలు కోల్పోతుండగా మరికొంత మంది గాయాలబారిన పడుతున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదాలు స్థానికులను, వాహన చోదకులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ ప్రతినిధులకు కనీసం చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అద్దంకి పట్టణంలో వాహనాల వేగ నియంత్రణకు తీసుకున్న చర్యలు లేకపోవడంతో ట్రాఫిక్ రద్దీ లేని సమయంలో మరింత వేగంగా వెళ్తున్నాయి. ప్రధానంగా అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్, అంబేడ్కర్‌బొమ్మ కూడలి, పాతబస్టాండ్ కూడలి, ఆర్టీసీ బస్టాండ్, పోతురాజు గండి, భవానీసెంటర్, కలవకూరు క్రాస్ రోడ్డు, శింగరకొండ క్రాస్ రోడ్ల వద్ద రోడ్డు దాటే వాహనచోదకులు, పాదచారులు ఎక్కువగా ఉంటారు. ఈ నేపథ్యంలో వేగ నియంత్రణ తెలియజేసే విధంగా, ఎంతవేగంతో వెళ్లాలో తెలిపే విధంగా రోడ్డు అంచుల్లో ఆయా ప్రాంతాలలో బోర్డులు ఏర్పాటు చేస్తే కొంతమేర ప్రమాదాలు తగ్గుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భవానీసెంటర్‌లో స్పీడుబ్రేకర్లు ఉండడం, మలుపుకావడంతో వాహనాలు నిదానంగా వెళుతున్నాయి. ప్రధానంగా రామ్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, కలవకూరు క్రాస్‌రోడ్డు, శింగరకొండ క్రాస్ రోడ్ల వద్ద స్పీడు బ్రేకర్ లు ఏర్పాటు చేయడంతో పాటు తగు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఇప్పటికే పోలీస్ అధికారులు నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ అధికారుల దృష్టికి తీసుకు పోయినా స్పందన లేనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా స్పందించి స్పీడు బ్రేకర్లు, బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

లారీని ఢీకొని ద్విచక్రవాహనదారునికి గాయాలు

మార్టూరు,జూన్16(ఆంధ్రజ్యోతి): లారీని ఢీకొని ద్విచక్రవాహనదారుడికి గాయాలైన ఘటన మార్టూరు కూడలి సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకొంది. యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామానికి చెందిన కనపర్తి తేజ అనే యువకుడు వ్యక్తిగత పనులు నిమిత్తం మార్టూరుకు వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో లారీని ఢీకొన్నాడు. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. గాయపడిన ఆయన్ను 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

అద్దంకి, జూన్16(ఆంధ్రజ్యోతి):మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిని సోమవారం అద్దంకి కోర్టులో హాజరుపరచగా, న్యాయాధికారి అఖిల ఒక్కొక్కరికి 2 వేల రూపాయలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

బల్లికురవ. జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో పేకాట శిబిరంపై ఎస్ఐ వై.నాగరాజు సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఘటన స్థలంలో ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి ఉన్న రూ.2800 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పట్టుబడిన జూదరులను కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేత


అభ్యసన సామగ్రిని పంపిణీ చేస్తున్న దాతలు

బల్లికురవ. జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 350 మంది విద్యార్థులకు సోమవారం కనిగిరి ప్రాంతానికి చెందిన అలహరి మహేంద్రనాయుడు అభ్యసన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రదానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయుత అందించిన దాతను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే.శేషగిరిరావు, అలహరి లావణ్య, ప్రదానోపాధ్యాయుడు మారుతి, కుందుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించండి

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య


వాడరేవులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణపై ఆధారపడి జీవించేవారు నియోజకవర్గంలో ఎక్కువ మంది ఉన్నారని, వారి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో పశు వైద్య విభాగం ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో పారదర్శకంగా సేవలు అందించి ప్రజలకు సహకరించాలని సూచించారు. అలాగే సిబ్బందితో సుదీర్ఘంగా చర్చించి సిబ్బంది కొరత ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

నిరుద్యోగ యువతకు చక్కని అవకాశం

నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సమస్యలను గుర్తించి ఈనెల 21న స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య తెలిపారు. ఇందులో సుమారు 40కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9010368533, 7799469699 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలలో సంతృప్తి

చీరాల : రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజలకు అందిస్తున్న పథకాలతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. వాడరేవు మత్స్యకార 100 కుటుంబాలు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువాలతో వారిని ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యాలతో అయోమయంలో ఉన్న ప్రజలకు కూటమి ప్రభుత్వంతో ఉత్సాహం అందిందన్నారు. ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమంతో ప్రజాపార్టీగా నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

- అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు అనంతలక్ష్మి


వేణుగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

అద్దంకిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటి అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి కోరారు. సోమవారం అమరావతిలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ వేణుగోపాలరెడ్డిని తన కార్యాలయంలో తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటి సభ్యులు కలిసి పలు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుకూలంగా కూరగాయలు, వంటగ్యాస్ చార్జీలు పెంచాలన్నారు. అనారోగ్యంతో కొంతమంది యాప్‌ల భారంతో పని చేయలేక పోతున్నారని, ఇలాంటి వారికి వలంటరీ రిటర్మెంట్ అవకాశం కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి లక్ష్మినరసమ్మ, హేమలత, కల్యాణి, కాత్యాయని ఉన్నారు.

అన్నదాత సుఖీభవ అర్హుల గుర్తింపు

పంగులూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 సచివాలయాల పరిధిలో 7,113 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి చేకూరనుందని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. రిజిస్టర్ కాబడిన రైతుల తుది జాబితాను ఆయా రైతుసేవాకేంద్రాలకు పంపించినట్లు తెలిపారు. వీరిలో 6,881 మంది రైతులకు సంబందించి ఈ కేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన 232 మంది రైతులు ఈ నెల 20లోగా సంబందిత రైతుసేవాకేంద్రాలలో ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. రైతుసేవాకేంద్రాలలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితాను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

మేదరమెట్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి)మేదరమెట్లలో వేంచేసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి 41వ వార్షిక బ్రహ్మోత్సవాలను నాల్గవ రోజైన సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, విశేష పూజలు, లక్ష్మీగణపతి హోమాన్ని పండితులు నారాయణం బాలసుబ్రహ్మణ్యాచార్యులు, ఆలయ పూజారి అగ్నిహోత్రం హయగ్రీవాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.దివంగత అరవపల్లి ప్రసాద్ కుమారులు కృష్ణ సుబ్బారావు, నిడమానూరి వెంకటేశ్వర్లు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పాదర్తి కాజారావు, మద్దాలి సంజీవరావు,ఆదూరి ప్రసాద్, పేరకం శ్రీను,మద్దాలి రాఘవరావు,మునగంటి వీర భద్రాచారి, గొల్ల సుబ్బారావు, అరవపల్లి రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా యోగాంధ్ర

- డాక్టర్ దాసరి చంద్రశేఖర్


శిక్షణ ఇస్తున్న చంద్రశేఖర్

పర్చూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం యోగాంధ్ర-2025 కార్యక్రమానికి రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందని యోగాంధ్ర ట్రైనర్, హోమియో వైద్యులు దాసరి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండప ప్రాంగణంలో యోగాంధ్రపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యోగా ట్రైనర్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడంతో మానసిక ఒత్తిడినిన అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయానికి టేబుల్స్ అందజేత


టెబుల్స్‌ను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం అద్దంకి లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయానికి టెబుల్స్‌ను అందజేశారు. రోటరీక్లబ్ మిత్రుల ఆర్థిక సహకారంతో సంఘ కార్యాలయానికి రెండు కంప్యూటర్ బల్లలు, వాల్ క్లాక్‌ను బహూకరించినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అడుసుమల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం నుంచి పీ4 కార్యక్రమం ప్రారంభం


వెంకటరెడ్డికి ట్రై సైకిల్ అందజేస్తున్న కలెక్టర్ వెంకటమురళీ

చినగంజాం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన పీ4 కార్యక్రమం మొట్టమొదటి సారిగా చినగంజాం మండలం నుంచి చేయడం సంతోషకరమని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పీ4 లబ్ధిదారులకు ఆయన చెవిటి మిషన్లు, ట్రై సైకిళ్లను అందజేశారు. మండలంలో ఎంపిక చేసిన 13 మంది లబ్దిదారులకు చేయూతను అందించేందుకు రూ.10.95 లక్షలను అందించినట్లు ఏపీఎం గద్దె పెదసుబ్బారావు తెలిపారు. పెదగంజాం గ్రామానికి చెందిర కే.వెంకటరెడ్డికి ట్రై సైకిల్, ముగ్గురికి చెవిటి మిషన్లు, 9 మందికి వివిధ వ్యాపారాల నిమిత్తం రూ.10 లక్షలను అందజేసినట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు, పీ-4 లబ్దిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం డబ్బులు డ్రా చేసేందుకు బారులు

పోస్టాఫీస్, బ్యాంకుల్లో మహిళలు బారులు


పోస్టాఫీస్ వద్ద క్యూలో ఉన్న మహిళలు


బ్యాంకు తెరవకముందే వేచి ఉన్న మహిళలు

అద్దంకి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాలలో ప్రభుత్వం తల్లికి వందనం నగదు జమ చేసింది. అయితే వరుసగా రెండు రోజులు బ్యాంకులకు సెలవులు కావడంతో సోమవారం అత్యధిక శాతం మంది మహిళలు డబ్బులు డ్రా చేసేందుకు పోస్టాఫీస్, బ్యాంకులకు వెళ్లారు. దీంతో పోస్టాఫీస్, పలు బ్యాంకుల వద్ద రద్ధీ పెరిగింది. ఎక్కడ చూసినా తల్లికి వందనం డబ్బులు డ్రా చేసేందుకు వచ్చిన మహిళలలే ఉన్నారు.. ఎలాగు వచ్చాము కదా అని పలువురు మహిళలు గంటల కొద్ది వేచి ఉండి నగదు డ్రా చేసుకొని వెళ్లారు. అయితే పోస్టాఫీస్, కొన్ని బ్యాంకులలో నగదు సరిపడా లేక వెనుదిరిగారు. మరో రెండు రోజులు ఇదే రద్దీ కొనసాగే అవకాశం ఉండటంతో ఆయా బ్యాంకలు, పోస్టాఫీసులలో ఎక్కువ మొత్తం నగదు అందుబాటు లో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు.

భారత్.. మహా గొప్పది!



'భారత దేశం మహా గొప్పది. ఇక్కడి సంప్రదాయాలంటే నాకెంతో ఇష్టం.' అంటున్నారు ఇటలీకి చెందిన గివాణ్ణి అల్లెగిరిని. దేశంలో పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించడంతోపాటు ఇక్కడి ఆచార సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఆయన సైకిల్‌పై తిరుగుతున్నారు. మే నెల 2వ తేదీన కన్యాకుమారిలో సైకిల్‌పై బయలులేరిన అల్లెగిరిని సోమవారం కొడవలూరు మండలం గండవరం వద్ద ఆగారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ దేశంలోని 12 జ్యోతిర్లింగాలను, వాటితో ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు కన్యాకుమారి నుంచి జమ్మూకాశ్మీర్‌కు సైకిల్ యాత్ర చేస్తున్నట్టు చెప్పారు. తనకు హిందూ ధర్మంపై అపార భక్తి ఉందని, ఇక్కడి సంప్రదాయామన్నా మహా ఇష్టమని చెప్పొకొచ్చారు. ప్రస్తుతం తాను శ్రీశైలం వెళ్లి అక్కడ మల్లికార్జునుడిని దర్శించుకోనున్నట్లు చెప్పారు.

- కొడవలూరు, (ఆంధ్రజ్యోతి)



ఫోన్ చేసిన 15 నిమిషాల్లో

ఘటనా స్థలికి..

- అందుబాటులోకి అత్యాధునిక పెట్రోలింగ్ వాహనాలు
- నెల్లూరు నుంచి తడ వరకు సేవలు

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ప్రమాదం జరిగిన 15 నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకునేలా అత్యాధునిక బొలెరో క్యాంపర్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం సాయంత్రం వెంకటాచలం సమీపంలో ఉన్న స్వర్ణ టోల్‌ప్లాజా వద్ద ఈ వాహనాలను ఎన్‌హెచ్‌ఏఐ నెల్లూరు పీడీ కొండయ్య చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. జీపీఎస్, కెమెరా వంటి అధునాతన ఫీచర్స్ కలిగిన ఈ వాహనాలు నెల్లూరు నుంచి తడ వరకు సేవలను అందిస్తాయని అన్నారు.

- వివరాలు 8లో..

క్యూసీ ఈఈగా ధనుంజయులు

నెల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్ శాఖ క్వాలిటీ కంట్రోల్ నెల్లూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కే ధనుంజయులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన కలువాయి సబ్ డివిజన్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈగా పని చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఇంజనీర్లకు ప్రభుత్వం ఉద్యోగోన్నతులు కల్పిస్తూ పోస్టింగ్‌లు ఇచ్చింది. ఆత్మకూరు డీఈఈగా పనిచేస్తున్న ఆర్ వెంకటేశ్వర్లును ఈఈగా ఒంగోలుకు బదిలీ చేశారు. ఒంగోలులో డీఈఈ ఉన్న ఎం రవి ఉద్యోగోన్నతిపై ఆత్మకూరు ఇరిగేషన్ డివిజన్ ఈఈగా వచ్చారు. టీజీపీ వెంకటగిరి డివిజన్‌లో పనిచేస్తున్న వీ గజేంద్రరెడ్డిని టీజీపీ రెండో డివిజన్ ఈఈగా నియమించారు. అలానే అనంతపురంలో డీఈఈగా పనిచేస్తున్న జీ రాజన్‌బాబును నెల్లూరు నీరు-ప్రగతి ఈఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



విద్యుద్దీప వెలుగుల్లో రామలింగేశ్వరుడి ఆలయం

రామలింగేశ్వరుడి సంబరం

అంకురార్పణతో ఆరంభం

- వైభవంగా బ్రహ్మోత్సవాలు

విడవలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో వెలసి ఉన్న కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం అంకురారోపణతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాలికల్లో సేకరించిన పుట్ట మన్నుపై పాలలో నానబెట్టిన నవధాన్యాలతో అంకురారోపణ కార్యక్రమాన్ని పండితులు వేదమంత్రాలతో జరిపారు. అర్చకులు 9 రోజుల దీక్షా కంకణ ధారణ చేశారు. అర్చకుడు పేరేపి శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, యాగశాల శుద్ధి, కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతికి చెందిన కొండూరు నాగరాజన్ ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ ఈవో మల్లికార్జునరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్, గుమస్తా వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

కాకాణి బెయిల్ తదుపరి విచారణ రేపు

నెల్లూరు (లీగల్), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేస్తూ న్యాయాధికారి యన్. సరస్వతి సోమవారం ఉత్తర్వు చేశారు. అలాగే కాకాణి, మరికొంత మందిపై టోల్‌గేటు పెట్టి అక్రమంగా వసూలు చేశారన్న కేసులో బెయిల్ విచారణను ఈ నెల 19కి వాయిదా వేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఉత్తర్వు చేశారు.

'మీ సమస్య నాకు అర్థమైంది. కానీ నాకు మరో డాక్యుమెంట్ కావాలి!.',

'మీ రికార్డులన్నీ కరెక్టుగానే ఉన్నాయి.. కానీ ఆర్‌హెచ్ కాపీ ఒక్కటి తీసుకురండి!.',

మీరేమో పట్టా అంటున్నారు.. మా రికార్డులు కూడా చూడాలి కదా.. అందుకు సమయం పడుతుంది. ఓ నెల తర్వాత కలవండి!.',

'కలెక్టర్ గారు ఆర్డర్ ఇచ్చారని మీరు చెబుతున్నారు. కానీ మాకు ఇంకా ఆర్డర్ అందలేదు. అందిన తర్వాత మీ సమస్య పరిష్కరిస్తాం!'

- రెవెన్యూ శాఖలో అధికారుల నుంచి ఎక్కువగా వినిపించే మాటలివి.

రె'వెన్యూ'లో డిజిటలైజ్!

- వినూత్న మార్పులకు కలెక్టర్ శ్రీకారం
- వేగంగా భూ సమస్యలు పరిష్కరించే ఆలోచన
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్న యంత్రాంగం





కలెక్టరేట్‌లో పాత భూ రికార్డులను డిజిటలైజ్ చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

సమస్యల మీద వచ్చే ప్రజలకు ఒక పట్టాన రెవెన్యూలో పరిష్కారం కాదు. కొందరు నెలల తిరిగితే.. మరికొందరు ఏళ్లతరబడి తిరుగుతూనే ఉంటారు. చిన్న చిన్న సమస్యలకు కూడా కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో రెవెన్యూ సిబ్బందిలో బాధ్యత పెంచడంతోపాటు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా వేగంగా, నిర్ధిష్ట సమయంలోపు సమస్య పరిష్కరించే ప్రక్రియకు కలెక్టర్ ఓ ఆనంద్ శ్రీకారం చుట్టారు. అందుకు రాష్ట్రంలోనే తొలిసారి వినూత్న ప్రయోగానికి పూను కున్నారు. రెవెన్యూలో సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కలిగిన ఉద్యోగుల ద్వారా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్ యడ్ల నాగేశ్వరరావు నేతృత్వంలో ఈ బృందం పని చేస్తోంది. ఈయనకు గతంలో ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన అనుభవం కూడా ఉండటం గమనార్హం. గడిచిన రెండు నెలలుగా కలెక్టర్, ఈ ఉద్యోగ బృందం సాఫ్ట్‌వేర్ తయారీ పనిలో నిమగ్నమై ఉంది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్ తయారీ పూర్తవగా దానిని వివిధ రకాలుగా పరీక్ష చేస్తున్నారు. ప్రాథమికంగా ఇది సక్సెస్ కావడంతో సీసీఎల్‌ఏకు కూడా పంపారు. అక్కడి నుంచి కూడా అనుమతులు రావడం విశేషం.

- రికార్డులన్నీ డిజిటలైజేషన్

నూతన సాఫ్ట్‌వేర్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం చాలా వరకూ రెవెన్యూ రికార్డులు డిజిటలైజ్ కాలేదు. రోజులు గడిచే కొద్దీ రికార్డులు కూడా చెదలు పట్టి పాడైపోతున్నాయి. అయితే ఇప్పుడు ఈ రికార్డులన్నిటినీ డిజిటలైజ్ చేస్తున్నారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న ఆర్ఎస్ఆర్, అడంగల్, ఎఫ్ఎంబీ, 10(1), డీ రిజిస్టర్, సీలింగ్ రిజిస్టర్‌లే కాకుండా రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న ఆర్‌హెచ్, ఈసీలను కూడా స్కానింగ్ చేయిస్తున్నారు. వీటన్నిటినీ నూతన సాఫ్ట్‌వేర్‌లోకి ఎక్కిస్తున్నారు. ఈ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఉన్నత విద్యావంతులైన కొందరు వీఆర్వోలకు కలెక్టరేట్‌లో విధులు కేటాయించి వారి చేత డిజిటలైజేషన్ చేయిస్తున్నారు. జిల్లాలో 750 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటికే 284 గ్రామాలకు సంబంధించిన పూర్తి రికార్డుల డేటాను నూతన సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం చేశారు. మరో నెల రోజుల్లో మిగిలిన గ్రామాల రికార్డులను కూడా అనుసంధానించనున్నా రు. నూతన సాఫ్ట్‌వేర్‌లో సర్వే నంబ ర్ లేదా ఎఫ్ఎంబీ నంబర్ సెర్చ్ చేస్తే ఆ భూమికి సంబంధించిన రికార్డులన్నీ వచ్చేస్తాయి. దీంతో సమస్య పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు అవకాశం ఏర్పడుతుంది. అలానే నూతన సాఫ్ట్‌వేర్‌ను రెవెన్యూ సిబ్బంది పై పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉంచేలా తయారు చేశారు. ప్రతి అర్జీ ఆన్‌లైన్ ద్వారానే వెళుతుండడం, రికార్డులన్నీ ఆన్‌లైన్‌లోనే ఉంటుండడం తో సమస్య పరిష్కారంలో ఉద్దేశ్య పూర్వకంగా నిర్లక్ష్యం చేస్తే వెంటనే ఆ వివరాలు పైఅధికారులకు తెలిసిపోయేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. ఈ ప్రక్రియ ఫలితంగా రెవెన్యూ రికార్డులను తారుమారు చేసేందుకు కూడా ఆ స్కారం ఉండదు. మరో నెలలో పూర్తిస్థాయిలో సాఫ్ట్‌వేర్‌ను రెడీ చేసి దానిని ప్రభుత్వం వద్ద ప్రెజెంట్ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



కమ్ముకున్న మేఘం

నెల్లూరు నగరాన్ని సోమవారం సాయంత్రం మబ్బులు కమ్మేశాయి. పగలంతా ఎండ, ఉక్కపోతతో అల్లాడిన జనానికి సాయంత్రం చల్లని గాలులు ఆహ్లాదాన్ని పంచాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)

విద్యార్థులకు ఆర్టీసీ ఆసరా! 8

నాటి తప్పులను సవరించలేరా!?

- రీసర్వేతో నష్టపోయాం
- బండగానిపల్లి రైతుల ఆవేదన
- అర్జీలు ఇచ్చినా కానరాని స్పందన



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు(ఫైల్)

ఉదయగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో జరిగిన తప్పులను సవరించాలని తహసీల్దారు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కనికరించడంలేదని బాధిత రైతులు వాపోతున్నారు. మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో జరిగిన భూ రీ సర్వేలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో లేనివారు, చనిపోయిన వారి పేర్లను అడంగల్‌లో నమోదు చేశారని బాధిత రైతులు వాపోయారు. అలాగే ఒకరి భూమి మరొకరికి, విస్తీర్ణంలో తేడాలు తదితర తప్పిదాలు చోటుచేసుకొన్నాయన్నారు. వీటిని సవరించాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదని బాధితులు వాపోతున్నారు. ఇలాంటి బాధితులెందరో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు అర్జీలు ఇస్తున్నారు. కానీ పరిష్కారం మాత్రం లభించడం లేదు.

సంక్షేమ పథకాలకు దూరమయ్యాం

రీ సర్వేలో తప్పిదాలను సవరించాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. మా ఆధీనంలో ఉన్న భూములకు ఎల్‌పీ సర్వేనంబర్ వేరే వాళ్ల పేర్లతో నమోదు చేశారు. వేరే వాళ్ల అనుభవంలో ఉన్న భూములకు మా కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేశారు. నా తల్లి పేరు మీద 4 ఎకరాలు ఉండగా ఆన్‌లైన్‌లో 19 ఎకరాలు చూపుతుండటంతో సంక్షేమ పథకాలకు కూడా దూరమయ్యాం. ఉన్నతాధికారులు వెంటనే మా సమస్యను పరిష్కరించాలి.

- బేరి జనార్దన్‌రెడ్డి, బండగానిపల్లి

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు

సన్నద్ధం



- 21 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- ఉమ్మడి జిల్లాలో 4 చోట్ల నిర్వహణ
- సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్‌లు

నెల్లూరు (విద్య), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పాలిసెట్-2025 ర్యాంకుల ప్రకారం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఈ నెల 21 నుంచి జూలై 3వ తేదీ వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీలోపు ప్రాసెసింగ్ రుసుము చెల్లించాలి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు పాలిసెట్ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

- 4 చోట్ల కౌన్సెలింగ్

ఉమ్మడి నెల్లూరుజిల్లాకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల, కావలిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గూడూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ జరగనుంది. ఉదయం 9 నుంచి మధ్నాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్నాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది.

- ఏ రోజు ఎవరికి?

ర్యాంకులు సాధించిన విద్యార్థులు 4 కళాశాలల్లో ఎక్కడైనా కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చు. 21వతేదీన 1వ ర్యాంకు నుంచి 15వేల ర్యాంకు వరకు, 22న 15,001 నుంచి 32,000 వరకు, 23న 32,001 నుంచి 50,000 వరకు, 24న 50,001 నుంచి 68,000 వరకు, 25న 68,001 నుంచి 86,000 వరకు, 26న 86,001 నుంచి 1,04,000 వరకు, 27న 1,04,001 నుంచి 1,20,000 వరకు, 28న 1,20,001 నుంచి చివరి ర్యాంకు వరకు సర్టిఫికేట్ల పరిశీలన ఉంటుంది. అలాగే విద్యార్థులకు వెబ్ ఆప్షన్‌ల నమోదుకు ఈ నెల 25 నుంచి 30వతేదీ వరకు గడవు ఇచ్చారు. ఈ నెల 25, 26వ తేదీల్లో 1 నుంచి 50వేల ర్యాంకు వరకు, 27, 28వతేదీల్లో 50001 నుంచి 90000 ర్యాంకు వరకు, 29, 30వతేదీల్లో 90001వ ర్యాంకు నుంచి చివర వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. జులై 1వతేదీన వెబ్ ఆప్షన్‌లకు మార్పులు చేర్పులు,3న కళాశాలలు, బ్రాంచ్‌ల కేటాయింపు వివరాలను విడుదల చేస్తారు.

- అవసరమైన సర్టిఫికెట్లు

పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, 4 నుంచి 10వతరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, పదోతరగతి మా ర్కుల జాబితా, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణపత్రాలను తీసుకుని హాజరు కావాలి. నాన్‌లోకల్, ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులు పది సంవత్సరాల తల్లిదండ్రుల నివాస ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలి.

ఆందోళన చెందొద్దు!

పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాము. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా అన్ని ధ్రువపత్రాలతో నిర్ణీత సమయానికి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. ఎవరికైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తాము. అన్ని కేంద్రాల్లోనూ హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశాము.

- డాక్టర్ రామారావు, జిల్లా సమన్వయకర్త

- ఫీజు ఇలా..

షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి 30వతేదీ వరకు విద్యార్థులకు ఆప్షన్ల ఎంపిక ఉంటుంది. జులై 1న అంతకుముందు ఇచ్చిన ఆప్షన్లను మార్చుకోవచ్చు. 3న సీట్ల కేటాయింపులు ఉంటాయి. అలాగే ఓసీ, బీసీ విద్యార్థులు కౌన్సెలింగ్ ఫీజును రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా, దివ్యాంగ విద్యార్థులు ఈనెల 25 నుంచి 28వతేదీ వరకు ధ్రువపత్రాలను ఇచ్చితంగా తీసుకుని విజయవాడలోని బెంజ్‌సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరై పరిశీలన చేసుకోవాల్సి ఉంది.

గ్రామోత్సవంలో పేరంటాలు



వెంగమాంబ గ్రామోత్సవం

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నర్రవాడలో వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలతో వాహనాలను అలంకరించుకొని అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేయించుకుంటారు. ఉదయం సుప్రభాతసేవ, గణపతి పూజ, అభిషేకాలు, హోమాలు జరిగాయి. రాత్రి వెంగమాంబ, గురవయ్యనాయుడుల గ్రామోత్సవం జరిగింది. అమ్మవారి వాహనం ఎదుట చేసిన నృత్యాలు అలరించాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 515

టీడీపీ మైనార్టీ నేత ఖాదర్‌బాష మృతి బాధాకరం: ఎమ్మెల్యే దగుమాటి

కావలి టౌన్, జూన్16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష అలియాస్ ఇట్టు అకాలమరణం బాధాకరమని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి వేరువేరు ప్రకటనలలో సంతాపం వ్యక్తం చేశారు.

పలువురి టీడీపీ నేతల సంతాపం

టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్ బాష (ఇట్టు) అకాల మృతిపై పలువురు టీడీపీ నేతలు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన అకాల మరణ వార్త విని టీడీపీ శ్రేణులతో పాటు వివిధ పార్టీల నేతలు, పట్టణ ప్రముఖులు, ముస్లీంలు సంతాపం తెలిపారు. టీడీపీ రాష్ట్ర నేత మలిశెట్టి కుడి భుజాన్ని కోల్పోయానని కన్నీరుమున్నీరుగా విలపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, పలువురు నేతలు సంతాపం తెలిపారు.

సమస్యల వలయంలో వసతి గృహాలు

విద్యార్థుల అవస్థలు

లింగసముద్రం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వసతిగృహాల్లో సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా 1990వ సంవత్సరంలో నిర్మించిన బీసీ బాలుర వసతిగృహం గత కొన్నేళ్ల క్రితమే శిథిల స్థితికి చేరింది. దీంతో బీసీ సంక్షేమశాఖ అధికారులు ఈ వసతిగృహాన్ని ఖాళీచేయించి, లింగసముద్రంలోని బలిజపాలెం గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని, అందులో నిర్వహిస్తున్నారు.



లింగసముద్రంలో శిథిలావస్థలో ఉన్న బీసీ బాలుర వసతి గృహం

ఇన్‌చార్జ్ వార్డెన్లే దిక్కు

కాగా, బీసీ బాలుర, బాలికల, ఎస్సీ బాలుర వసతిగృహాల్లో కొన్నేళ్ల నుంచి ఇన్‌చార్జ్ వార్డెన్లే విధులు నిర్వహిస్తున్నారు. బీసీ బాలుర వసతిగృహానికి వలేటివారిపాలెం బీసీ వసతిగృహం వార్డెన్ వాకా మాల్యాద్రి, బీసీ బాలికల వసతిగృహానికి కందుకూరులోని కాలేజీ బాలికల వసతిగృహం మ్యాట్రిన్ కృశాన్ ఇన్‌చార్జిలుగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఎస్సీ బాలుర వసతిగృహానికి గుడ్లూరులోని ఎస్సీ బాలుర వసతిగృహం వార్డెన్ శ్రీనివాసులు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. దీంతో వీరు ఈ వసతిగృహాలకు చుట్టపు చూపుగా వచ్చి వెళుతుండడంతో విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడుతోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

కాగా, ఈ మూడు వసతిగృహాల్లో బీసీ బాలికల వసతిగృహాల్లో మాత్రమే సిబ్బంది కొరత లేదు. మిగిలిన బీసీ బాలుర వసతిగృహంలో వంట మనిషి మాత్రమే ఉన్నారు. అటెండరు వాచ్‌మ్యాన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఎస్సీ వసతిగృహంలో వాచ్‌మ్యాన్, వంట మనిషి ఉన్నారు. అటెండరు పోస్టు ఖాళీగా ఉంది. అలాగే విద్యార్థులకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, బెడ్‌షీట్లు ఇంకా రాలేదని వార్డెన్లు మాల్యాద్రి, శ్రీనివాసులు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



త్వరలో కావలిలో ఇంటింటికీ కొళాయి

● సాయిరాం, మున్సిపల్ డీఈ

ముఖాముఖి

కావలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అమృత్ పథకంలో భాగంగా త్వరలో కావలిలో ఇంటింటికీ మంచినీటి కొళాయి కనెక్షన్లు ఇవ్వనున్నట్లు కావలి మున్సిపల్ డీఈ సాయిరాం తెలిపారు.

? కావలి పురపాలక సంఘంలో ఎన్ని గృహాలు ఉన్నాయి.

! 27వేల వరకు గృహాలు ఉన్నాయి.

?ఎన్ని మున్సిపల్ కొళాయి కనెక్షన్‌లు ఇచ్చి ఉన్నారు.

! ఇప్పటివరకు 6,200 కొళాయి కనెక్షన్‌లు ఇచ్చాం.

? ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఎప్పటికి అమలు చేస్తారు.

! త్వరలో అమృత్-1, అమృత్-2 పథకాల కింద ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నాం.

? అమృత్-1 కింద ఎన్ని కొళాయి కనెక్షన్‌లు ఇవ్వాలి... వాటిలో ఎన్ని ఇచ్చారు.

! 7530 కొళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికి 2వేల కనెక్షన్‌లు ఇచ్చాం.

? అమృత్-2 కింద ఎన్ని కనెక్షన్‌లు ఇచ్చేందుకు అవకాశం ఉంది.

! 5వేల కనెక్షన్‌లు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపాం.

? పట్టణంలో అక్రమ కొళాయి కనెక్షన్‌ల క్రమబద్ధీకరణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! అక్రమ కొళాయి కనెక్షన్‌లు గుర్తించేందుకు సచివాలయాలవారీగా సర్వే చేస్తున్నాం, వాటిని త్వరలో క్రమబద్ధీకరిస్తాం.

న్యూస్ బాక్స్

ఉపాధిహామీ పనుల పరిశీలన



ఇంకుడు గుంటలను పరిశీలిస్తున్న ఏపీడీ మృధుల తదితరులు

కొండాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెం గ్రామంలో ఉపాధి పనులను ఏపీడీ మృధుల సోమవారం పరిశీలించారు. గ్రామంలో తమకు ఉపాధి పనులు కల్పించడంలేదని, ఇంకుడు గుంతలు సక్రమంగా పూర్తిచేయలేదని తదితర సమస్యలపై గ్రామానికి చెందిన దామా మల్లికార్జున, కాండ్ర శ్రీహరి, చిమ్మిలి హరిబాబులు చేసిన ఫిర్యాదు మేరకు పరిశీలన చేయడం జరిగిందన్నారు. పరిశీలన అనంతరం ఆమె మాట్లాడుతూ కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీవో మురళీధరరావును ఆదేశించారు. క్షేత్ర సహాయకుడి ద్వారా మస్టర్లు వేయించాల్సి ఉంటుందన్నారు. ఇంకుడు గుంతలు, గోకులం షెడ్డును పరిశీలించిన ఆమె తాము సూచించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటేనే నిధులు విడుదలచేయడం జరుగుతుందన్నారు. పరిశీలన నివేదికను ఉన్నతాధికారులకు అందచేస్తామని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం అమలుపై హర్షం

కొండాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ అమలులో భాగంగా తల్లికి వందనం నిధులు విడుదలచేయడంతో తల్లులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ. 13వేలు విడుదల చేయడం జరిగిందన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం నిధులు త్వరలో ప్రభుత్వం విడుదల చేస్తుందని, దీనికి సంబంధించి ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

67పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 371 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 304 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-48, ఆర్‌ఆర్-5, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-6 కారణాలతో 67బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ. 260.14 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

నిర్దిష్ట వ్యవధిలో సమస్యల పరిష్కారం



అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

కావలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో ఒక్క సోమవారం అని కాకుండా నిత్యం గ్రీవెన్స్ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో వివిధ రకాల భూసమస్యలపై 9 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నందున ప్రతిరోజు అర్జీదారులు వస్తుంటారని, నిర్దిష్ట కాలపరిమితి లోపు వారి సమస్యలు పరిష్కరించటం జరుగుతుందన్నారు. ఎక్కువగా ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ల సర్వే కోసం వస్తున్నారని 1బి, అడంగల్ తదితర భూసమస్యలను అర్జీ ఇచ్చిన 90 నుంచి 105 రోజుల్లో, రేషన్‌కార్డు తదితర సమస్యలు 15 రోజుల కాలపరిమితి తో పరిష్కరించటం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

రైతులకు తప్పిన ఈకేవైసీ తిప్పలు

కందుకూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైతులకు ఈకేవైసీ తిప్పలు తప్పాయి. ఈనెల 20న అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా రైతులంతా తమ ఆధార్‌తో విధిగా ఈ కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. దీంతో గత రెండు రోజులుగా గ్రామ, వార్డు సచివాలయాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద రైతులు ఈ కేవైసీ కోసం బారులుతీరారు. సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవటం, మరోవైపు పథకం అమలు గడువు సమీపిస్తుండటంతో ఈ కేవైసీ పూర్తిచేయించుకోకుంటే తమకు డబ్బులు పడవేమోనన్న ఆందోళనతో రైతులు సచివాలయాలు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈక్రమంలో ఈ కేవైసీ తప్పనిసరి కాదని సోమవారం సాయంత్రానికి వ్యవసాయ శాఖ అధికారులకు ఉన్నతాధికారుల నుంచి కబురందింది.

అంకమ్మ పాత విగ్రహం ప్రతిష్ఠించాల్సిందే !

● ఆచారస్తులు, పెద్దల తీర్మానం



కందుకూరు గ్రామదేవత అంకమ్మ అమ్మవారి పాత విగ్రహం

కందుకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కందు కూరు గ్రామదేవత అంకమ్మ పాత విగ్రహాన్ని కూడా ఆలయంలో ఏదో ఒకచోట ప్రతిష్ఠించాల్సిందేనని ఆలయ పూర్వ ధర్మకర్త, మున్సిపల్ మాజీ చైర్మన్ దివి లింగయ్యనాయుడు నేతృత్వంలో ఆచారస్తులు, కొందరు పెద్దలు సోమవారం ఆలయంలో సమావేశం ఏర్పాటుచేసి తీర్మానించారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన ఆచారస్తులు, దేవర ఇళ్ల పెద్దలు పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహాన్ని పీఠాధిపతులను పిలిపించి వారి సూచనలకు అనుగుణంగా ప్రతిష్ఠ చేయాలని నిర్ణయించటంతో పాటు ఇటీవల దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కూడా ఆపేయాలని నిర్ణయించటం విశేషం.

ప్రభుత్వ స్థలాల్లోని నివాసితులకు న్యాయం చేయాలి

ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

కావలిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 30 ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలకు 150 గజాల స్థలం క్రమబద్ధీకరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కత్తి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి వీ పెంచులయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందించారు. నేతలు మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు రెండు సెంట్ల స్థలం కేటాయించాలని, గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం జీవో తీసుకొచ్చి 6నెలలు అవుతున్నప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని, ఇప్పటికైనా పేదలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో దశల వారీ ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సివస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుపాలు, కృష్ణయ్య, కృష్ణమోహన్, మేడ వెంకటేశ్వర్లు, రమణయ్య, బాబురావు, శైలజ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలి

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యార్థుల తల్లితండ్రులు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. పీడీఎస్‌యు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరవది భాస్కర్ తల్లితండ్రులతో కలిసి మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టం అమలు జరగడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నోట్‌పుస్తకాలు, యూనిఫారాలు అమ్మకూడదన్న నిబంధన పాటించడం లేదని, రకరకాల ఫంక్షన్ల పేరుతో విద్యార్థులను దోచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మహేంద్ర, కాలేషా, సురేష్, తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’లో బడుగు వర్గాలకు అన్యాయం

● ఆర్డీవో కార్యాలయం ఎదుట దళిత సంఘర్షణ సమితి నేతల ధర్నా



ధర్నా చేస్తున్నదళిత సంఘర్షణసమితి నేతలు

కావలి, జూన్ 16 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన తల్లికి వందనం పథకం అమలులో బడుగు వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అందరికీ వర్తించేలా ప్రవేశపెట్టిన ఈ పథకం అమలులో అధికారుల అలసత్వం కారణంగా పేదలకు తల్లికి వందనం అందటంలేదన్నారు. ఈమేరకు సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందచేశారు. అనంతరం మల్లి మాట్లాడుతూ పథకం అమలులో ప్రవేశపెట్టిన నిబంధనల కారణంగా నిజమైన పేదలకు ఈ పథకం వర్తించడం లేదన్నారు. పొలాలు లేనివారికి పొలాలు ఉన్నట్లు చూపించటం, బతుకుతెరువు కోసం ప్రయివేట్ అప్పులుచేసి కారులు నడుపుకుంటున్న వారికి వాహనాలు ఉన్నట్లు చూపటం, అసలు వాహనాలు లేని వారిని కూడా ఆ జాబితాలో చూపటం, అధిక విద్యుత్‌బిల్లుల పేరుతో కొందరిని పథకానికి దూరం చేయటం ఇంకా పలు సాంకేతిక సమస్యలతో బడుగు వర్గాలకు ఈ పథకం అందటంలేదన్నారు. అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం వర్తించేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో శ్రీనివాసులు, చౌటూరి జనార్ధన్, జడ్డా వాసు, జరుగుమల్లి విజయరత్నం, కోటయ్య, నారుబోయిన లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల నిబంధనలు పునః పరిశీలించాలి



కందుకూరు సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కందుకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల కోసం ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు పునః పరిశీలన చేయాలని కోరుతూ కందుకూరు డివిజన్‌లోని ఉద్యోగులు సోమవారం సబ్‌కలెక్టరు తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. ఒకేచోట ఐదేళ్లు పూర్తిచేసుకున్న సచివాలయ ఉద్యోగులందరినీ బదిలీచేయాలని, ఉద్యోగులెవరికీ స్వంత మండలాల్లో పోస్టింగ్‌లు ఇవ్వరాదని మార్గదర్శకాల్లో పేర్కొన్నారని ఒక యూఎల్‌బీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు మరో యూఎల్‌బీ పరిధిలోకి బదిలీలు చేయటం వలన కనీసం వంద కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. తక్కువ జీతాలతో పనిచేస్తున్న తమకు ఈ బదిలీలు ఆర్థిక, మానసిక ఆందోళనకర పరిస్థితులు తెస్తాయని పనిచేస్తున్న యూఎల్‌బీ పరిధిలోనే ఇతర మండలాలకు సచివాలయాలకు బదిలీలు చేసేలా మార్గదర్శకాల్లో మార్పు చేయాలని విజ్ఞప్తిచేశారు.

యోగాపై అవగాహన ర్యాలీ



కలిగిరిలో మానవహారం నిర్మించిన విద్యార్థులు, ఉద్యోగులు

కలిగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీడీఓ ప్రత్యూష పేర్కొన్నారు. సోమవారం యోగాపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, టీవీ రామారావు, ఎంపీడీఓ కార్యాలయం, సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుకూరు పాలిటెక్నిక్‌లో కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం

● 21నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

కందుకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఏడాది నుంచి పాలీసెట్ కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ తెలిపారు. ఈనెల 21వ తేదీ నుంచి పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమవుతుందని తెలిపారు. తొలిరోజు 15వేలు ర్యాంకు వరకు, 22న 32వేలు, 23న 50వేలు, 24న 68వేలు, 25న 86వేలు, 26న లక్షా 4వేలు ర్యాంకు వరకు, 27న లక్షా 20వేలు, 28న ఆపైన ర్యాంకులు ఉన్న విద్యార్థినీ, విద్యార్థులందరికీ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. 25వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లు ప్రక్రియ ప్రారంభమవుతుందని, జూలై 3న సీట్లను కేటాయిస్తారని తెలిపారు. కందుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఈఈఈ ప్రవేశాలతో పాటు ఈ కౌన్సిలింగ్ సెంటర్ నుంచి రాష్ట్రంలోని 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలకు కూడా వెబ్ ఆప్షన్లు నమోదుచేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

కావలిలో..

● కావలి రూరల్ : పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 21వ తేదీ నుంచి 28 వరకు ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ప్రారంభించడం జరుగుతుందని కావలి మండలం రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025 - 2026 విద్యా సంవత్సరానికి ఈనెల 20వ తేదీ నుంచి 27 వరకు విద్యార్థులు ఆన్‌లైన్ ప్రాసెసింగ్ కోసం ఒసి, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ఫీజు చెల్లించాలి. ఆప్షన్ల నమోదుకు ఈ నెల 25వ తేదీ నుంచి 30 వరకు సమయం కేటాయించటం జరిగిందన్నారు. ఆప్షన్‌లలో మార్పు కోసం జూలై 1వ తేదీ, సీట్ అలాట్‌మెంట్ కోసం జూలై 3 నిర్దేశించగా జూలై 4వ తేదీ నుంచి 8 వరకు విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో సెల్ఫ్‌జాయిన్ అయ్యి కళాశాలలో రిపోర్టు చేసుకోవాలని సూచించారు. 21వ తేదీ నుంచి ఆన్‌లైన్ కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్ ఫీజు చెల్లించిన రసీదు, పాలిసెట్ 2025 హాల్‌టికెట్, పాలిసెట్ ర్యాంక్ కార్డు, ఎస్ఎస్సీ మార్కుల మెమో, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, బదిలీ ధ్రువపత్రం, ఒసి విద్యార్థులకు ఈ డబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రాలు ఒరిజనల్‌తో పాటు రెండు సెట్ల జెరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. తదుపరి సమాచారం కోసం 9912983434, 9490079526, 9966797981 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నడిరోడ్డుపై మురుగునీరు

● పాదచారుల అవస్థలు



రైల్వే రోడ్డులో ప్రవహిస్తున్న మురుగునీరు

కావలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ రైల్వే రోడ్డులో నడిరోడ్డుపై మురుగునీరు చేరుతుండటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ఇంజనీరింగ్ కార్యాలయాల పక్కనుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో నడి రోడ్డుపై రైల్వేవారి మురుగునీరు చేరుతోంది. దీంతో ఆమార్గంలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైల్వే ఇంజనీరింగ్ కార్యాలయాల నుంచి వచ్చే మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీ ఉన్నా అది పూడికతో నిండిపోవడంతో ఆ మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు చేట్టాలని పాదచారులు కోరుతున్నారు.



కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్‌లు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 16(ఆంధ్రజ్యోతి) : ఏపీ దర్శన్‌లో భాగంగా ఏడుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు సోమవారం లైసెనింగ్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి ఆధ్వర్యంలో కలెక్టర్ ఆనందను కలిశారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల గురించి కలెక్టర్ వారికి వివరించారు. అనంతరం వారికి ఉదయగిరి ఉడన్ కట్టరీతో తయారు చేసిన వివిధ రకాల వస్తువులను అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, జేసీ కే. కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఐపీఆర్ అధికారిగా శివశంకర్‌రావు



నెల్లూరు(హరనాథపురం), జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి (ఎఫ్ఏసీ)గా ఏ శివశంకర్ రావు నియమితులయ్యారు. ఇక్కడ ఐపీఆర్ డీడీగా పని చేస్తున్న సదారావు విశాఖ పట్నానికి బదిలీ అయ్యారు. శివశంకర్ రావు ప్రస్తుతం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరుగా పని చేస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

భద్రత, భరోసాకు పెట్రోలింగ్ వాహనాలు కీలకం



- ఎన్‌హెచ్ఏఐ పీడీ కొండయ్య చౌదరి
- బొలెరో క్యాంపర్ వాహనాలకు జెండా ఊపి ప్రారంభం

వెంకటాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ప్రయాణించేవారికి భద్రత, భరోసా కల్పించడంలో హైవే పెట్రోలింగ్ వాహనాల పాత్ర ఎంతో కీలకమని ఎన్‌హెచ్ఏఐ నెల్లూరు పీడీ ఎం కొండయ్య చౌదరి తెలిపారు. వెంకటాచలం సమీపంలో ఉన్న స్వర్ణ టోల్ ప్లాజా వద్ద ఎన్ఐఎస్ఎస్ సంస్థ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన కొత్త బొలెరో క్యాంపర్ వాహనాలకు సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, సాంకేతిక సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు తక్షణ సహాయాన్ని కూడా అందిస్తాయన్నారు. ఎన్‌హెచ్ఏఐ, స్వర్ణటోల్ వేతో కలిసి ఎన్ఐఎస్ఎస్ సంస్థ మేనేజింగ్ పార్టనర్‌గా వ్యవహరిస్తుందన్నారు. ఆ సంస్థ ఛైర్మన్, రిటైర్డ్ అదనపు ఎస్పీ కాళహస్తి సత్యనారాయణ చౌదరి ఎన్‌హెచ్ఏఐ సూచనలతో ఈ వాహనాలను తయారు చేయించారన్నారు. ఈ పెట్రోలింగ్ వాహనాలకు జీపీఎస్, కెమెరా వంటి అధునాతన ఫీచర్స్‌తోపాటు అన్ని హంగులను జోడించారన్నారు. 1033కి ఫోన్ చేసిన 15 నిమిషాల్లోనే ఈ వాహనాలు ఘటనా స్థలాలకు చేరుకుంటాయని, నెల్లూరు నుంచి తడ వరకు సేవలను అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణటోల్ వే అధికారులు హరి పాండురంగ స్వామి, చంద్రశేఖర్‌రావు, నాగరాజు, మనోజ్‌కుమార్, విక్రమ సింహారెడ్డి, ఎన్ఐఎస్ఎస్ సంస్థ మేనేజర్ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 70 వినతులు




అర్జీదారుల సమస్యలు వింటున్న మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(క్రైం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో జిల్లా వ్యాప్తంగా 70 మంది పాల్గొని వారి సమస్యలను పోలీసు అధికారులకు విన్నవించుకున్నారు. మహిళా స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఫిర్యాదుల్లో కొన్ని..

- నెల్లూరుకి చెందిన ఎన్ ధనమ్మ ఇంటి స్థలం కోసం వెతుకుతుండగా 2024లో విటరాగ కంపెనీకు చెందిన లెక్కల ప్రసాదరెడ్డి పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో ఇంటి స్థలం కోసం ఆమె ప్రసాదరెడ్డికి రూ.25 లక్షల అడ్వాన్సు ఇచ్చింది. అయితే అతను ఇచ్చిన అగ్రిమెంటు సరైనది కాదని, మోసపోయామని తెలుసుకొని తన నగదు తిరిగి ఇవ్వాలని ఆమె కోరారు. దీంతో రూ.13 లక్షల నగదు ఇచ్చి, మిగిలిన నగదుకు చెల్లుబాటు కాని చెక్కులు రాసిచ్చాడు. చెక్కులు చెల్లుబాటు కాకపోవడంతో బాలాజీ నగర్ పోలీసులను ఆమె ఆశ్రయించింది. మరో రూ.8 లక్షలు ఇచ్చి ఇక రూపాయి కూడా ఇచ్చేది లేదని, ఎక్కడైనా చెబితే చంపుతామని బెదిరిస్తున్నాడని, న్యాయం చేయాలని బాధితురాలు వేడుకొంది.
- దగదర్తికి చెందిన ఓ వ్యక్తితో పాటు మరో 23 మంది వద్ద చిత్తూరుకు చెందిన స్వరూప్ అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి రూ.40 లక్షల నగదు తీసుకున్నాడు. ఉద్యోగాలు ఇప్పించకుండా, నగదు ఇవ్వకుండా మోసం చేశాడు. విచారించి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.
- కోవూరుకి చెందిన ఓ మహిళ కుమారుడికి సాంకేతిక శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని కోవూరుకు చెందిన రోహిత్ అనే వ్యక్తి రూ.6 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడు. తనకు న్యాయం చేయాలని ఆ మహిళ కోరింది.
- ఇందుకూరుపేటకి చెందిన ఓ మహిళ తన భర్త మరణించడంతో ఒంటరిగా ఉంటోంది. దీన్ని ఆసరాగా తీసుకున్న అదే ప్రాంతానికి చెందిన అల్లాడి శీనయ్య తనను లోబర్చుకోవాలన్న ఆలోచనతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడని, రక్షణ కల్పించాలని ఆ మహిళ కోరింది.

విద్యార్థులకు ఆర్టీసీ ఆసరా!

పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత, రాయితీ పాసులు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యాసంస్థలు ప్రారంభం అయ్యాయి. పల్లె ప్రాంతాల్లోని విద్యార్థులు దూరంగా ఉన్న విద్యాసంస్థలకు వెళ్లేందుకు పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రయాణ ఖర్చుభారంగా మారుతుంది. అటువంటి విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ అందిస్తున్న రాయితీ పాస్‌లు వరంగా మారాయి. 10వ తరగతిలోపు చదువుతున్న విద్యార్థినులు, 12 సంవత్సరాలలోపు విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇక ఇంటర్, ఆపై చదువుకుంటున్న విద్యార్థులకు రాయతీ పాస్‌లతో తక్కువ ధరకే బస్సుల్లో ప్రయాణించే సౌలభ్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఆర్టీసీలో రాయతీ పాస్‌లు పొంది ప్రయాణిస్తున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నగదు అందిస్తుంది.

● దరఖాస్తు ఇలా..

ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత, రాయతీతో ప్రయాణించే విద్యార్థులు ముందుగా పాస్‌లు పొందాలి. ఆయా బస్టాండ్లలో ఉన్న బస్సు పాస్ కౌంటర్లలో ఈ పాస్‌లు పొందవచ్చు. ఉచిత పాస్‌లు పొందాలనుకునే వారు ఆధార్‌కార్డు, పాఠశాలల్లో హెచ్ఎంలు ఇచ్చే స్టడీ సర్టిఫికెట్‌తో బస్సు కౌంటర్ల వద్దకు వెళ్లాలి. రాయతీ పాస్‌లకు ఇంటర్ విద్యార్థులు ఆధార్ కార్డు, పదవ తరగతి హాల్ టికెట్, దరఖాస్తుతోపాటు జత చేయాలి. ఆపై తరగతులు చదివే వారు ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ల సర్టిఫికెట్లు అందజేయాలి.

రాయితీ పాసుల రుసుము ఇలా.. (రూ.లలో)

దూరం (కి.మీ)	1 నెలకు	3 నెలలు	8 నెలలు	10 నెలలు	12 నెలలు
5	140	400	1080	1350	1620
10	190	555	1480	1850	2220
15	240	705	1880	2350	2820
20	315	930	2480	3100	3720
25	400	1185	3160	3950	4740
30	435	1290	3440	4300	5160

రాయతీ పాస్‌లు పొందాలనుకుంటే వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 5 కిలోమీటర్ల పరిధి నుంచి 50 కి.మీ పరిధి వరకు రాయతీ పాస్‌లను ఆర్టీసీ అధికారులు అందిస్తున్నారు. గతంలో నెలకోసారి విద్యార్థులు తమ పాస్‌లను రెన్యువల్ చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు నెలకు, మూడు నెలలకు, 8 నుంచి 12 నెలల వరకు ఒకేసారి పాస్‌లను పొందవచ్చు.

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కి 398 వినతులు

● అర్జీలు స్వీకరించిన కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సెలవుపై వెళ్లిన కలెక్టర్ ఆనంద్ తిరిగి సోమవారం విధులకు హాజరై పీజీఆర్ఎస్‌లో పాల్గొనడంతో వందలాది మంది ప్రజలు అర్జీలు సమర్పించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. 398 వినతులను అర్జీదారులు సమర్పించారు. వీటిలో 150 అర్జీలు రెవెన్యూశాఖకు సంబంధించినవి కాగా, పోలీసుశాఖకు 52, సర్వేశాఖకు 51, పంచాయతీ రాజ్‌శాఖకు 24, సివిల్ సప్లయిస్‌కు 14 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను కలెక్టర్ పరిశీలించి, సంబంధించి అధికారులను పిలిచి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

- ఎరుకల కులస్తుల ఆరాధ్యదైవం ఏకలవ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ జిల్లా ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చారు.
- ఆక్రమించిన భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని దుత్తలూరు మండలం సాపంపల్లి- వెంకటంపేటకు చెందిన దియ్యాల పెంచలయ్య కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లికి ప్రభుత్వం మా గ్రామంలో సర్వేనం.303-2లో 3.48 ఎకరాల భూమి ఇచ్చిందన్నారు. అయితే పలుకుబడి కలిగిన వ్యక్తులు అడంగల్‌లో చల్లా రమణమ్మ అని రాయించుకున్నారన్నారు. ఈ భూమి వాస్తవంగా దియ్యాల వేమక్కకు చెందిన భూమిగా పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు.

● తల్లికి వందనం అమలు చేయాలి

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని కలెక్టర్ ఆనంద్‌కు సీఐటీయూ నేతలు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొండాప్రసాద్, సూర్యనారాయణ, శివాజీ, ఆర్ శ్రీనివాసులు, అశోక్, వజ్రమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

సంక్షేమ కార్యక్రమాలు అందించాలి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్ నుంచి సోమవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుకుంటున్న వారి స్పందనను సచివాలయ సిబ్బంది ద్వారా తెలుసుకోవాలన్నారు. వ్యతిరేక స్పందన వస్తే అధికారులు విశ్లేషణ చేయాలని సూచించారు.

ఉపకార వేతనాలకు వివరాలు నమోదు చేసుకోండి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఈ విద్యా సంవత్సరానికి 1 నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఇంజనీరింగ్, డాక్టర్ కోర్సులు చదువుతు న్న బీడీ, సున్నపురాయి, డోలమైట్, మైకా, ఐరన్, ఓర్, మాంగనీస్, సినీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్లు బీడీ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ డిస్పెన్సరీ సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ కాసాని వెంకట భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉపకార వేతనాల కోసం స్కాలర్‌షిప్.జీఓవీ.ఇన్ వైబ్‌సైట్‌లో తమ పూర్తివివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

యోగాంధ్రలో భాగస్వాములు కండి

- జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపు ● పెంచలకోనలో యోగాసనాలు
- పాల్గొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల, అధికారులు

రాపూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం పెంచలకోన ఆలయ సరిసరాలలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, అన్ని శాఖల అధికారుల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేసే ఎన్నో ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందవచ్చని చెప్పారు. ఈ నెల 21న యోగా డే సందర్భంగా జిల్లావ్యాప్తంగా 7వేల ప్రాంతాలను గుర్తించామని, ప్రతిచోటా ప్రజలతో యోగాసనాలు వేయించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతోపాటు ప్రశాంత జీవనశైలి సొంతమవుతుందని అన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధమని, ఆరోగ్యంగా జీవించడానికి యోగసనాలను నిత్యం ఆచరించాలని పిలుపునిచ్చారు. యోగాపై మరింత అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీ నరసింహం, ఎమ్పీడీవో భవాని, సీఐ సత్య నారాయణ, అన్ని శాఖల అధికారులు, యోగ అభ్యాసకులు, విద్యార్థులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు యోగాసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



విద్యార్థుల యోగాసనాలను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్, ఎమ్మెల్యే కురుగొండ్ల తదితరులు

వివాహిత ఆత్మహత్య కేసులో ఒకరికి రిమాండ్

ఉలవపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అక్రమ సంబంధంతో వివాహిత మరణానికి కారణమైన వ్యక్తికి కందుకూరు కోర్టు సోమవారం 14 రోజుల రిమాండ్ విధించింది. ఎస్ఐ అంకమ్మ తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం, గమల్లపాలెం గ్రామానికి చెందిన మహిళకు కావలి మండలం అడవిరాజుపాలెంకు చెందిన గోవర్ధన్‌తో వివాహం అయింది. అదే గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌తో సదరు మహిళకు అక్రమ సంబంధం ఏర్పడింది. విషయం తెలిసిన భర్త గోవర్ధన్ ఆమెను వదిలి మూడేళ్లు అవుతుండగా సదరు మహిళ ప్రియుడు విజయ్‌కుమాతోనే సహజీవనం సాగించింది. కాగా, తన కుటుంబ సభ్యులకు విషయం తెలుస్తుందనే కారణంతో ప్రియుడు సదరు మహిళను మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురిచేస్తు వచ్చాడు. గత నెల ఏప్రిల్ 17న ఉలవపాడు మండలంలోని ఆత్మకూరు పంచాయతీ కుమ్మరిపాలెంలోని సదరు మహిళ అమ్మమ్మ ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. విజయ్‌కుమార్ ప్రేరేపిత మాటలు, మానసిక వేదనతో అదేనెల 19న బాధిత మహిళ ఎలుకల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, అక్రమ సంబంధంతో మహిళ మృతికి కారణమైన విజయ్‌కుమార్‌ని ఆరెస్టు చేసి సోమవారం కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేత మృతి

కావలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చెన్నాయపాలెం పంచాయతీ మూలంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కావలి పట్టణ ఇస్లాంపేటకు చెందిన టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా (50) అలియాస్ ఇట్టు సోమవారం మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కావలి మండలం పెద్దపట్టుపాలెం నుంచి ఆదివారం సాయంత్రం మోటారుబైక్‌పై కావలి వస్తూ మార్గమధ్యంలోని మూలంపేట సమీపంలో అకస్మాత్తుగా రోడ్డుపై అడ్డువచ్చిన గేదెను ఢీకొట్టారు. ఈప్రమాదం లో బైక్ నడుపుతున్న తలారి సుబ్రమణ్యంకు స్వల్ప గాయాలు కాగా వెనుక వైపు కూర్చుని ఉన్న ఖాదర్‌బాషాకు తీవ్రగాయాలు కావటంతో పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు నారా యణ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కావలి ఏరియా వైద్యశాలకు తీసుకువచ్చి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య షాహీదా, మోసిన్, మొ మీనా ఇద్దరు కుమారైలు ఉన్నారు.

సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం వద్దు

బుచ్చిరెడ్డిపాళెం : అంబేద్కర్ నగర్ 7వ వీధిలో ఓ భవనంపై సెల్‌ఫోన్ టవర్ నిర్మాణాన్ని స్థానికులు సోమవారం అడ్డుకుని ఆందోళనకు దిగారు. టవర్ నిర్మించవద్దని మొరపెట్టుకున్నా నిర్వాహకులు రాత్రుల్లో పనులు చేపట్టడాన్ని నిరసిస్తూ అడ్డుకున్నారు.

అతిసార నివారణకు కృషి

● డీఎంహెచ్‌వో సుజాత



డయేరియాపై పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు

నెల్లూరు (వైద్యం) జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అతిసార వ్యాధిని పూర్తిగా నివారించేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత తెలిపారు. డీఎంహెచ్‌వో చాంబర్‌లో సోమవారం స్టాఫ్ డయేరియా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పిల్లలు అతిసారా వ్యాధికి గురికాకుండా వక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఓఆర్ఎస్ ద్రావణం ఉపయోగించాలని తెలిపార. పిల్లలు అతిసారా వ్యాధికి గురయినప్పుడు సొంత వైద్యం తీసుకోకుండా, దగ్గరలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. జిల్లాలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా అతిసారా వ్యాధిపై విస్తృత ప్రచారం చేస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, డెమో కనకరత్నం, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన అందరి బాధ్యత

● వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు

కావలిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన అందరి బాధ్యత అని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం కావలి పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు అధ్యక్షతన యోగ్రాంధ్ర కార్యక్రమం జరుగగా ముఖ్య అతిథులుగా వీసీతో పాటు రిజిస్ట్రార్ డాక్టర్ సునీత పాల్గొని యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన కోసం చేస్తున్న కృషి అభినందనీయమని, ప్రతి ఒక్కరూ వయస్సుతో సంబంధం లేకుండా వ్యాయామం చేయాలని, వ్యాయామంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో యోగా ట్రైనర్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ స్వర్ణలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీ శ్రీనివాస్, డాక్టర్ సుశీల, పీడీ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత తదితరులు

విలువైన పంట భూములు వదులుకోలేం

● కలెక్టర్ ఆనంద్‌కు కరేడు రైతుల వినతి

ఉలవపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇండోసోలార్, భారత్ పెట్రోలియం పరిశ్రమల స్థాపనకు విలువైన మాగాణి పంట భూమలును వదులుకోలేమని మండలంలోని కరేడు గ్రామానికి చెందిన కొందరు రైతులు జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేశారు. సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద జరిగిన ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో కరేడు గ్రామ రైతులు కలెక్టర్‌ను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు సూచించగా రెండు పంటలు పండే భూములు వదులుకొని జీవించలేమని చెప్పినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో మిరియం శ్రీనివాసులు, బత్తుల రమణారెడ్డి, నల్లపరెడ్డి వరద రెడ్డి, అల్పూరి కృష్ణారెడ్డి, దాచూరి వెంకారెడ్డి, గోపిరెడ్డి బ్రహ్మారెడ్డి, వెంకటరెడ్డి, రమణయ్య తదితరులు ఉన్నారు.



కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం ఇస్తున్న కరేడు రైతులు

రాష్ట్రంలో నియంతృత్వ పాలన

● మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

నెల్లూరు (క్రైం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోందని, ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయడం ఖాయమని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసీపీ నేత నారాయణస్వామి అన్నారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో సోమవారం నారాయణస్వామి ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా జైలు బయట ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అండగా ఉంటున్న వైసీపీ నాయకులపై ఎన్ని కేసులు పెట్టాలి, వారిని ఏ విధంగా ఇబ్బందులకు గురి చేయాలన్న ఆలోచనలే తప్ప రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఆయన వెంట ఎమ్మెల్సీ మేరిగ మురళి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, తదితరులు ఉన్నారు.

ఉదయగిరి దుర్గంపై పేలుడు సామగ్రి



దుర్గం కొండపై గుర్తించిన పేలుడు సామగ్రి

ఉదయగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గంపై పేలుడు సామగ్రిని కొందరు యువకులు గుర్తించినట్లు సోమవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల మేరకు.. ఉదయగిరి పట్టణానికి చెందిన కొందరు యువకులు శనివారం రాత్రి పెద్దమసీదు వద్ద నిద్ర చేసేందుకు వెళ్లారు. వారు వెళ్లే సమయానికి కొండపైగల రామ్, కరీంబుగ్గ ప్రాంతంలో దీపాలు వెలుగుతుండటం, కొందరు వ్యక్తులు సంచరిస్తుండటాన్ని గుర్తించారు. ఆ సమయంలో అక్కడికెళ్లేందుకు వారు భయపడ్డారు. రాత్రికి నిద్ర చేసిన తర్వాత ఆదివారం ఉదయం తిరిగి పట్టణానికి వస్తూ రాత్రి దీపాలు వెలుగుతున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ ఓ ప్లాస్టిక్ కవర్‌లో పేలుడు సామగ్రి, భోజనం ప్లేట్లు, ఇతర సామగ్రిని గుర్తించారు. రాత్రి అక్కడ కనిపించినది గుప్తనిధుల తవ్వకాల ముఠానే అని నిర్ధారించుకుని తిరిగి వచ్చేశారు. వారు పట్టణంలో చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

ఉదయగిరి దుర్గాన్ని రాజులు, నవాబులు పాలించిన విషయం తెలిసిందే. వారి పాలనలో వజ్రవైఢూర్యాలు, బంగారాన్ని దాచి ఉంచారని పలువురి నమ్మకం. అందుకనే తరచూ కొండపై గుప్తనిధుల తవ్వకాలు జరుగుతుంటారు. తాజాగా పేలుడు పదార్థాలు గుర్తించడమూ దానికి నిదర్శనం. కాగా, గతంలో కొండపై గుప్తనిధుల తవ్వకాలు జరిపే సమయంలో పేలుడు సంభవించి ఓ వ్యక్తి మరణించిన విషయం విదితమే.